శనివారం 1-7-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 100



'ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత వనరుల ద్వారా రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

vijay sales

Shop On www.vijaysales.com

ఓపెన్ బాక్స్ స్టాక్ క్లియరెన్స్ సేల్



& మరెన్నో!

'ఓపెన్ బాక్స్' సేల్ ద్వారా డిస్ ప్లే చేయబడిన ప్రొడక్ట్స్ పై భారీ తగ్గింపు ఆఫర్లు


డిస్ ప్లే | లాస్ట్ పీస్

50%*

వరకు తగ్గింపు

స్టాకు పరిమితం! త్వరపడండి!

ఈ ఏడాదిలో మరిచిపోలేని సంతోషాలకు శ్రీకారం



అన్ని 'ఓపెన్ బాక్స్ ప్రొడక్ట్స్'పై అదే వారంటీ లభ్యం* !

FREE Delivery within the city limits only.

₹1* Down Payment on BAJAJ FINANCE EMI FINANCE

Up To ₹7,500/- Instant Discount & Cashback on Banks

HDFC BANK | HSBC | YES BANK | AU SMALL FINANCE BANK | one card

MY VS Rewards SHOP.EARN.REDEEM

SCAN FOR STORES

విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్

హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర
అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం

ఏ.ఎస్.రావు నగర్ | అత్తాపూర్ | బీహెచ్ఈఎల్ | పీర్జాదిగూడ (బోడుప్పల్) | హస్తినాపురం | చంపాపేట్ | కొత్తపేట | కొండాపూర్ | కూకట్‌పల్లి | మలక్‌పేట్ | మదీనాగూడ | మెహదీపట్నం
నాగోల్ | నల్లకుంట | నాచారం | శాలిబండ | సుచిత్ర X రోడ్స్ | సన్ సిటీ | టోలీచౌకి | వనస్థలిపురం | వరంగల్ | హన్మకొండ

Scan to Shop Online www.vijaysales.com

*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fee is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com.

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 100

శనివారం 1-7-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



ఐరాసలో కిషన్‌రెడ్డి ప్రసంగం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అరుదైన ఆహ్వానం.. ఐరాస వేదికగా 'హై లెవల్ పొలిటికల్ ఫోరమ్'లో ప్రధాన వక్తగా ప్రసంగించనున్నారు.

వివరాలు 16లో ▸



ఫ్రాన్స్‌లో ఆగని నిరసనలు

ఫ్రాన్స్‌లో పోలీసు కాల్పుల్లో యువకుడి మృతి ఘటన అనంతరం మొదలైన ఉద్రిక్తతలు మూడో రోజు రాత్రి కూడా కొనసాగాయి.

వివరాలు 6లో ▸

పోడు కేసుల మాఫీ

గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ సభలో సీఎం కేసీఆర్



ఆదివాసీ మహిళకు పోడు పట్టా అందజేసిన సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ శాంతికుమారి, ఎమ్మెల్యేలు కోనప్ప, ఆత్రం సక్కు

- ఆలస్యంగానైనా గిరిజనేతరులకూ ఇస్తాం
- ఆదివాసీ, గిరిజనుల పొలాలకు ఉచితంగా త్రీఫేజ్ కరెంట్
- 'గిరి వికాస్' కింద ఉచితంగా బోరు బావులు వేయిస్తాం
- 1.51 లక్షల మందికి 4.06 లక్షల ఎకరాల మేర పట్టాలు
- పోడు భూములకు సంబంధించి రూ.23.56 కోట్ల రైతుబంధు చెక్కు విడుదల
- ధరణి తీసేస్తే మళ్లీ దోపిడీదారుల రాజ్యమే
- వార్ధా నదిపై బ్యారేజీ కోసం రూ.75 కోట్లు మంజూరు
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పట్టాల పంపిణీ ప్రారంభించిన సీఎం

2లో

బండి.. మార్చండి!



- బండి సంజయ్‌ను మార్చాల్సిందేనని అమిత్ షా, సునీల్ బన్సల్, నడ్డా సూచన
- ప్రధాని నిర్ణయం కోసం ఎదురుచూపు
- కిషన్‌రెడ్డిని అధ్యక్షుడిగా నియమించాలనే ఆలోచన
- అధ్యక్ష పదవి చేపట్టేందుకు అంగీకరించని కిషన్‌రెడ్డి
- సంజయ్‌తో కలిసి సమష్టిగా పని చేస్తామని వెల్లడి.. పార్టీలో స్తబ్దతకు నాయకులు కారణం కాదనే వివరణ
- కవితపై చర్యలు లేకపోవడంతోనే ప్రజల్లో అనుమానమని అభిప్రాయం

7లో

మమ్మల్నెందుకు పట్టించుకోరు..!

- బీజేపీలో జోరందుకుంటున్న అసంతృప్త స్వరాలు

- వివరాలు 7లో

అభ్యర్థుల వడపోత షురూ

- అసెంబ్లీ ఎన్నికలపై కాంగ్రెస్ కసరత్తు.. నియోజక వర్గానికి ముగ్గురికి మించకుండా పేర్లు పంపిన టీపీసీసీ
- 70కిపైగా స్థానాల్లో మూడు పేర్లు!..
- పీఈసీ పరిశీలన అనంతరం స్క్రీనింగ్ కమిటీకి..

7లో

భట్టి పాదయాత్ర అంశాలే

మేనిఫెస్టో

రేవంత్ వెల్లడి.. తల్లంపాడులో పాదయాత్ర శిబిరం సందర్శన

క్లుప్తంగా...

ఎన్‌సీసీ డీడీజీగా ఎయిర్ కమాండర్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ)గా ఎయిర్ కమాండర్ వి.ఎం.రెడ్డి నియమితులయ్యారు. ఆయన శుక్రవారం సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉన్నతాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్ల గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించి బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వి.ఎం.రెడ్డి 1989లో భారత వైమానిక దళంలో చేరారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో 35 ఏళ్లుగా పలు హోదాల్లో సేవలందిస్తున్నారు. ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ రేంజ్, ఫ్రంట్ లైన్ ఫైటర్ బేస్‌లో పైలట్ రహిత విమాన స్క్వాడ్రన్‌గా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. న్యూఢిల్లీలోని ఏరోస్పేస్ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్, సికింద్రాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌లో ఆయన శిక్షకుడిగా పనిచేశారు. కాలేజ్ ఆఫ్ ఎయిర్ వార్‌ఫేర్‌లో ప్రతిష్టాత్మక హయ్యర్ ఎయిర్ కమాండ్ కోర్సును పూర్తి చేశారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీసీ)లో జాతీయ భద్రత, వ్యూహ సంబంధిత కోర్సును కూడా పూర్తి చేశారు. యుద్ధవిమాన పైలట్లకు శిక్షకుడిగా 2 వేల గంటలకు పైగా ఆయన గగనతలంలో పనిచేశారు.

సీడీఎంఏ సత్యనారాయణ పదవీ విరమణ



సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖ సంచాలకులు డా.ఎన్.సత్యనారాయణ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్ శుక్రవారం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. మున్సిపల్ విభాగంలో ఆయన అందించిన సేవలను అధికారులు కొనియాడారు. సీడీఎంఏగా పదవీ విరమణ చేసిన సత్యనారాయణ 'రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ'చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్ రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారిగా నియమితులైన సందర్భంగా ఆయనను కూడా సన్మానించారు.

కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రాణి కొనసాగింపు

సాక్షి, హైదరాబాద్: కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రాణి కుముదిని శుక్రవారం పదవీ విరమణ చేశారు. అయితే ఆమెను అదే హోదాలో మరో రెండు సంవత్సరాలు కొనసాగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రిటైర్ అయ్యేనాటికి ఆమె తీసుకుంటున్న వేతనం చెల్లించాలని, అయితే పెన్షన్ మినహాయించి చెల్లింపులు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండేళ్లపాటు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు ఆమె ఈ పదవిలో కొనసాగుతారని తెలిపారు.

ఆలిండియానే కాదు.. ఏపీ ఫస్ట్ ర్యాంకూ మాదే

నీట్‌పై శ్రీచైతన్య ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఇటీవల విడుదలైన నీట్ 2023 ఫలితాల్లో 720కి 720 మార్కులతో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు(బి. అరుణ్ చక్రవర్తి) సాధించిన శ్రీచైతన్య.. శుక్రవారం విడుదలైన ఏపీ స్టేట్ ర్యాంకుల్లోనూ తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించినట్లు శ్రీ చైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్, ఇన్ఫినిటీ లెర్న్ ఫౌండర్-డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. స్టేట్ ఫస్ట్ ర్యాంకు బి. వరుణ్ చక్రవర్తి, మూడవ ర్యాంకు వి.హర్షిల్ సాయి, 4వ ర్యాంకు కె.యశశ్రీ, 5వ ర్యాంకు కె. ప్రణతిరెడ్డి, 7వ ర్యాంకు పి.ఆశిష్, 9వ ర్యాంకు బి. రఘువీర్, 10వ ర్యాంకు వి.వి. వినయ సింహారెడ్డి సాధించినట్లు వివరించారు. 10 లోపు 7, 100 లోపు 66 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అధ్యాపకేతర సిబ్బందిని శ్రీ చైతన్య అధినేత డా.బి.ఎస్.రావు అభినందించారు.

ఇదం జగత్



తొలి భేటీ తేదీనే పలు మార్పులు మార్చాం.. ఇప్పుడిక వేదిక కూడానా...



శుక్రవారం ఆసిఫాబాద్‌లో సీఎం కేసీఆర్ ప్రగతి నివేదన సభకు హాజరైన ప్రజలు

పోడు కేసుల మాఫీ

గిరిజనులకు పోడు పట్టాల పంపిణీ సభలో సీఎం కేసీఆర్

సాక్షి, ఆసిఫాబాద్: రాష్ట్రంలో పోడుసాగు విషయంలో గిరిజనులపై పెట్టిన కేసులన్నింటినీ ఎత్తివేస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. గతంలో అడవులను ఆక్రమించారని కొందరు గిరిజనులపై కేసులు నమోదయ్యాయని, వాటిని ఎత్తేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందుకోసం అనుసరించాల్సిన ప్రక్రియను చేపట్టాలని సీఎస్, డీజీపీలను ఆదేశించామని వెల్లడించారు. రాష్ట్రంలో 1.51 లక్షల మంది గిరిజనులు, ఆదివాసీలకు 4.06 లక్షల ఎకరాలకుపైగా పట్టాలను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. గిరిజనేతరుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వడంలో కొంత సమస్య ఉందని, 75 ఏళ్లుగా వారు ఒకేచోట నివాసం ఉంటున్నట్టు రుజువు చేయాల్సి ఉంటుందని, ఇందుకోసం ఓ ప్రక్రియను తీసుకొచ్చి సమస్యను పరిష్కరించి, ఆలస్యంగానైనా వారికి కూడా పట్టాలు అందజేస్తామన్నారు. కుమురంభీం జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం ఆసిఫాబాద్‌కు వచ్చిన సీఎం కేసీఆర్.. పట్టణంలో ఏర్పాటు చేసిన కుమురంభీం, మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహాలను.. తర్వాత బీఆర్‌ఎస్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, సమీకృత కలెక్టరేట్ సముదాయాలను ప్రారంభించారు. అనంతరం ప్రగతి నివేదన సభలో ఆసిఫాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గాల గిరిజనులకు పోడు పట్టాలు, రూ.23.56 కోట్ల మేర పోడు భూముల రైతుబంధు చెక్కులను మహిళల పేరిట అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ అటవీ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు 'మా గూడెంలో మా రాజ్యం.. మా తండాల్లో మా రాజ్యం'అని చెప్పేవారు. అనేక దశాబ్దాలు పోరాటం చేసినా సాధ్యం కాలేదు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 3 నుంచి 4 వేల గిరిజన గూడేలు, తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశాం. పోరాట యోధుడు కుమురంభీం పేరిట ఆసిఫాబాద్ జిల్లాను ఏర్పాటు చేసుకున్నాం. ఒకప్పుడు బెజ్జూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్లాలంటే చాలా బాధపడేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. మీ ముంగిటకే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలు వచ్చేశాయి. పోడు పట్టాల పంపిణీ ప్రక్రియకు ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టాం. ఒకప్పుడు వర్షాకాలం వచ్చిందంటే గిరిజనులు వ్యాధులతో సతమతం అయ్యేవారు. 'మంచం పట్టిన మన్యం'అంటూ వార్తలు వచ్చేవి. ఇప్పుడా దుస్థితి లేదు. మిషన్ భగీరథ నీళ్లు వచ్చాయి. వైద్య వ్యవస్థను బాగు చేసుకున్నాం. ఇప్పుడు మారుమూల ఆసిఫాబాద్‌కు కూడా వైద్యకళాశాలను సాధించుకున్నాం.

ఆసిఫాబాద్ జిల్లాకు వరాలు..

వార్ధా నదిపై వంతెన కావాలని స్థానిక ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అడిగారు. ఆ బ్యారేజీ కోసం రూ.75 కోట్లు ఇప్పుడే మంజూరు చేస్తున్నా. అలాగే టెక్నికల్ కాలేజీ కావాలన్నారు. ఐటీఐని మంజూరు చేస్తున్నా. బుద్ధుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మినీ ట్యాంక్‌బండ్‌గా నాగమ్మ చెరువును అభివృద్ధి చేస్తాం. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తాం. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు చొప్పున, జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున సీఎం ప్రత్యేక నిధి నుంచి మంజూరు చేస్తున్నాం. మంచిర్యాల జిల్లాలోని 7 మున్సిపాలిటీలు, 311 గ్రామ పంచాయతీలకు కూడా నిధులు మంజూరు చేస్తున్నా.

ధరణి తీసేస్తే దోపిడీయే..

ఇవాళ గుంట నక్కలు అవాకులు చవాకులు పేలుతున్నాయి. రైతుల కోసమే ధరణి తెచ్చాం. కానీ అధికారంలోకి వస్తే ధరణి తీసేస్తామని కాంగ్రెస్ చెబుతోంది. ధరణి తీసేస్తే మళ్లీ పైరవీకారుల, దోపిడీదారుల రాజ్యం వస్తుంది.

పోడు భూములకు ఉచితంగా కరెంటు, బోర్లు

రాష్ట్రంలో 1.51 లక్షల మంది గిరిజనులు, ఆదివాసీలకు 4.06 లక్షల ఎకరాలకుపైగా పోడు పట్టాలను పంపిణీ చేస్తున్నాం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కోరినట్లుగా ఆదివాసీ, గిరిజన బిడ్డల పొలాలకు ఉచితంగా త్రీఫేజ్ కరెంట్‌ను రెండు మూడు నెలల్లో ఇప్పిస్తాం. పట్టాలు పొందిన రైతులకు గిరివికాస్ కింద ఉచితంగా బోర్లు వేయిస్తాం..''అని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. తెలంగాణలో అమలు చేస్తున్న పథకాలు కావాలని పొరుగున ఉన్న మహారాష్ట్ర రైతులు కోరుతున్నారని.. లేదంటే తెలంగాణలో కలిపేయాలని అక్కడి గ్రామాల సర్పంచులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, ప్రశాంత్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కాగా.. కేసీఆర్ ఆసిఫాబాద్‌లో కార్యక్రమం అనంతరం సాయంత్రం 5.15 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరారు. మధ్యలో పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో గోదావరి వంతెన వద్ద ఆగారు. గోదారమ్మకు నమస్కరించి, నదిలో నాణేలు వేసి తిరిగి బయలుదేరి ఎర్రవల్లికి చేరుకున్నారు.



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు పుష్పగుచ్చం అందజేస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్, డీజీపీ అంజనీ కుమార్, ఎమ్మెల్యే కోనప్ప తదితరులు



ఇంద్రకరణ్, కోవా లక్ష్మి, కోనేరు కోనప్పతో కలసి బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేసీఆర్

అల్లూరి 125వ జయంతి వేడుకలకు రాష్ట్రపతి

4న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఉత్సవాలు



సాక్షి, హైదరాబాద్: ఈనెల 4న హైదరాబాద్‌లో జరగనున్న అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొంటారని క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పేరిచర్ల నాగరాజు, నడింపల్లి నానిరాజు తెలిపారు. వారు శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ వేడుకలను గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉత్సవాలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా అల్లూరి జయంతి వేడుకలను గతేడాది జూలై నుంచి ఈ ఏడాది జూలై వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గత ఏడాది భీమవరంలో ప్రధాని మోదీ అల్లూరి కాంస్య విగ్రహావిష్కరణతో సంబరాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు.

టీ-డయాగ్నొస్టిక్స్‌లో ఇక 134 పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో టీ-డయాగ్నొస్టిక్స్ సేవలు మరింత విస్తరించనున్నాయి. ఇప్పటివరకు టీ-డయాగ్నొస్టిక్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా 57 రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తుండగా సీఎం కేసీఆర్ ఆదేశంతో పరీక్షల సంఖ్యను 134కు పెంచుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. దీంతోపాటు కొత్తగా 8 జిల్లాల్లో పాథాలజీ ల్యాబ్‌లు, 16 జిల్లాల్లో రేడియాలజీ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. వాటిని మంత్రి టి.హరీశ్‌రావు శనివారం ప్రారంభించనున్నారు. రంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లోని ప్రాంతీయ ఆస్పత్రి నుంచి వర్చువల్‌గా వాటిని ప్రారంభిస్తారు. కొత్తగా అందుబాటులోకి రానున్న టెస్టుల్లో ప్రైవేటు ల్యాబ్‌లలో రూ. 500 నుంచి రూ. 10 వేల వరకు ఖరీదు చేసే పరీక్షలు కూడా ఉన్నాయి. 2018 జనవరి నుంచి టీ-డయాగ్నొస్టిక్స్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పీహెచ్‌సీ నుంచి అన్ని స్థాయిల దవాఖానాల్లో ఉచిత పరీక్షలు ప్రారంభమయ్యాయి. 57 రకాల పాథాలజీ (రక్త, మూత్ర) పరీక్షలతోపాటు ఎక్స్‌రే, యూసీజీ, ఈసీజీ, 2డీ ఎకో, మామోగ్రామ్ వంటి రేడియాలజీ పరీక్షలు చేస్తున్నారు.

గిరిజనుల కల నెరవేరింది

- జల్, జంగిల్, జమీన్ డిమాండ్ తీరింది
- మానుకోట పోడు పట్టాల పంపిణీ సభలో మంత్రి కేటీఆర్
- కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మవద్దని వ్యాఖ్య
- విభజన చట్టం హామీపై ప్రధాని సమాధానం చెప్పాలని డిమాండ్



లబ్ధిదారులు పిల్లి విజయ శ్రీనుకు డబుల్ బెడ్రూం ఇంటి పట్టా ఇస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, మహబూబాబాద్: గిరిజనుల ఆరాధ్య దైవం కుమురం భీమ్ నినదించిన జల్.. జంగిల్.. జమీన్ డిమాండ్ నెరవేరిందని, ప్రభుత్వం పోడు భూములకు గిరిజనులే యజమానులుగా గుర్తించి పట్టాలు ఇవ్వడం సంతోషకరమని రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖల మంత్రి కె. తారక రామారావు చెప్పారు. ఈ నెల నుంచే వారికి రైతుబంధు, రైతు బీమా కూడా వర్తిస్తుందని తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సమీకృత కూరగాయల మార్కెట్, ఇతర అభివృద్ధి పనులను, 200 డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాన్ని కేటీఆర్ ప్రారంభించారు. తర్వాత ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గిరిజనులకు పోడు భూముల హక్కుపత్రాలను అందజేసి మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటయ్యాక అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని చెప్పారు. 1.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేసుకున్నామని.. మరో 80 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొనసాగుతుందని చెప్పారు. కాలంతో పోటీపడి సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామన్నారు.

ప్రధాని సమాధానం చెప్పాలి

ములుగులో గిరిజన వర్సిటీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని విభజన చట్టంలో పేర్కొన్నారని.. వీటిని ఎందుకు అమలు చేయడం లేదో కొద్దిరోజుల్లో వరంగల్ పర్యటనకు వస్తున్న ప్రధాని మోదీ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అన్నీ ఉచితంగా ఇస్తామంటూ కల్లబొల్లి మాటలు చెప్తోందని.. వారు చందమామను కూడా ఇస్తామంటారని ఎద్దేవా చేశారు. కాగా.. ఎన్నో ఏళ్ల కల అయిన పోడు పట్టాల పంపిణీని చివరికి కేసీఆర్ నెరవేర్చారని మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్‌ను విమర్శిస్తున్న క్రమంలో ఓ దర్జీ కథ చెప్తూ.. కురవి వీరభద్రస్వామిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. ఈ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

శీనన్నా.. ఆరోగ్యం బాగుందా..?

మహబూబాబాద్‌లోని రాంచంద్రాపురం కాలనీలో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించిన మంత్రి కేటీఆర్.. పిల్లి విజయ-శ్రీను దంపతులను గృహప్రవేశం చేయించారు. అనారోగ్యానికి గురై మంచంలో ఉన్న శ్రీనును పలకరించారు. ''శీనన్నా.. ఆరోగ్యం ఎలా ఉంది.. పింఛన్ వస్తుందా? ఎందరు పిల్లలు, ఏం చదువుతున్నారు?''అని అడిగారు. తర్వాత మంత్రి సత్యవతిరాథోడ్ పిల్లి విజయ-శ్రీను దంపతులకు నూతన వస్త్రాలను, డబుల్ బెడ్రూం ఇంటి పట్టాను అందజేశారు.

గోడలకు కళ్లుంటాయి..

గోప్యంగా చూస్తుంటాయి!

ట్రయల్ రూమ్స్, హోటల్ గదుల్లో హిడెన్ కెమెరాలు

- గుట్టుగా వీడియోలు తీసేందుకు యత్నిస్తున్న వైనం
- షాపింగ్, వెకేషన్స్‌లో ఉన్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్



➤ గోడలకు చెవులుంటాయన్నది పాత సామెత. కానీ గోడ లకు కళ్లు కూడా ఉంటాయన్న చందంగా నేటి పరిస్థితులు మారుతున్నాయి. తమిళనాడు తిరు కోవిలూర్ లోని ఓ టెక్స్ టైల్ దుకాణంలో ఇటీవల ట్రయల్ రూంలో దాచిన సెల్‌ఫోన్ ద్వారా యువతులు దుస్తులు మార్చు కొనే వీడి యోలను కొందరు గలీజుగాళ్లు రికార్డు చేయడం తెలిసిందే. ఇలా ఎక్కడో ఒక చోట ఈ తరహా ఘటనలు బయట పడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ట్రయల్ రూంలకు వెళ్లినప్పుడు లేదా హోటళ్లలో బస చేసిన ప్పుడు మహిళలు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

కొందరు సిబ్బందే విలన్లు...

➤ నచ్చిన దుస్తులు సరిపోయాయో లేదో తెలుసుకోవాలంటే వినియోగదారులు ట్రయల్ రూంలకు వెళ్లక తప్పదు. అదేవిధంగా విహారయాత్రలు, ఆఫీస్ పనులపై ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు హోటళ్లలో బస చేయడమూ అనివార్యమే. అక్కడ వాష్‌రూంలను వాడకుండా ఉండలేం. ఇదే అవకాశంగా చేసుకొని కొందరు సిబ్బంది రహస్య కెమెరాలు పెట్టి మహిళల వీడియోలను తీసే దుర్మార్గాలకు ఒడిగడుతున్నారు. హోటళ్లు, దుకాణ యజమానులకు తెలియకుండానే కొందరు సిబ్బంది ఇలాంటి అనైతిక పనులకు పాల్పడుతుండటం యాజమాన్యాలకు తలనొప్పులు తెచ్చిపెడుతోంది.

ఇలా చేస్తే ముప్పు తప్పుతుంది..

- ➤ వస్త్రాల కొనుగోలు కోసం మాల్స్‌కు వెళ్లినప్పుడు ట్రయల్ రూంకు వెళ్లాల్సి వచ్చినా లేదా హోటళ్లలో వాష్‌రూంలు వాడాల్సి వచ్చినా అక్కడి పరిస్థితులను నిశితంగా పరిశీలించాలి. ఏమాత్రం అనుమానాస్పద వస్తువులు కనిపించినా వెంటనే బయటకు వచ్చేయాలి.
- ➤ హోటల్ గదుల్లో బస చేయాల్సి వచ్చినప్పుడు ముఖ్యంగా రాత్రివేళల్లో నిద్రించాలంటే ముందుగా సీలింగ్ ఫ్యాన్ ఉన్న గదుల్లో లైట్లు ఆర్పి సెల్‌ఫోన్ టార్చ్ వేసి చూడాలి. రెడ్‌లైట్ బ్లింక్ అవుతున్నట్లు గమనిస్తే దాన్ని హిడెన్ కెమెరాగా అనుమానించాలి.
- ➤ సెల్‌ఫోన్ టార్చ్ వేస్తూ చూస్తే రహస్య కెమెరాలు ఉండి ఉంటే వాటి లెన్స్‌పై టార్చ్‌పడి రిఫ్లెక్ట్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇలా కూడా రహస్య కెమెరాల ప్రమాదం నుంచి బయటపడొచ్చు.
- ➤ ట్రయల్ రూంలు, హోటల్ రూంలకు ఉన్న తలుపులకు ఏవైనా అనుమానాస్పద రంధ్రాలు ఉన్నట్లు గుర్తించినా.. అందులో ఏవైనా వస్తువులు ఉన్నట్లు గమనించినా వెంటనే యాజమాన్యానికి ఫిర్యాదు చేయాలి.
- ➤ హోటల్ గదుల్లో ఉండే స్పీకర్లు, దోమల మెష్‌ల వెనుక సీక్రెట్ కెమెరాలు పెట్టేందుకు ఉండే అవకాశం ఉన్నందున అలాంటి వాటిని గమనిస్తే వెంటనే అప్రమత్తం కావాలి.
- ➤ ట్రయల్ రూంలు, వాష్ రూంలలో దుస్తులు తగిలించేందుకు ఉండే కర్టెన్ రాడ్స్ లేదా కొక్కాలకు కెమెరాలు పెట్టే అవకాశం ఉంటుంది. అలాంటివి ఉన్నాయో లేదో చూడాలి.
- ➤ బహుళ అంతస్తుల భవనాల్లో ప్రతి గదిలోనూ ఫైర్ అలారాలు సహజంగా కనిపించేవే. ఎరుపు రంగులో ఉండే ఫైర్ అలారాల మాటున కూడా సీక్రెట్ కెమెరాలు పెట్టేందుకు అవకాశం ఉంటుంది. అలాంటి వస్తువులు ఏమైనా ఉన్నాయోనని పరిశీలించాలి.
- ➤ ట్రయల్ రూంలలో, వాష్‌రూంలలో ఉండే అద్దాల వెనుక సైతం మనకు తెలియకుండా కెమెరా పెట్టి రికార్డ్ చేసే ప్రమాదం పొంచి ఉంటుంది. అందుకే మిర్రర్ ట్రిక్ వాడాలి. మీ వేలిని అద్దానికి తాకేలా పెడితే దాని ప్రతిబింబానికి మీ వేలికి దూరం ఉంటే అది నిజమైనది. ఆ వేలు ప్రతిబింబానికి ఆనితే అది రెండోవైపు నుంచి మనం కనిపించే అవకాశం ఉన్నట్లు అనుమానించాలి.

రైతుబంధు కింద నాలుగోరోజు రూ.1,131 కోట్లు పంపిణీ

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతుబంధు పథకం కింద లబ్ధిదారుల ఖాతాల్లో నిధుల జమ ప్రక్రియను మరింత వేగవంతం చేసినట్లు వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 6,64,717 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,131 కోట్లు జమ చేసినట్లు మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రస్తుత సీజన్‌లో నాలుగు రోజుల్లో రూ.4,377.42 కోట్లు రైతులకందించినట్లు వివరించారు. రైతుబంధు పథకాన్ని అమల్లోకి తెచ్చిన తర్వాత 11విడతల్లో మొత్తం రూ.72,910 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రస్తుత సీజన్‌లో రైతుల ఖాతాల్లో రూ.7,720 కోట్లు జమ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

పోడు గోడుకు ఇక వీడ్కోలు

- భద్రాద్రి, ఖమ్మం జిల్లాల్లో పోడు పట్టాల పంపిణీలో మంత్రి హరీశ్
- గిరిజనులపై అటవీ అధికారుల వేధింపులు ఉండవు
- రైతుబంధు, వ్యవసాయ రుణాలు అందుతాయని వెల్లడి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఖమ్మం మయూరి సెంటర్: గిరిజన రైతులు ఎన్నాళ్లుగానో అనుభవిస్తున్న పోడుగోడుకు నేటితో తెర పడిందని ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచతోపాటు ఖమ్మం జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పోడు పట్టాల పంపిణీలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలసి పాల్గొన్నారు. ఉమ్మడి ఏపీలో గడిచిన 60 ఏళ్లలో మూడు లక్షల ఎకరాలకు పోడు పట్టాలు పంచితే.. తమ ప్రభుత్వం ఒక్కరోజులోనే నాలుగు లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు జారీ చేసిందని చెప్పారు. నిన్నటి వరకు ఉంటుందో, ఉండదో తెలియని భూమికి నేటి నుంచి రైతులు యజమానులు కాబోతున్నారని.. ఇకపై అటవీ అధికారుల నుంచి వేధింపులు ఉండవని వివరించారు. పట్టాలతో రైతుబంధు, ఉచిత విద్యుత్, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, ప్రమాద బీమా, పంటల బీమా, వ్యవసాయ రుణాలు పొందవచ్చని చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో డైరెక్టర్లు, కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు అయ్యేందుకు కూడా అర్హత సాధించినట్లేనని పేర్కొన్నారు.

గిరిజన డాక్టర్లు పెరిగారు

గతంలో వానాకాలం వస్తే ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు విజృంభించేవని.. ఇప్పుడు మిషన్ భగీరథ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇతర సౌకర్యాలతో ఆ పరిస్థితిలో మార్పు వచ్చిందని చెప్పారు. ఎస్టీల రిజర్వేషన్లను పది శాతానికి పెంచిన తర్వాత ఏటా డాక్టర్లు అయ్యే గిరిజనుల సంఖ్య రెట్టింపైందన్నారు. కాగా.. ఖమ్మం జిల్లా అభివృద్ధికి తోడుగా ఉన్న సీఎం కేసీఆర్‌కు వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం పది సీట్లు గెలిచి బహుమానంగా ఇవ్వాలని మంత్రి పువ్వాడ అజయ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎంపీలు నామా నాగేశ్వర్‌రావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బానోతు హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, లావుడ్యా రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి ఖమ్మంలో శని పీడ వదిలింది!

''ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాకు పట్టిన శని పీడ వదిలింది. గత ఎన్నికల్లో ఒక్కసీటు గెలిచి తొమ్మిది సీట్లు ఓడాం. మా శని పోవడంతో ఈసారి ఎన్నికల్లో తొమ్మిది సీట్లు గెలుచుకుంటాం. మేం పక్కనపెట్టిన వారిని కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు..''అని ఇటీవల కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్న నేతలను ఉద్దేశిస్తూ హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. గతంలో వారు అడ్డంకిగా మారి పార్టీ ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు.



పాల్వంచలో మంత్రులు హరీశ్‌రావు, అజయ్ చేతుల మీదుగా అందుకున్న పట్టాను ఆనందంగా చూపిస్తున్న మహిళా రైతు పూనెం కౌసల్య

పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తాం

- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: విదేశీ పర్యటనతో తెలంగాణ పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కూడిన ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం ఈనెల 7 వరకు దక్షిణ కొరియాలో పర్యటించనుంది. ఈ బృందం శుక్రవారం దక్షిణ కొరియా రాజధాని సియోల్ చేరుకోగా.. ఆ దేశంలో భారత అధికారులు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గోదావరి నది ఒడ్డునున్న కరీంనగర్ మానేరు రివర్ ఫ్రంట్, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, మహబూబ్‌నగర్‌లోని ట్యాంక్ బండ్ అభివృద్ధి, అద్భుత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్న కేబుల్ బ్రిడ్జ్, మ్యూజికల్ ఫౌంటెన్ జెయింట్ వీల్ వేవ్ పూల్, వాటర్ రైడ్స్, వాటర్ స్పోర్ట్స్, మన్యంకొండ వద్ద తొలిసారిగా నిర్మిస్తున్న రోప్ వే, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయని వివరించారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యంగా తమ ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందం దక్షిణ కొరియా రాజధాని సియోల్ వాటర్ రివర్ ఫ్రంట్‌ను అధ్యయనం చేస్తున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు.

నేడు గ్రూప్-4 పరీక్ష..

- రాష్ట్ర వ్యాప్తంగా 2,878 కేంద్రాల్లో పరీక్ష

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-4 పరీక్షకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరిగే ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 9.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. దాదాపు 9 లక్షల మంది హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు శుక్రవారం టీఎస్‌పీఎస్సీ తెలిపింది. మొత్తం 2,878 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పేపర్-2 పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు పేర్కొంది. ప్రతి పరీక్ష కేంద్రంలో ఇద్దరు పోలీసు అధికారులకు డ్యూటీలు కేటాయించారు. ప్రధానంగా అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించేందుకు ఒక మహిళా కానిస్టేబుల్, జనరల్ కానిస్టేబుల్ ఉంటారని తెలిపింది. వీరు అభ్యర్థుల హాల్‌టికెట్లు, ఫొటో గుర్తింపు కార్డును పరిశీలించిన అనంతరం అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే హాలులోకి అనుమతిస్తారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రానికి అభ్యర్థులు చేరుకోవాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది.

దోస్త్ రెండో దశలో 49 వేల సీట్లు

జూలై 24 నుంచి డిగ్రీ తరగతులు • నేటి నుంచి మూడో దశ కౌన్సెలింగ్



రెండో దశలో కేటాయించిన సీట్లు	
కోర్సు	సీట్లు
ఆర్ట్స్	6,307
కామర్స్	21,255
లైఫ్‌సైన్స్	11,944
ఫిజికల్ సైన్స్	9,076
డేటా సైన్స్	431
డి.ఫార్మసీ	203
ఇతర కోర్సులు	51

సాక్షి, హైదరాబాద్: దోస్త్ రెండో దశ సీట్ల కేటాయింపును ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి శుక్రవారం ప్రకటించారు. ఈ దశలో మొత్తం 49,267 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించినట్టు వెల్లడించారు. ఇందులో 35,195 మంది వారు పెట్టుకున్న మొదటి ఆప్షన్ మేరకే ఆయా కాలేజీలు, కోర్సుల్లో సీట్లు పొందినట్టు తెలిపారు. 14,072 మందికి రెండో ఆప్షన్ మేరకు సీట్లు వచ్చినట్టు వివరించారు. ఈ దశలో సీట్లు పొందిన విద్యార్థులు జూలై 14 వరకూ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు. తొలిదశలో 73 వేల సీట్లను కేటాయించారు. ఇందులో 60 వేలకుపైగా విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారు.

నేటి నుంచి మూడో దశ కౌన్సెలింగ్

దోస్త్ మూడో విడత కౌన్సెలింగ్ శనివారం నుంచి మొదలవుతుందని లింబాద్రి తెలిపారు. విద్యార్థులు జూలై 14 వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, 15వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని తెలిపారు. మూడో విడత సీట్ల కేటాయింపు జూలై 20న ప్రకటిస్తామన్నారు. డిగ్రీ తరగతులు జూలై 24 నుంచి మొదలవుతాయని వెల్లడించారు.

కిలో టమాటా రూ.140



రవీంద్రనగర్ మార్కెట్‌లో టమాటాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

చింతలమానెపల్లి: కుమురంభీం జిల్లా చింతలమానెపల్లి మండలం రవీంద్రనగర్ వారసంతలో శుక్రవారం టమాటా కిలో రూ.140 పలికింది. జూన్ నెల ఆరంభంలో రూ.60 కిలో చొప్పున విక్రయించగా..ఆ తర్వాత రూ.80 నుంచి రూ.100కు చేరింది. టమాటా రూ.140కు చేరడం ఇదే మొదటి సారని వ్యాపారులు తెలిపారు. టమాటాను ఏపీలోని గుంటూరు, మదనపల్లె, కర్ణాటకలోని కోలార్, మహారాష్ట్రలోని నాగ్‌పూర్, లాతూర్, నాసిక్ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు హోల్‌సేల్ వ్యాపారులు పేర్కొన్నారు. టోకు వ్యాపారుల నుంచి 22 కిలోల టమాటాల పెట్టె రూ.2,400 ధర పలుకుతోందని, దీంతో తాము కిలో రూ.140 చొప్పున విక్రయించాల్సి వస్తోందని చిరు వ్యాపారులు వెల్లడించారు.

జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ భేటీ రేపు

ఇళ్ల స్థలాల సమస్యపై చర్చ • కోర్టు ధిక్కారం కేసుకు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ (జేఎన్‌జే మ్యాక్ హౌసింగ్ సొసైటీ) సభ్యులతో జూలై 2న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు జేఎన్‌జే హౌసింగ్ సొసైటీ ఫౌండర్ మెంబర్ పి.వి.రమణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరగనున్న ఈ సమావేశంలో రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, సుప్రీంకోర్టు న్యాయవాది రామచంద్రరావు, విమలక్క, పీవోడబ్ల్యూ సంధ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తుది తీర్పు మేరకు పేట్‌బషీరాబాద్‌లోని 38 ఎకరాలను వెంటనే జేఎన్‌జే హౌసింగ్ సొసైటీకి కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్టు తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి 10 నెలలైనా ప్రభుత్వం స్పందించకపోవడంతో.. సభ్యులే కోర్టు ధిక్కారం కేసు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

నేడు కాచిగూడ-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విజయవాడ మీదుగా శనివారం కాచిగూడ-కాకినాడ టౌన్ మధ్య ప్రత్యేక రైలు నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. కాచిగూడ-కాకినాడ టౌన్ (07215) ప్రత్యేక రైలు శనివారం రాత్రి 8.30 గంటలకు కాచిగూడలో బయలుదేరి ఆదివారం ఉదయం 7.30 గంటలకు కాకినాడ టౌన్ చేరుకుంటుంది. ఈ రైలు మల్కాజ్‌గిరి, నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్‌లలో ఆగుతుంది.

అమెరికాకు సిరిసిల్ల వస్త్రాలు

- ట్విట్టర్‌లో అభినందించిన మంత్రి కేటీఆర్



అపెరల్ పార్క్‌లో రెడీమేడ్ వస్త్రాలను కుడుతున్న మహిళలు

సిరిసిల్ల: సిరిసిల్ల అపెరల్ పార్క్‌లోని గోకుల్‌దాస్ సంస్థలో గ్రీన్‌నీడిల్ యూనిట్‌లో జిల్లా మహిళలు ఉత్పత్తి చేసిన రెడీమేడ్ వస్త్రాలు సిరిసిల్ల బ్రాండ్‌తో అమెరికాకు ఎగుమతి అవుతున్నాయి. ఈ విషయాన్ని ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు శుక్రవారం ట్విట్టర్‌లో పంచుకున్నారు. సిరిసిల్ల అపెరల్‌పార్క్‌లో రెండేళ్లుగా రెడీమేడ్ వస్త్రాలు తయారవుతున్నా సిరిసిల్ల కాకుండా.. బెంగళూర్ బ్రాండ్‌తో ఎగుమతి అయ్యేవి. ఇటీవల సిరిసిల్ల బ్రాండ్‌తో అమెరికాకు నేరుగా ముంబయి నుంచి నౌకలో వెళ్తున్నాయి. అపెరల్ పార్క్‌లో 3.25 ఎకరాల్లో 66 వేల చదరపు అడుగులతో రూ.24 కోట్లతో గోకుల్‌దాస్ రెడీమేడ్ వస్త్రాల తయారీ యూనిట్‌ను ప్రారంభించారు. ఇందులో ప్రస్తుతం 500 మంది స్థానిక మహిళలు ఉపాధి పొందుతుండగా.. మరో 500 మందికి త్వరలోనే ఉపాధి కల్పిస్తామని గ్రీన్‌నీడిల్ సంస్థ ప్రకటించింది. రెండు కంటైనర్లలో సిరిసిల్ల బ్రాండ్‌తో ముంబయికి రెడీమేడ్ వస్త్రాలు ఎగుమతి కావడంపై మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందనలు తెలిపారు.

ఐఐటీల్లో ఆధునిక బోధన

కోవిడ్ కాలంలో ఇంటర్ స్థాయిలో విద్యార్థులు నష్టపోయిన చదువుల భర్తీకి నిర్ణయం

- కొత్త సిలబస్‌ను ఈ ఏడాది నుంచే అందుబాటులోకి తేవాలని కేంద్ర నిర్ణయం
- దీనిపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు కోరిన కేంద్ర విద్యాశాఖ
- ఫస్టియర్ ఐఐటీయన్లలో చదవాలనే జిజ్ఞాస ఉండట్లేదన్న నిపుణుల అభిప్రాయం నేపథ్యంలోనే..

కొన్నేళ్లుగా అడ్వాన్స్‌డ్‌లో అర్హత మార్కుల తీరు ఇలా ఉంది

కేటగిరీ	2022	2021	2020	2019	2018	2017
జనరల్	55	63	69	93	90	128
ఈడబ్ల్యూఎస్	50	56	62	83	81	115
ఓబీసీ	50	56	62	83	45	64
ఎస్సీ	28	31	34	46	45	64
ఎస్టీ	28	31	34	46	45	64
పీడబ్ల్యూడీ	28	31	34	46	45	64



సాక్షి, హైదరాబాద్: దేశంలోని ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో బోధన విధానంలో మరిన్ని మార్పులను కేంద్రం సూచిస్తోంది. కోవిడ్ వ్యాప్తి తర్వాత ఐఐటీల వైపు చూసే విద్యార్థుల చదువుల పరిస్థితిపై గతేడాది కేంద్ర విద్యాశాఖ అంతర్గత అధ్యయనం చేసింది. రెండేళ్లుగా విద్యార్థులు అడ్వాన్స్‌డ్ అంటేనే భయపడుతున్నారని ఈ సర్వేలో తేలింది. మెయిన్స్ వరకే విద్యార్థులు పరిమితం కావడం వెనుక బలమైన కారణాలున్నాయని కేంద్రం గుర్తించింది. కోవిడ్ కాలంలో రెండేళ్ల పాటు జరిగిన విద్యానష్టం వల్ల విద్యార్థుల్లో జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో అర్హత సాధించడం కష్టమనే భావన వచ్చిందని పరిశీలనలో తేలింది. అన్ని రాష్ట్రాల్లోనూ రెండేళ్లు 70 శాతమే సిలబస్ అమలు చేయడంతో కొన్ని చాప్టర్స్ విద్యార్థులకు అర్థంకాలేదని.. ఐఐటీలు, ఎన్ఐటీల్లో ఉన్న సిలబస్‌లో ఈ చాప్టర్లపట్ల శ్రద్ధ పెట్టలేకపోతున్నారని తేలింది. ఐఐటీల్లో సీట్లు పొందిన మొదటి సంవత్సరం చదవాలనే జిజ్ఞాస విద్యార్థుల్లో ఉండటం లేదని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంటర్ స్థాయి నుంచి నష్టపోయిన చాప్టర్స్‌ను ఆధునిక పద్ధతిలో వారికి బోధించే ఓ ప్రక్రియ ఉండాలని కేంద్రం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన కొత్త సిలబస్‌ను ఈ ఏడాది నుంచే అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. దీనిపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు కోరింది.

కొన్నేళ్లుగా అడ్వాన్స్‌డ్‌కు హాజరవుతున్న, అర్హత సాధిస్తున్న వారి సంఖ్య.

సంవత్సరం	అర్హత	అర్హులు	రాసినవారు
2022	2,10,251	1,55,538	40,712
2021	2,50,597	1,41,699	41,862
2020	2,50,681	1,50,838	43,204
2019	2,45,194	1,74,432	38,705
2018	2,31,024	1,65,656	31,988
2017	2,21,834	1,71,000	51,000

అమ్మో ఐఐటీ...

కోవిడ్ కాలంలో రాష్ట్రాలు సిలబస్ తగ్గించినా... జేఈఈ పరీక్షల్లో మాత్రం అన్ని చాప్టర్ల నుంచి ప్రశ్నలు ఇస్తున్నారు. జేఈఈ మెయిన్స్ వరకూ చాయిస్ వల్ల విద్యార్థులు పెద్దగా ఇబ్బంది పడటం లేదు. కానీ అడ్వాన్స్‌డ్‌కు వచ్చే సరికి కష్టంగా భావిస్తున్నారు. ఈ కారణంగా అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినా.. పరీక్ష రాసే వారి సంఖ్య తగ్గుతోంది. దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది వరకూ జేఈఈ మెయిన్స్ రాస్తున్నారు. వారిలో 2.50 లక్షల మందిని అడ్వాన్స్‌డ్‌కు ఎంపిక చేస్తున్నారు. ఇలా అర్హత పొందే 2.50 లక్షల మందిలో పరీక్ష రాస్తున్న వారు మాత్రం 60 శాతం మించి ఉండటం లేదు. ఇలా రాసేవాళ్లలోనూ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులయ్యే వారు 30 శాతం కూడా ఉండటం లేదు. కోవిడ్ తర్వాత ఈ పరిస్థితి దారుణంగా ఉంటోంది. అర్హత సాధించాం కాబట్టి అడ్వాన్స్‌డ్‌కు హాజరవుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. 2022 జేఈఈ ఫలితాలను పరిశీలిస్తే అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణత 26.17 శాతంగానే నమోదైంది. 2021లో ఇది 29.54 శాతంగా ఉంది. 2022లో అడ్వాన్స్‌డ్‌కు 2.5 లక్షల మంది అర్హత సాధిస్తే పరీక్ష రాసింది మాత్రం 1,55,538 మంది మాత్రమే కావడం గమనార్హం. వారిలో ఉత్తీర్ణులైంది 40,712 మంది. 2023లో 1.46 లక్షల మంది పరీక్ష రాస్తే 24.26 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

కోవిడ్ వేళ అర్థంకాని ఆన్‌లైన్ కోచింగ్...

2019 నుంచి 2021 వరకూ కోచింగ్ తీసుకొనేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఆన్‌లైన్ కోచింగ్ పెరిగింది. కానీ గ్రామీణ, ఒక మాదిరి పట్టణ కేంద్రాల్లో చదువుకున్న విద్యార్థులు స్థానికేతరులు చెప్పే ఆన్‌లైన్ కోచింగ్‌ను అర్థం చేసుకోలేకపోయారు. 2022లో కోచింగ్ కేంద్రాలు తిరిగి తెరుచుకున్నా, నాణ్యతలేని ఫ్యాకల్టీ చాలా చోట్ల ఉందనే వాదన వినిపిస్తోంది. దీనికితోడు రెండేళ్లుగా చదువులో వెనుకబడటం కూడా జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్‌లో శ్రద్ధ తగ్గడానికి కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. అడ్వాన్స్‌డ్‌కు హాజరయ్యే ఎస్సీ అభ్యర్థులు 31.67 శాతం ఉత్తీర్ణత సాధిస్తే, ఎస్టీ అభ్యర్థులు 26.83 శాతం, ఓబీసీ అభ్యర్థులు 16.44 శాతం అర్హత పొందారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో జేఈఈతోపాటు ఐఐటీల విద్యావిధానంలోనూ మార్పులు అనివార్యమని కేంద్ర విద్యాశాఖ భావిస్తోంది.

40 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాత్కాలిక హాల్ట్‌లు

- ప్రయాణికుల స్పందన ఉంటే కొనసాగింపు: దక్షిణ మధ్య రైల్వే

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 40 ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపుల జాబితాను పెంచింది. ఇకనుంచి కొన్ని స్టేషన్లలో తాత్కాలికంగా ఆగనున్నట్లు పేర్కొంది. ఆరు నెలలు పరిశీలించి, ప్రయాణికుల నుంచి స్పందన మెరుగ్గా ఉంటే కొనసాగిస్తామని తెలిపింది. తిరుపతి-లింగంపల్లి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్, చెన్నై-సికింద్రాబాద్-విశాఖ ఎక్స్‌ప్రెస్, నాగర్‌సోల్-నర్సాపూర్, లింగంపల్లి-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, భద్రాచలం రోడ్డు-బల్లార్షా ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-హజ్రత్ నిజాముద్దీన్ దక్షిణ్ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్, ఎర్నాకులం-పట్నా ఎక్స్‌ప్రెస్, మైసూరు-దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్, రామేశ్వరం-బెనారస్ ఎక్స్‌ప్రెస్, హజ్రత్ నిజాముద్దీన్-తిరుపతి సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-మణుగూరు ఎక్స్‌ప్రెస్, చార్మినార్-పద్మావతి ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్, ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, కొండవీడు ఎక్స్‌ప్రెస్, యశ్వంతపూర్-లక్నో ఎక్స్‌ప్రెస్, కాచిగూడ-చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్, లోకమాన్య తిలక్-మధురై ఎక్స్‌ప్రెస్, లోకమాన్య తిలక్-కరైకల్ ఎక్స్‌ప్రెస్, నాగర్‌కోయల్-సీఎస్ఎంటీ ఎక్స్‌ప్రెస్, నాగర్‌కోయల్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్, చెంగల్పట్టు-కాకినాడ ఎక్స్‌ప్రెస్, డెల్టా ఎక్స్‌ప్రెస్, హిమసాగర్ ఎక్స్‌ప్రెస్, పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్, బిలాస్‌పూర్-ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కాకినాడ టౌన్ ఎక్స్‌ప్రెస్, రాప్తి సాగర్ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, గుంటూరు-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-కాచిగూడ ఎక్స్‌ప్రెస్, సెవెన్‌హిల్స్ ఎక్స్‌ప్రెస్, యలహంక-కాచిగూడ ఎక్స్‌ప్రెస్‌లలో కొన్ని తాత్కాలిక స్టాపులను ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజలు, సంఘాలు, ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల ఆధారంగా దక్షిణ మధ్య రైల్వే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

ఎవరు భక్తితో ఆకునో, పువ్వునో, ఫలాన్నో, నీటినో
నాకు సమర్పిస్తారో ఆ శ్రద్ధా మనస్కులు భక్తితో
ఇచ్చిన దానిని నేను స్వీకరిస్తాను.
– భగవద్గీత

ఫోకస్

సాక్షి

శనివారం, 1 జూలై 2023

సంకుచితమైన తీర్పు

అబార్షన్ల విషయంలో మహిళల రాజ్యాంగ హక్కుని కాలరాస్తూ నిరుడు జూన్‌లో తీర్పునిచ్చిన అమెరికా సుప్రీంకోర్టు... జాతి ఆధారంగా విద్యాసంస్థల అడ్మిషన్లలో ప్రాధాన్యం కల్పించే విధానానికి మంగళం పాడి తనది వెనకడుగేనని మరోసారి నిరూపించుకుంది. గత అరవైయ్యేళ్లుగా అమలవుతున్న ఈ విధానం రాజ్యాంగంలోని 14వ అధికరణకు విరుద్ధమని 6–3 మెజారిటీతో ధర్మాసనం గురువారం తీర్పునిచ్చింది. ధర్మాసనంలో అత్యధికులు రిపబ్లికన్‌ల ఏలుబడిలో వచ్చినవారే. మన దేశంలో శతాబ్దాలుగా వివక్ష ఎదుర్కొంటున్న అట్టడుగు కులాలకు కోటా కల్పించిన విధంగానే అమెరికా విద్యాసంస్థల్లో కూడా నల్లజాతీయులు, ఇతర మైనారిటీ వర్గాలకు ప్రవేశాల్లో ప్రాధాన్యమిస్తున్నారు. ఆ వర్గాలపై శతాబ్దాలుగా అమలవుతున్న వివక్షపై డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ నేతృత్వంలో సాగిన చరిత్రాత్మక పోరాటాల ఫలితంగా అక్కడి సమాజం తనను తాను సరిదిద్దుకునే క్రమంలో ఈ విధానం అమల్లోకి వచ్చింది. అయితే ఈ క్రమం అసంపూర్ణంగానే ఉన్నదని తరచు నిరూపణ అవుతూనే ఉంది. వర్ణ వివక్ష, దాన్ని వెన్నంటి ఉండే వ్యవస్థీకృత హింస ఇంకా సమసిపోలేదు. ఎలాంటి నేర నేపథ్యమూ లేని జార్జి ఫ్లాయిడ్ అనే ఒక నల్లజాతీయుణ్ణి 2020లో మినియాపొలిస్ నగరంలో ఒక పోలీస్ కానిస్టేబుల్ ఎంత క్రూరంగా, ఎంత నిర్దాక్షిణ్యంగా హతమార్చాడో, దాని పర్యవసానంగా ఎంత హింస చెలరేగిందో ప్రపంచమంతా చూసింది. ఆ ఘటనకు ముందూ వెనుకా అనేకానేకమంది నల్లజాతీయులు పోలీసు హింసకు బలయ్యారు. వందల ఏళ్లపాటు బానిసత్వంలో మగ్గిన పర్యవసానంగా వారు చదువులకు దూరమయ్యారు. కనుక మెరుగైన ఉపాధికి వారు దూరం. అసలు 1964 వరకూ పౌరహక్కులే లేవు. ఆ మరుసటి ఏడాది వారికి తొలిసారిగా ఎన్నికల్లో ఓటేసే హక్కు లభించింది. ఇదంతా నల్లజాతీయుల మొక్కవోని పోరాటాల, త్యాగాల ఫలితం. ఆ హక్కులకు కొనసాగింపుగానే 1965 జూన్‌లో అప్పటి అమెరికా అధ్యక్షుడు లిండన్ జాన్సన్ 'నిశ్చయాత్మక చర్య'కు సంసిద్ధం కావాలని, నల్లజాతీయులకూ, ఇతర మైనారిటీలకూ ప్రవేశాల్లో ప్రాధాన్యతనీయాలని విద్యాసంస్థలకు పిలుపునిచ్చారు. ఆరు దశాబ్దాలుగా అమలవుతున్న ఈ విధానంతో ఎంతోమంది అత్యున్నత స్థానాలకు ఎదుగుతున్నారు. తమ మేధస్సుతో అమెరికన్ సమాజం సుసంపన్నం కావటానికి దోహదపడుతున్నారు. అయినా ఈనాటికీ విద్యాసంస్థల్లో నల్లజాతీయులు 7 శాతం మించరు. శ్వేత జాతి అమెరికన్లు 46 శాతం వరకూ ఉంటారు. ఏదో మేరకు జరుగుతున్న కాస్త మంచినీ తాజా తీర్పు ఆవిరిచేసింది.

విద్యారంగంలో 'నిశ్చయాత్మక చర్య'కు ముందు అత్యున్నత శ్రేణి విద్యా కేంద్రాలుగా పేరున్న హార్వర్డ్, యేల్, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీల్లో 1960ల నాటికి కేవలం 15 (0.5 శాతం) మంది నల్లజాతి విద్యార్థులుండేవారు. వైద్య విద్యలో పేరెన్నికగన్న యూసీఎల్ఏలోనూ, మరికొన్నిచోట్లా 1955–1968 మధ్య 764 మంది వైద్య పట్టాలు పొందితే నల్లజాతీయులు ఒక్కరు కూడా లేరు. దీన్ని గమనించాకే లిండన్ జాన్సన్ విద్యాసంస్థలకు అర్థమయ్యేలా చెప్పారు. అనేకానేక ఏళ్లపాటు సంకెళ్లలో బందీ అయిన వ్యక్తికి విముక్తి కల్పిస్తూ 'ఇకపై నీకు స్వేచ్ఛనిస్తున్నాం. ఇప్పుడు ఎవరితోనైనా నువ్వు పోటీపడొచ్చు. ఆ పోటీ పూర్తి న్యాయబద్ధంగా ఉంటుంది' అనడం ఎంత అన్యాయమో గ్రహించమని కోరారు. ఆ తర్వాతే విద్యాసంస్థలు తమ అడ్మిషన్ విధానాల్లో మార్పులు చేశాయి. తమ తీర్పు దీన్నంతటినీ దెబ్బతీస్తుందన్న వాదనలతో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ ఏకీభవించటం లేదు. వివక్ష అంతానికి ప్రవేశపెట్టిన ఈ విధానమే వివక్షతో కూడుకున్నదని ఆయన అభిప్రాయం. ఇకపై వ్యక్తులుగా ఎవరు ఎలాంటి వివక్ష ఎదుర్కొన్నారో తెలుసుకుని దాన్నిబట్టి నిర్ణయం తీసుకోవాలన్నది ఆయన సూచన. ఆచరణలో ఇదంతా ఏమవుతుందో తెలియనిది కాదు. ఉన్నతశ్రేణి విద్యాసంస్థల్లో జాతిపరమైన వైవిధ్యత మాయమవుతుంది. శ్వేత జాతి అమెరికన్ల ఆధిపత్యం పెరుగుతుంది.

ప్రస్తుతం తీర్పు వెలువడిన కేసు అక్కడ మొదటిదేమీ కాదు. 'నిశ్చయాత్మక చర్య' మొదలై పదేళ్లు గడవకుండానే దానిపై వివిధ న్యాయస్థానాల్లో కేసులు దాఖలయ్యాయి. వాటిల్లో స్వల్ప మెజారిటీతో గండం గట్టెక్కిన కేసులే అధికం. 2003లో ఈ విధానానికి అనుకూలంగా తీర్పు వెలువడినా, ధర్మాసనంలోని మహిళా న్యాయమూర్తి 'మరో పాతికేళ్లకు జాతిని కాక ప్రతిభను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఏర్పడుతుంద'ని అభిప్రాయపడ్డారు. కానీ అంతకు చాలా ముందే సుప్రీంకోర్టు ఆ విధానానికి స్వస్తి పలికినట్టయింది. అసలు ఈ విధానాన్ని కాలిఫోర్నియా, ఫ్లారిడాలతో సహా తొమ్మిది రాష్ట్రాలు అమలు చేయటంలేదు. అమెరికన్ సమాజంలో ఈ విధానాన్ని వ్యతిరేకించే వర్గం క్రమేపీ పెరగటం కనిపిస్తుంది. రిపబ్లికన్ పార్టీ ఈ విధానికి మొదటినుంచీ బద్ధ వ్యతిరేకం. అనుకూలంగా ఉండే డెమొక్రటిక్ పార్టీ కూడా ప్రజానీకాన్ని చైతన్యవంతం చేసే ప్రయత్నం చేయలేదు. అందుకే ప్రస్తుత తీర్పు మెజారిటీ జనాభా దృక్పథాన్నే ప్రతిబింబిస్తోంది. ఇది విద్యాసంస్థలకు సంబంధించిందే అయినా ముమ్ముందు మిలిటరీ, నావీ అకాడమీ ప్రవేశాల్లోనూ, కార్పొరేట్ రంగ ఎంపికల్లోనూ అమలు చేసే పరిస్థితులు ఏర్పడొచ్చు. ఈ విధానంవల్ల లాభపడుతున్న ఆసియన్ అమెరికన్లను, శ్వేతజాతి మహిళలను కూడగట్టడంలో నల్లజాతీయులు విఫలం కావటంవల్లే ఈ తీర్పు వెలువడిందని కొందరి విశ్లేషణ. ఆ మాటెలావున్నా మొత్తంగా అమెరికన్ సమాజంలో జాతిపరమైన సంకుచితత్వం పెరుగుతోందనటానికి ఈ తీర్పు నిదర్శనం.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.8.48 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** అనూరాధ ప.1.11 వరకు, తదుపరి జ్యేష్ఠ, **వర్జ్యం:** సా.6.41 నుండి 8.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.32 నుండి 7.17 వరకు, **అమృతఘడియలు:** తె.4.02 నుండి 5.33 వరకు (తెల్లవారితే ఆదివారం).

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం: 6.34
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

బంగ్లాదేశ్‌లో ఎవరి ప్రయోజనాలేంటి?

విశ్లేషణ



బి. జెడ్. ఖుస్రూ

బంగ్లాదేశ్‌ను అస్థిరంగా ఉంచాలని అమెరికా చూస్తుంది. ఈ పరిస్థితి తన తూర్పు రాష్ట్రాల్లోకి లక్షలాది మంది వలసలకు కారణం అవుతుంది కాబట్టి దాన్ని భారత్ నిరోధించడానికి ప్రయత్నిస్తుంది. చైనాకు సంబంధించినంతవరకూ, ఢిల్లీ హసీనాను ఒత్తిడి చేస్తుంది. కానీ ఆమె అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుంది. మరోవైపు, హసీనా వరుసగా నాలుగోసారి గెలుపొందే విషయం పట్ల అమెరికా ఉత్సాహంగా లేదు. బలమైన దేశీయ మద్దతు ఉన్న నాయకులు అమెరికా ఆదేశాలను తిప్పికొట్టడం దానికి కారణం. అమెరికాలాగా భారత్ కూడా, చైనా వ్యతిరేక శిబిరంలో బంగ్లాదేశ్ ఉండాలని కోరుకుంటోంది. అయితే బంగాళాఖాతంలో స్థావరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే అమెరికాతో ఢిల్లీ ఎంత దూరం వెళ్తుందనేది అనిశ్చితం.

1975లో తమ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ ముజీబుర్ రహమాన్ హత్య వెనుక అమెరికా హస్తం ఉందని బంగ్లాదేశ్‌లోని చాలామంది ప్రజలు విశ్వసిస్తున్నారు. ముజీబుర్ రహమాన్‌ను పడగొట్టిన సైనిక తిరుగుబాటులో వాషింగ్టన్ పాత్ర పోషించిందా లేదా అనేది ఇప్పటికీ చర్చనీయాంశమే. ఒక్క విషయం మాత్రం స్పష్టం. ఈ దక్షిణాసియా దేశ తొలి సైనిక పాలకుడు జనరల్ జియావుర్ రహమాన్‌కు అమెరికా మద్దతునిచ్చింది.

ఇప్పుడు, దాదాపు ఐదు దశాబ్దాల తర్వాత, హత్యకు గురైన అధ్యక్షుడి కుమార్తె, ప్రస్తుత ప్రధాని షేక్ హసీనా, అమెరికా తనను పడగొట్టి తన ప్రత్యర్థి, మాజీ ప్రధాని, జియావుర్ రహమాన్ వితంతువు అయిన ఖలీదా జియాను అధికారంలోకి తేవాలనుకుంటోందని ఆరోపిస్తున్నారు. ''అమెరికన్లు నేను అధికారంలో కొనసాగాలను కోవడం లేదు,'' అని ఆమె ఇటీవల 'బీబీసీ'తో అన్నారు. ఇంకా దారుణంగా, ఆమె ఏప్రిల్‌లో పార్లమెంటులో మాట్లాడుతూ, ''ఎటువంటి ప్రజాస్వామ్య ఉనికిని కలిగి ఉండని ప్రభుత్వాన్ని ఇక్కడ తేవాలని అమెరికా భావిస్తోంది'' అని ఆమె ఆరోపించారు.

గత సంవత్సరం, మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలపై వాషింగ్టన్, హసీనా ప్రభుత్వంలోని పలువురు అధికారులపై, భద్రతా దళాలపై ఆంక్షలు విధించింది. కానీ బంగ్లాదేశ్‌లో తమ అనుకూల సైనిక పాలనా కాలంలో, సరైన విచారణ లేకుండానే వందలాదిమంది తిరుగుబాటు సైనికులను ఉరితీసినప్పుడు మాత్రం ఇలాంటి చర్యలను అమెరికా చేపట్టలేదు. ఇటీవలే, రాబోయే జాతీయ ఎన్నికలను మలినపర్చడానికి ఎవరైనా ప్రయత్నిస్తే అలాంటివారిని దేశంలో అడుగుపెట్టకుండా తిరస్కరిస్తానని అమెరికా బెదిరించింది.

ఇలాంటి బెదిరింపులు బంగ్లాదేశ్‌లో కనీవినీ ఎరుగని రాజకీయ సుడిగుండాన్ని సృష్టించాయి. ఇది రాడికల్ ఇస్లామిక్ సంస్థలతో సహా అనేక శక్తులను నిద్రాణస్థితి నుండి బయటకు లాగి, దాదాపు 16.5 కోట్లమంది బెంగాలీలు గల దేశాన్ని కేవలం ఒక దశాబ్దం క్రితం కొత్త అఫ్గానిస్తాన్‌గా మార్చివేసింది. అయితే, చట్టవిరుద్ధమైన వ్యూహాలను ఉపయోగించినప్పటికీ, వాషింగ్టన్, ఢిల్లీ నుండి ఆమోదం పొందిన తర్వాత హసీనా వారిని దాదాపుగా అణచివేశారు. హసీనాపై అమెరికా ఆరోపిస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనల మూలాలు, తీవ్రవాద మతశక్తులపై ఆమె సాగించిన అణిచివేతలో దాగి ఉన్నాయి. వాస్తవానికి, ఆమె మరింత విస్తృతమైన వల వేశారు. అదేక్రమంలో తన రాజకీయ ప్రత్యర్థులను కూడా తుడిచిపెట్టారు.

1971 వరకు బంగ్లాదేశ్ భాగమై ఉన్న పాకిస్తాన్‌లో సైనిక నియంతలకు మద్దతు ఇచ్చిన అమెరికా, ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహించే పేరుతో హసీనాపై ఇప్పుడు లాఠీని ప్రయోగిస్తోంది. ఢాకాలో ఈ సిద్ధాంతం చెల్లుబాటవడం కష్టమే. వాషింగ్టన్ ప్రజాస్వామ్య చర్చ తమను మభ్యపెట్టడానికేననీ, దానిలో వారి సొంత ప్రయోజనాలు



దాగి ఉన్నాయనీ బంగ్లాదేశీయులు భావిస్తున్నారు.

నిజానికి, చైనాకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో హసీనాను తమవైపు తిప్పుకోవడమే అమెరికా అసలు లక్ష్యం. చైనా ప్రపంచ శక్తిగా ఎదగడం, మరింత ప్రభావం కోసం బీజింగ్ వ్యక్తపరుస్తున్న ఆకాంక్షను భగ్నం చేయడానికి అమెరికా యత్నిస్తోంది. బంగాళాఖాతం సమీపంలో దాని స్థానం కారణంగా బంగ్లాదేశ్ వ్యూహాత్మకంగా మారింది. బంగాళాఖాతంలోని బంగ్లాదేశ్ ద్వీపంలో అమెరికా తమ నావికా స్థావరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ఇద్దరు వామపక్ష పార్లమెంటు సభ్యులు ఇటీవల పేర్కొన్నారు. ఇటువంటి స్థావరం వల్ల ఐరోపా, మధ్యప్రాచ్య దేశాలకు చైనా సముద్ర వాణిజ్య మార్గాన్ని అమెరికా సులభంగా నిరోధిస్తుంది. అది చైనా ఆర్థిక వ్యవస్థను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. అయితే వాషింగ్టన్‌కు అలాంటి ఆలోచనే లేదని ఢాకాలోని అమెరికా రాయబార కార్యాలయం నిర్ద్వంద్వంగా ఖండించింది.

అమెరికాలాగా భారత్ కూడా, చైనా వ్యతిరేక శిబిరంలో బంగ్లాదేశ్ ఉండాలని కోరుకుంటోంది. అయితే వాషింగ్టన్ నిజంగానే బంగాళాఖాతంలో స్థావరాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే అమెరికాతో ఢిల్లీ ఎంత దూరం వెళ్తుందనేది అనిశ్చితం. దాని పెరట్లో అమెరికా సైనిక స్థావరం ఉండటం ఇష్టపడదు. హసీనా విషయానికి వస్తే, ఆమె భారత్, అమెరికాల ఒత్తిడికి తలొగ్గి, 'పెద్దన్నలను' తృప్తిపరచడానికి బీజింగ్‌కు సురక్షితమైన దూరంలో ఉండవచ్చు.

బెంగాలీలు ఒక సమూహంగా ఏదైనా సైనిక కూటమిలో చేరడాన్ని వ్యతిరేకిస్తున్నారు. భారత్ లేదా అమెరికా బంగ్లాదేశ్ వృద్ధి వేగాన్ని కొనసాగించడానికి తగినంత డబ్బు ఇవ్వలేవు. ఈ పరిస్థితుల్లో చైనా రక్షకుడిగా కనిపిస్తోంది. అత్యంత విభేదాలతో ఉండే బంగ్లాదేశీయులు అందరూ అంగీకరించే విషయం ఏదైనా ఉందంటే, అది ఆర్థిక వ్యవస్థ గురించి మాత్రమే. కాబట్టి దేశాన్ని ఎవరు పాలించినా, చైనాతో బంగ్లాదేశ్ బలమైన బంధం కొనసాగే అవకాశం ఉంది.

బంగ్లాదేశ్‌లో భారత ప్రయోజనాలు అమెరికా ప్రయోజనాలకు భిన్నంగా ఉంటాయి. భారతదేశ ప్రధాన లక్ష్యం దాని తూర్పు పార్శ్వంలో భద్రత. హసీనా దశాబ్దాలుగా దీనికి సహాయం చేశారు. బంగ్లాదేశ్ రాజకీయ దృశ్యంలో అన్ని పువ్వులు వికసించడాన్ని అమెరికా చూడాలనుకోవచ్చు. కానీ ఇస్లామిక్ రాడికల్స్ పట్ల భారత్‌కు కనికరం లేదు. ఖలీదా జియాపై న్యూఢిల్లీ అవిశ్వాసంతో వ్యవహరిస్తుంది. బంగ్లా దేశ్‌ను భారత వ్యతిరేక కార్యకలాపాలకు వాడుకుంటున్నారని ఢిల్లీ చేసిన ఫిర్యాదులను తాను ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ఖలీదా జియా తోసిపుచ్చి భారత్‌కు ఆగ్రహం తెప్పించారు.

బంగ్లాదేశ్‌ను అస్థిరంగా ఉంచాలని అమెరికా చూస్తుంది. అయితే ఈ పరిస్థితి తన తూర్పు రాష్ట్రాల్లోకి లక్షలాది మంది వలసలకు కారణం అవుతుంది కాబట్టి దాన్ని భారత్ నిరోధించడానికి ప్రయత్నిస్తుంది. చైనాకు సంబంధించినంతవరకూ, ఢిల్లీ హసీనాను ఒత్తిడి చేస్తుంది. కానీ ఆమె అధికారాన్ని నిలుపుకోవడంలో సహాయపడుతుంది. మరోవైపు, ఈ ఏడాది ఎన్నికల్లో హసీనా వరుసగా నాలుగోసారి గెలుపొందే విషయం పట్ల అమెరికా ఉత్సాహంగా లేదు. బలమైన దేశీయ మద్దతు ఉన్న నాయకులు అమెరికా ఆదేశాలను తిప్పికొట్టడం దానికి కారణం. టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్, హంగరీకి చెందిన విక్టర్ ఓర్బన్ దీనికి ఉదాహరణలు. కాబట్టి దాని వినాశకరమైన హింసాత్మక పాలన–మార్పు సూత్రాన్ని వదిలి వేసి, బ్యాలెట్ బాక్స్ ద్వారా పాలన మార్పును తేవడానికి అమెరికా యత్నిస్తోంది.

దీంతో బంగ్లాదేశ్‌కు సంబంధించినంత వరకూ భారత్‌తో అమెరికా విభేదిస్తోంది. భారత్ ప్రణాళికలు విజయవంతమైతే, బంగ్లాదేశ్‌లో మళ్లీ అంత స్నేహపూర్వకంగా లేని పరిస్థితిని అమెరికా ఎదుర్కొంటుంది. బంగ్లాదేశ్ ఆవిర్భవించినప్పటినుంచి ఇది ఉనికిలో ఉన్నదే. విదేశీ ఒత్తిడికి తలొగ్గబోననీ, వాషింగ్టన్ పరోక్ష దూకుడుకు లొంగిపోననీ హసీనా ప్రతిజ్ఞ చేశారు. ప్రజాస్వామ్యాన్ని నిర్మిస్తామనే వాక్చాతుర్యం కంటే నిశ్శబ్ద దౌత్యం, శిక్షకు సంబంధించిన ముప్పు హసీనాపై మెరుగ్గా పని చేస్తాయి. కోపాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ బంగ్లా ప్రధాని మౌలికంగా అమెరికాకు వ్యతిరేకం కాకపోవచ్చు.

వాస్తవానికి, ఆమె 2009లో తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత, ముస్లిం ప్రపంచానికి ఢాకా నుండి ప్రసంగాన్ని అందించాలంటూ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను రహస్యంగా ఆహ్వానించడానికి ప్రయత్నించారు. వ్యక్తిగత స్థాయిలో ఈ ఆసియా ఉక్కు మహిళ అమెరికాతో కుటుంబ సంబంధాలను కలిగి ఉన్నారు. ఆమె తన కోడలు అయిన అమెరికన్ మహిళను ఆరాధిస్తారు. ప్రతిపక్ష సభ్యుడు ఆమె మతాన్ని గురించి ప్రశ్నించినప్పుడు హసీనా పార్లమెంటులో తన కోడలిని బహిరంగంగా సమర్థించారు. బెంగాలీ సంస్కృతిలో, వ్యక్తిగత సంబంధాలు అధికారిక మర్యాదలను అధిగమిస్తాయి.

వ్యాసకర్త, పాత్రికేయుడు, యుద్ధ వ్యవహారాల నిపుణుడు
('ద స్టేట్స్‌మన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కొత్తదనం



స్టార్టప్‌లు ప్రారంభిస్తున్నప్పుడు వాటిల్లో పెట్టుబడులు పెట్టడానికి చాలా మంచి కారణాలున్నాయి. అందులో డబ్బు ఒకటైతే కాదు.

– పర్మీందర్ సింగ్, గూగుల్ మాజీ ఎండీ

ఆరోగ్య భాగ్యం



మద్యం తాగే యువత అమెరికాలో మరింత మరింతగా తగ్గిపోతున్న వాస్తవం నాకు సంతోషం కలిగిస్తోంది. అది సానుకూల ధోరణి. మద్యపానం కూడా పొగతాగడం మార్గంలో నడుస్తోంది.

– జూజీ, ర్యాపర్

మంటల వెనుక...



ఫ్రాన్స్ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలకు క్రమశిక్షణ లేని ముస్లింలు, వలసవాదులే కారణమంటూ ఆన్‌లైన్‌లో చిత్రించే ప్రయత్నం జరుగుతోంది. ముమ్ముందూ జరుగుతుంది. విభజించి పాలించే ప్రయత్నాలను నిరోధించాలి. నియంతృత్వపు కులీన ప్రపంచవాద ఫ్రెంచ్ రాజ్యాన్ని దాని ప్రజలు ద్వేషిస్తుండటమే ఈ మంటలకు కారణం.

– మాజిద్ నవాజ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

కాకూడదా?



అందంగా ఉండి నాకు తెలియని ముఖం తాలుకు చిత్రం ఏది కనబడినా ఇప్పుడు అది కృత్రిమ మేధ సృష్టి అనుకుంటాను. పరిస్థితి అలా ఉంది మరి!

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ సైంటిస్ట్


పండగ వద్దా?



బక్రీద్ రోజు అహ్మదీలు ఖుర్బానీ చేయడం దైవదూషణ అంటూ పాకిస్తాన్‌లో కొందరు బహిరంగంగా బెదిరింపులకు పాల్పడ్డారు. అయినా పోలీసులు ఈ అతివాదుల మీద ఏ చర్యలూ తీసుకోకుండా, ఈద్ జరుపుకొనే అహ్మదీలకు వ్యతిరేకంగా నిలిచారు. తన మైనారిటీలను కాపాడుకోవడంలో పాకిస్తాన్ వరుసగా విఫలమవుతూనే ఉంది.

– కాశిఫ్ చౌదరి, యాక్టివిస్ట్, వైద్యుడు

ఒక రోబో ప్లీజ్!



ఎవరూ ఈ విషయం గురించి పెద్దగా మాట్లాడటం లేదు. పదేళ్లలో మనం కోటి బైపెడల్ (రెండు కాళ్ల) రోబోలను కలిగి వుంటాం; 25 ఏళ్లలో ఈ సంఖ్య వందకోట్లకు చేరుతుంది. మనం వాటిని పదివేల డాలర్లు వెచ్చించి కొనుక్కుంటాం. మన జీవితంలో ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ ఎంత ప్రాధాన్యత కలిగి వుందో రోబో కూడా అలా విడదీయలేని భాగం కాబోతోంది.

– వినోద్ ఖోస్లా, వ్యాపారవేత్త

మంచి నిర్ణయం



నేను ఒక ఫిజీషియన్‌ను. నా ఆరోగ్యం గురించి నేను తీసుకున్న అత్యంత మంచి నిర్ణయం ఏమిటంటే, కోవిడ్–19 టీకా వేసుకోకపోవడం. ఆఖరికి నా సొంత వృత్తిలోవాళ్లు కూడా దాన్ని తప్పక తీసుకోవాలని చెప్పారు. తీవ్ర బలవంతాల మధ్య దానికి వ్యతిరేకంగా నేను గట్టిగా నిలబడేలా చేసిన దేవుడికి కృతజ్ఞుడిని.

– సునీల్ ధండ్, ఫిజీషియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

బ్యాంకింగ్ లోపాలు సరిదిద్దరా?

అభిప్రాయం



డా॥ కోలాహలం రామ్ కిశోర్

బ్యాంకింగ్ వ్యవస్థకు సంబంధించిన ప్రభుత్వ పాలసీల రూపకల్పనలోనూ, వాటి నిర్వహణా సామర్థ్యాలలోనూ అనేక లోపాలు ఏదో రూపంలో తలెత్తుతూనే ఉన్నాయి. అయినా కేంద్ర ప్రభుత్వం తప్పులను సరిదిద్దుకోకుండా నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా గత కొద్ది నెలలుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) పాలసీలో అనుసరిస్తున్న ద్రవ్య విధానం ఆర్థిక వ్యవస్థకు చేటు తెచ్చేలా ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సభ్యుడు జయంత్ వర్మ ఇదే విషయాన్ని చెబుతూ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ నెల ఆరంభంలో జరిగిన ఎంపీసీ సమావేశం మినిట్స్ వెల్లడయ్యాయి. వడ్డీరేట్ల పెంపుపై సభ్యుల మధ్య విభేదాలు పొడచూపినట్లుగా తెలుస్తోంది. ఏడాది కాలంలో 'రెపో రేటు' నాలుగు శాతం నుండి 6.5 శాతానికి పెరిగింది. 'ద్రవ్య విధానం' వాస్తవానికి దూరం జరిగిపోతున్నదంటూ జయంత్ వర్మ తాజా సమావేశంలో విమర్శించారు. ఈ నేపథ్యంలో ఆర్థిక అభివృద్ధి అంచనాల కంటే తక్కువగా ఉంటుందన్నారు. అహ్మదాబాద్ ఐఐఎం ప్రొఫెసర్ అయిన జయంత్ వర్మ, కేంద్రం ఎంపీసీలో నియమించిన ముగ్గురు నామినీ సభ్యుల్లో ఒకరు.

అలాగే గడిచిన ఈ 9 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం 15 లక్షల కోట్ల రూపాయలను 'రైట్ ఆఫ్' చేసి ఎగవేతదారులకు మేలు చేసింది. అంతే కాక ఉద్దేశపూర్వకంగా రుణాలనూ, వడ్డీలనూ ఎగ్గొట్టిన వారికి మళ్లీ రుణాలు ఇచ్చేందుకు కూడా రిజర్వ్ బ్యాంక్ సిద్ధపడింది. రాజీ పరిష్కారం (కాంప్రమైజ్ సెటిల్మెంట్) పేరిట ఈ ప్రక్రియకు తలుపుల్ని బార్లా తెరిచింది. ఈ అనాలోచిత చర్యపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ క్రమంలోనే, ఉద్దేశపూర్వకంగా ఎగవేతకు పాల్పడిన వారు ఎంతమంది ఉన్నారు అన్న చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. 2022 డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా ఉద్దేశపూర్వకంగా పెద్ద మొత్తాలను ఎగవేసిన వారు పదహారు వేల మందికి పైమాటే అని బ్యాంకు నివేదికను బట్టి తెలుస్తోంది. వీళ్లు దాదాపు రూ. 3.46 లక్షల కోట్ల రుణాలను ఎగ్గొట్టినట్లు సమాచారం. ఇందులో 85 శాతం రుణాలను (రూ. 2.92 లక్షల కోట్లు) ప్రభుత్వ బ్యాంకుల నుంచి తీసుకున్నట్టుగా తెలుస్తోంది.


దేశంలో మొత్తం 11 ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో 6 బ్యాంకులకు గత కొన్నేళ్లుగా చైర్‌పర్సన్‌లను నియమించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తోంది. ఇందువల్ల ఆయా బ్యాంకులు క్రమంగా బలహీన పడుతున్నాయి. ఇప్పటికే నోట్ల రద్దు ప్రక్రియతో మన ఆర్థిక వ్యవస్థ సతమతం అవుతోంది.

ఇలాంటి పరిస్థితుల్లో గుండెకాయ లాంటి బ్యాంకింగ్ వ్యవస్థ ఇన్ని అంతర్గత వ్యవస్థాపరమైన లోపాలూ, నిర్వాహణా లోపాలతో కొనసాగితే... దేశ ద్రవ్య వ్యవస్థ భవిష్యత్తులో ఏమికానుందో అనే ఆందోళన కలుగక మానదు. ఇటీవల అనేక విదేశీబ్యాంకులు వ్యవస్థాపర, నిర్వహణాపర లోపాలతో దివాలా తీసిన అనుభవాలు కళ్లెదుట కనిపిస్తున్నా వాటి నుండి మనం గుణపాఠం నేర్చుకోకుంటే ఎలా?

వ్యాసకర్త ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ । 98493 28496

చెప్పేటియి శ్రీరంగనీతులు చేసేటియి చెర్వు కబ్జలు

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ఎప్పటి తీర్గనే ఆనంద్‌బాగ్ చౌరస్త కాడికి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''గీ నడ్మ పట్నాల పదిహేను అపొజిసన్ పార్టీలు మీటింగ్ బెట్టినయి'' అని యాద్గిరి అన్నడు.

''గా మీటింగ్‌కు రాహుల్ గాంధి గుడ్క బోయిండు గదా'' అని సత్నారి అన్నడు.

''అవ్, గాయినను లాలూ ప్రసాద్ యాదవ్ కాగలిచ్చుకుండు.''

''కాగలిచ్చుకోని ఏమన్నడు?''

''రాహుల్! నువ్వెప్పుడు పెండ్లి జేస్కుంటవు. నువ్వు పెండ్లి జేస్కుంటె మీ అమ్మకే గాకుంట మాగ్గూడ సంబురమైతది. నీ పెండ్లి బారాత్ల మేము డాన్సు జేస్తము అన్నడు.''

''నాకెర్కలేక అడ్గుతున్న. ఇదువరదాంక రాహుల్ ఎందుకు పెండ్లి జేస్కోలె?'' ''వాజపేయికి పెండ్లి గాలె. మోదీకి పెండ్లి అయినా గానట్లే. పీవీ నర్సింహరావు అసుంటోల్లు ప్రతాని కుర్సి ఎక్కినప్పుడు గాల్లకు పెండ్లాలు లేరు. ఇందిరా గాంధి సుత మొగడు లేనప్పుడే ప్రతాని అయ్యింది. పెండ్లి జేస్కోకుంట ఉంటేనే ప్రతాని గావొచ్చని రాహుల్ గాంధి అనుకుంటున్నట్టున్నడు.''

''మొన్న ప్రతాని అమెరిక బోయినప్పుడు బైడెన్‌తోని ఏం మాట్లాడిండంటవు?''

''ఏం జేస్తె గ్యాస్‌బండ, పిట్రోలు దరలు తక్వ అయితయి అనే దాని మీద మాట్లాడి ఉంటడు'' అని నగుకుంట యాద్గిరి అన్నడు.

''ఫండ్స్ గురించి అడ్గలేదా?''

''అడ్గిండు.''

''ఎవ్విటి గురించి?''

''మన దేసంల దిస్టిబొమ్మల కార్కానలను బెట్టితండ్కు. ఎలచ్చన్లు దగ్గరబడుతున్నయి. దిస్టి బొమ్మలకు మస్తు గిరాకి ఉంటది.''

''ఒగని కాల్లకు చెప్పులు లేవు. చెప్పులు లేకుంట గాడు నడ్సుకుంట బోతుంటె ఇంకొకడు జూసిండు.''

''చూసి ఏం జేసిండు?''

''గాని కాల్లకు ఉన్న చెప్పులు దీసి చెప్పులు లేనోనికి ఇచ్చిండు.''

''ఎంత మంచోడో!''

''చెప్పులు ఇచ్చినంక ఏంజేసిండో ఎర్కేనా? గాని మీద ఎక్కి గూసుండు.''

''ఇంతకు చెప్పులు లేనోడు ఎవ్వడు? చెప్పులు ఇచ్చినోడు ఎవ్వడు?''

''చెప్పులు లేనోడు కర్ణాటక జెనం. చెప్పులిచ్చి మీద గూసున్నోడు కర్ణాటక సర్కార్.''



''గీనడ్మ ఈటెల రాజేందర్, రాజగోపాల్ రెడ్డి డిల్లికి బోయింద్రు. అమిత్‌షాను గల్సింద్రు.''

''కల్సి ఏమన్నరు?''

''ఏ దిక్కులేక బిజెపిలకు మేము వొచ్చినమని కొందరు మనోల్లే అంటున్నరు. గిదేం బాగలేదు. కర్ణాటక ఎలచ్చన్లు అయినంక బిఆర్ఎస్, బిజెపిల నడుమ దోస్తాన ఉన్నదని వార్తలు వొస్తున్నయి. గవ్విట్ల నిజం లేదని చెప్పాల్సిన అవుసరమున్నది. ఆల్ల పార్టీలకు రమ్మని కాంగ్రెస్ లీడర్లు ఒక్కతీర్గ మమ్ములను బత్మిలాడుతున్నరు. ఒకదిక్కు మమ్ములను బిల్సి కెటిఆర్‌కు అపాయింట్‌మెంట్ ఎట్ల ఇచ్చింద్రని గాల్లు అడిగింద్రు. గాల్లు గట్ల అడ్గంగనే కెటిఆర్‌కు ఇచ్చిన అపాయింట్‌మెంట్‌ను అమిత్‌షా రద్దుజేసిండు.''

''గీల్లు గట్ల అంటె అమిత్‌షా మనసుల ఏమనుకున్నడు?''

''గీల్లు కాంగ్రెస్ దిక్కు సూస్తున్నరని అమిత్‌షా మనసుల అనుకోని ఉంటడు.''

''గీనడ్మ బిఆర్ఎస్ చెర్ల పండ్గ జేసింది. జన్గాం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాద్గిరి రెడ్డి చెర్వు బూమినే కబ్జ జేసిండు.''

''నీకెట్ల ఎర్క?''

''మా నాయిన చెర్వు బూమిని కబ్జ జేసిండు. నా పేరు మీద రిజిస్టర్ జేసిండు అని కుద్దు గాయిన బిడ్డనే జెప్పిందని వార్తలు వొచ్చినయి.''

''చెప్పేటియి శ్రీరంగ నీతులు, చేసేటియి చెర్వు కబ్జలు అంటె గిదేనేమో.''

''రాజు వెడలె రవితేజము లలరగ; కార్లు కదిలె శర వేగము మించగ' అన్న తీర్గ కెసిఆర్ మహారాష్ట బోయిండు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గాయిన యెంబడి బోయింద్రు. ముంగట, ఎన్క నూటిర్వై మోటర్లతో గాయిన కాన్వయ్ బోయింది. గంటలు గంటలు ట్రాఫిక్ ఆగిపోయింది. జెనానికి తక్లీబైంది. మహారాష్ట్రల కెసిఆర్ మాట్లాడుకుంట మా బిఆర్ఎస్‌ను కాంగ్రెస్‌కు 'ఎ' టీం అంటున్నరు. బిజెపికి 'బి' టీం అంటున్నరు. ఏ పార్టీకి ఎసువంటి టీం గాదు అని అన్నడు.''

''ఏ టీం గాదు. బిఆర్ఎస్ కుటుంబ టీం.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

ముగ్గురు పిల్లలతో తల్లి ఆత్మహత్య

- మిడ్‌మానేరులో దూకి బలవన్మరణం
- వరకట్న వేధింపులే కారణం?
- సిరిసిల్ల జిల్లా రుద్రవరంలో విషాదం


రజిత


ఉస్మాద్ హైమాద్


అయాన్


ఆశ్రజబీన్

సిరిసిల్ల క్రైం: వరకట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత తన ముగ్గురు పిల్లలతో కలసి రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మిడ్‌మానేరులో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తమ్ముడు కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం పునరావాస కాలనీకి చెందిన రజిత అలియాస్ నేహ (33) కరీంనగర్ జిల్లా కొత్తపల్లికి చెందిన మహమ్మద్ అలీని పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి అయాన్ (7), ఆశ్రజబీన్ (5), ఉస్మాద్ హైమాద్ (14 నెలలు) సంతానం. కొన్నాళ్లుగా అలీ కట్నం కోసం రజితను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ వేధింపులు తాళలేక రజిత తల్లిగారింటిలో చాలా నెలలు తలదాచుకుంది. నాలుగు నెలల క్రితం అలీ రుద్రవరం గ్రామానికి వచ్చి పిల్లలపై డీజిల్ పోసి చంపేందుకు యత్నించగా స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. రజిత కుటుంబీకుల ఫిర్యాదుతో అలీపై వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. తర్వాత కొన్ని రోజులకు తన తప్పు తెలుసుకున్నానని.. భార్యను మంచిగా చూసుకుంటానని పెద్దమనుషుల సమక్షంలో నమ్మబలకడంతో కుటుంబీకులు కేసు వెనక్కి తీసుకున్నారు. అనంతరం భార్యను కరీంనగర్ తీసుకెళ్లినా అలీ ప్రవర్తనలో మార్పురాకపోగా వేధింపులు ఎక్కువయ్యాయి. మూడు రోజుల క్రితం రజిత మళ్లీ తల్లిగారింటికొచ్చింది. భర్త వేధిస్తున్నాడని, అవసరాల కోసం కొంత డబ్బు కావాలని అడగ్గా.. తామే వచ్చి మాట్లాడుతామని సర్దిచెప్పారు. రజిత అదే రోజు కరీంనగర్ వెళ్తున్నానని చెప్పి బయలుదేరింది. కాగా, శుక్రవారం ఉదయం మిడ్‌మానేరులో నాలుగు మృతదేహాలు తేలాయన్న స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని మృతదేహాలను బయటకు తీశారు. రుద్రవరం గ్రామానికి చెందిన రజిత, ఆమె ముగ్గురు పిల్లలుగా గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ రవి, సీఐ వెంకటేశ్, బోయినపల్లి ఎస్సై మహేందర్ తెలిపారు.

మెడకు చున్నీ బిగించి.. తల గోడకేసి బాది

- కరీంనగర్‌లో లేడీ రియల్టర్ దారుణ హత్య
- రూ. 25 లక్షల ఆర్థిక లావాదేవీల్లో విభేదాలతో హతమార్చిన భాగస్వామి
- ఆపై మృతురాలి సోదరుడికి ఫోన్ చేసి తలకు గాయమైందని చెప్పి పరార్
- ప్రత్యేక బృందాలతో గాలిస్తున్న పోలీసులు


సరిత

కరీంనగర్ క్రైం: రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆర్థిక లావాదేవీలు ఒక వివాహిత నిండు ప్రాణాలు బలిగొన్నాయి. కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ భగత్‌నగర్‌లోని క్రిస్టల్ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో వివాహిత గుండా సరిత (35) దారుణ హత్యకు గురైంది. గోదావరిఖని 8 ఇన్‌క్లైన్ కాలనీకి చెందిన ఆకుల ఓదెలు–లక్ష్మిల రెండో కుమార్తె సరిత మంచిర్యాల జిల్లా జన్నారం మండలం దేవునిగూడెంకు చెందిన గుండా శ్రీపాల్‌రెడ్డిని 2001లో ప్రేమ వివాహం చేసుకుంది. గోదావరిఖనిలో నివసిస్తున్న వారికి ఆస్మిత్‌రెడ్డి, మణిత్‌రెడ్డి సంతానం. గోదావరిఖనిలో సరిత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండటం నచ్చని శ్రీపాల్‌రెడ్డి అందుకు అభ్యంతరం తెలిపాడు. ఈ వ్యవహారం ఇద్దరి మధ్య గొడవలకు దారితీయడంతో ఏడాది నుంచి సరిత భర్తకు దూరంగా ఉంటోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారం పనిమీద అప్పుడప్పుడూ కరీంనగర్‌కు వెళ్తుండే ది. ఈ క్రమంలో భగత్‌నగర్‌లోని క్రిస్టల్ అపార్ట్‌మెంట్ 203 ఫ్లాట్‌లో ఉంటున్న వెంకటేశ్ అనే వ్యక్తితో సరితకు పరిచయం ఏర్పడింది. దీంతో సరిత సుమారు రూ. 20 లక్షలకుపైగా డబ్బును వెంకటేశ్‌కు ఇచ్చింది. సరిత తమ్ముడు ఆకుల సతీశ్ నగరంలోని రాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. వేసవి సెలవులు ఉండటంతో కుమారులతో సహా సరితత మ్ముడి ఇంట్లోనే ఉంది. జూన్ 28న కొడుకులను గోదావరిఖని పంపిన సరిత అదేరోజు సాయంత్రం వెంకటేశ్‌తో కలసి రియల్ ఎస్టేట్ పనులపై వరంగల్‌కు వెళుతున్నానని చెప్పింది. ఆమె సోదరుడు మర్నాడు ఫోన్ చేయగా స్విచ్చాఫ్ వచ్చింది. శుక్రవారం సరిత ఫోన్ నుంచి ఆకుల సతీశ్‌కు వెంకటేశ్ వాట్సాప్ కాల్ చేశాడు. సరిత తల గోడకు కొట్టుకుందని, ఫ్లాట్ లోపలే ఉందని, ఆమెను తాళం పగలగొట్టి తీసుకెళ్లాలని చెప్పి పరారయ్యాడు. దీంతో కంగారుపడిన సరిత సోదరి స్వాతి, తమ్ముడు సతీశ్... హుటాహుటిన అపార్ట్‌మెంట్‌కు వెళ్లి తాళం పగలగొట్టి లోనికి వెళ్లిచూడగా రక్తపు మడుగులో, ముఖం, తలపై తీవ్రగాయాలతో సరిత పడి ఉంది. ఆమె మెడకు చున్నీ బిగించి ఉంది. సతీశ్ వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ రవికుమార్, సిబ్బంది, క్లూస్ టీంతో ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పలు ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రధా న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆర్థిక లావాదేవీలే కారణం...

సరిత మృతికి వ్యాపార లావాదేవీలే కా రణమని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే క్రమంలో దాదాపు రూ. 25 లక్షలను పెట్టుబడి కింద వెంకటేశ్‌కు సరిత ఇచ్చిందన్నారు. ఈ డబ్బు తిరిగి ఇవ్వా లని అడగడంతో వెంకటేశ్ ఇవ్వలేదని.. దీనిపై ఇద్దరికీ గొడవలు జరిగేవని సతీశ్ తెలిపాడు. వెంకటేశ్ నివసిస్తున్న అపార్ట్‌మెంట్ సీసీ ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు అతన్ని పట్టుకొనేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు.

కరీంనగర్ బస్టాండుకు రూ.5 లక్షలు తీసుకురండి..

- నకిలీ మావోయిస్టులను పట్టుకున్న పోలీసులు
- బాధితుల్లో రామగుండం మేయర్, పంకెన సర్పంచ్
- యూట్యూబ్‌లో చూసి లెటర్లు సృష్టించిన నిందితులు


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: 'మేం మావోయిస్టులం మాట్లాడుతున్నాం.. పార్టీ చందా కోసం రూ.5 లక్షలు కావాలి. కరీంనగర్ బస్టాండుకు తీసుకురావాలి'అంటూ బెదిరించిన నకిలీ మావోలు పోలీసులకు చిక్కారు. ఇటీవల రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్, పంకెన సర్పంచి శ్రీనివాస్‌కి మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖల గుట్టును పోలీసులు ఛేదించారు. దీని వెనక మావోయిస్టులు లేరని, తేలిగ్గా డబ్బు సంపాదించేందుకు నలుగురు యువకులు పన్నిన పన్నాగమని తేల్చారు. శుక్రవారం భూపాలపల్లి పోలీసులు ఈ కేసు వివరాలు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా పంకెన గ్రామానికి చెందిన ఎర్ని సోమయ్య, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎలుకలపెల్లికి చెందిన చిలుముల తిరుపతి, రామగుండం మండలం గోదావరిఖనికి చెందిన ఈర్ల రాంచందర్ ఎలాగైనా సులువుగా డబ్బు సంపాదించాలని అనుకున్నారు. ఈ క్రమంలో మావోయిస్టుల పేరుతో నాయకులను బెదిరించాలని నిర్ణయించారు. ఇందుకోసం గోదావరిఖనికి చెందిన జిరాక్స్ సెంటర్ నిర్వాహకుడు టేకుల సుధీర్ సాయం తీసుకున్నారు. యూట్యూబ్‌లో మావోయిస్టుల లెటర్‌హెడ్‌లను చూసి అలాంటివే నకిలీవి సృష్టించారు. పంకెన సర్పంచి శ్రీనివాస్, రామగుండం మేయర్ బంగి అనిల్‌కుమార్‌లకు పార్టీకి రూ.5 లక్షలు విరాళంగా ఇవ్వాలని బెదిరిస్తూ లేఖలు పంపారు. ఈనెల 15వ తేదీన ఈ లేఖలను హైదరాబాద్ నుంచి పోస్టు చేశారు. రెండు రోజుల అనంతరం వారిద్దరికి ఫోన్ చేసి కరీంనగర్ బస్టాండుకు వచ్చి డబ్బులు అప్పగించాలని బెదిరించారు. దీనిపై సర్పంచి శ్రీనివాస్ ఫిర్యాదుతో పోలీసులు నిఘా పెట్టి ముందు సోమయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతనిచ్చిన సమాచారంతో మిగతావారిని అరెస్టు చేశారు.

ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనం


నాగరాజు


బస్వరాజు

రామాయంపేట(మెదక్): మెదక్ జిల్లా నార్సింగి మండలం కాస్లాపూర్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకకు చెందిన ఇద్దరు డ్రైవర్లు సజీవ దహనమయ్యారు. నార్సింగి ఎస్‌ఐ నర్సింలు కథనం ప్రకారం.. నాగ్‌పూర్ వైపు టైర్ల లోడుతో వెళ్తున్న డీసీఎం టైరు పంక్చర్ కావడంతో డ్రైవర్ రోడ్డు పక్కన వాహనం ఆపాడు. అదే సమయంలో బెంగళూరు నుంచి నాగ్‌పూర్ వెళ్తున్న కంటెయినర్ వేగంగా వచ్చి నిలిపి ఉన్న డీసీఎంను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు కంటెయినర్ ముందుభాగంలో మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు నాగరాజు (25) బస్వరాజ్ (30) సజీవ దహనమయ్యారు. మంటల ధాటికి కంటెయినర్ లోపల ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిబూడిదయ్యాయి. పోలీసులు అగ్నిమాపక శాఖాధికారులతో కలిసి మంటలను అదుపులోకి తెచ్చారు. రహదారిపై అర్ధగంట పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పోలీసులు ప్రమాదం జరిగిన రోడ్డును మూసివేసి వాహనాలను ఒకే దారిలో మళ్లించారు. రామాయంపేట, తూప్రాన్ సీఐలు లక్ష్మీబాబు, శ్రీధర్ సంఘటనా స్థలిని సందర్శించారు. నార్సింగి ఎస్‌ఐ నర్సింలు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రిఫండ్ స్కామ్ దర్యాప్తులో వేగం పెంచిన ఐటీ

సాక్షి, హైదరాబాద్: ఐటీ రిఫండ్ స్కామ్‌లో భారీ కుంభకోణాన్ని వెలికితీసే పనిలో ఆదాయపన్ను శాఖ అధికారులు వేగం పెంచారు. శుక్రవారం ఐటీ అధికారులు హైదరాబాద్‌లో పలు కన్సల్టెన్సీలలో సోదాలు నిర్వహించారు. తెలంగాణతోపాటు ఏపీలోనూ ఏకకాలంలో పలు చోట్ల ఈ సోదాలు జరిగినట్టు తెలిసింది. దాదాపు రూ.80 కోట్ల మేర రిఫండ్ స్కామ్‌కు సంబంధించి ఐటీ అధికారులు ఆధారాలను సేకరించినట్టు సమాచారం . హైదరాబాద్‌లో ఎల్బీనగర్, వనస్థలిపురం సహా మొత్తం ఎనిమిది ప్రాంతాల్లో ఐటీ కన్సల్టెన్సీలలో బుధవారం మొదలైన సోదాలు శుక్రవారం సైతం కొనసాగినట్టు ఐటీ వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఏయే కన్సల్టెన్సీలలో సోదాలు కొనసాగుతున్నాయన్న వివరాలను అధికారులు వెల్లడించడం లేదు. పలువురు వ్యక్తులు ఇన్సూరెన్స్‌లు, స్టడీ లోన్లు, వృద్ధులైన తల్లిదండ్రులకు వైద్య ఖర్చుల పేరిట నకిలీ ధ్రువపత్రాలు సమర్పించినట్టు అధికారులు గుర్తించారు. అయితే ఆయా సర్టిఫికెట్లు ఎక్కడి నుంచి తెచ్చారు.. ఇందులో కన్సల్టెన్సీల ప్రమేయం ఎంత మేర ఉందన్న కోణంలో ఐటీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తోంది.

క్లుప్తంగా...

కేంద్ర ఆర్డినెన్స్‌పై స్టే ఇవ్వండి
సుప్రీంకోర్టులో ఢిల్లీ ప్రభుత్వం పిటిషన్

న్యూఢిల్లీ: ఢిల్లీ పరిపాలన సర్వీసులపై నియంత్రణ కోసం కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను ఆప్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు ఉత్తర్వులను పక్కనబెట్టే ప్రయత్నమని ఆరోపించింది. ఆర్డినెన్స్‌ను కొట్టివేయడంతోపాటు అమలుపై మధ్యంతర స్టే విధించాలని కోరుతూ శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. పోలీసు, శాంతిభద్రతలు, భూమి మినహా మిగతా సర్వీసులపై ఢిల్లీలో ఎన్నికైన ప్రభుత్వానికే పెత్తనం ఉండాలని, ఇందుకోసం ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలంటూ మే 11న సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. అయితే, ఢిల్లీ ప్రభుత్వంలో పనిచేసే గ్రూప్-ఏ స్థాయి అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై పెత్తనం కొనసాగేలా ప్రత్యేక ఆర్డినెన్స్‌ను మే 19న కేంద్ర ప్రభుత్వం జారీ చేయడం గమనార్హం.

యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఏడుగురు మృతి

బాందా: విద్యుదాఘాతానికి గురైన ఒక బాలుడిని ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో వేగంగా వెళ్తున్న వాహనం ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృత్యువాతపడ్డారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని బాందాలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. టిలౌసా గ్రామానికి చెందిన కల్లు(13) అనే బాలుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కుటుంబసభ్యులు అతడిని తీసుకుని దగ్గర్లోని బబెరు ఆరోగ్య కేంద్రానికి ఎస్‌యూవీలో బయలుదేరారు. వారి వాహనం అదుపుతప్పి కమాసిన్ రోడ్డులో నిలిపిఉన్న ట్రక్కును వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ఈ ఘటనలో కల్లు సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఘటన సమయంలో వారి వాహనం గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో వెళ్తతోందని పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న ట్రక్కు డ్రైవర్ కోసం గాలిస్తున్నామన్నారు.

సొలిసిటర్ జనరల్‌గా మళ్లీ తుషార్ మెహతా

న్యూఢిల్లీ: సీనియర్ న్యాయవాది తుషార్ మెహతా భారత సొలిసిటర్ జనరల్‌గా మళ్లీ నియమితులయ్యారు. 2018లో మొదటిసారిగా సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన తుషార్ మెహతా పదవీ కాలాన్ని ప్రభుత్వం ఇప్పటికే రెండుసార్లు పొడిగించింది. తాజాగా, మూడోసారి మరో మూడేళ్ల కాలానికి ఆయన్ను నియమిస్తూ సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు సుప్రీంకోర్టుకు ఆరుగురు అదనపు సొలిసిటర్ జనరల్‌ను మూడేళ్ల కాలానికి పునర్నియమించింది. వీరు..విక్రమ్‌జీత్ బెనర్జీ, కేఎం నటరాజ్, బల్బీర్‌సింగ్, ఎస్‌వీ రాజు, ఎన్ వెంకటరామన్, ఐశ్వర్య భాటి.

వియత్నాంకు యుద్ధనౌక ఐఎన్ఎస్ కృపాణ్‌ను కానుకగా ఇచ్చిన కేంద్రం

భారతీయ జెండా ఎగురుతూ ఉండగా సగర్వంగా విశాఖ తీరం నుంచి వియత్నాంకు బయల్దేరిన నౌక

దక్షిణ చైనా సముద్రంలో చైనా పెత్తనానికి చెక్ పడేనా?



ఈ కానుక ఏ తీరాలకి..?

➤ భారత్ నావికాదళంలో చురుగ్గా సేవలు అందిస్తున్న యుద్ధనౌక ఐఎన్ఎస్ కృపాణ్‌ను కేంద్ర ప్రభుత్వం వియత్నాంకు కానుకగా ఇచ్చింది. విదేశాలకు ఒక నౌకని బహుమతిగా ఇవ్వడం దేశ చరిత్రలో ఇదే మొదటి సారి. ఈ నౌక విశాఖ నుంచి ఈ నెల 28 బుధవారం వియత్నాంకు బయల్దేరి వెళ్లింది. 2016 నుంచి భారత్, వియత్నాం మధ్య సంబంధాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఇప్పటివరకు మనం ఎన్నో దేశాలకు మిలటరీ సాయం చేశాము. కానీ కోట్లాది రూపాయల విలువ చేసే యుద్ధ నౌకను ఇప్పటివరకు ఎవరికీ ఇవ్వలేదు ? ఎందుకీ నిర్ణయం? దీని వల్ల భారత్‌కు ఒరిగేదేంటి ?

➤ పసిఫిక్ మహా సముద్రంలోని దక్షిణ చైనా సముద్రంపై గత కొన్నేళ్లుగా వివాదం నెలకొంది. చైనా ఈ ప్రాంతంపై తన సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకోవడాన్ని సముద్రం చుట్టూ ఉన్న దేశాలు తీవ్రంగా నిరసిస్తున్నాయి. దక్షిణ చైనా సముద్రం కేవలం డ్రాగన్‌దేనంటే ఊరుకోబోమని అందులో తమకూ భాగం ఉందని గళమెత్తుతున్నాయి. అలాంటి దేశాల్లో వియత్నాం కూడా ఒకటి. చైనా పొరుగునే ఉన్న వియత్నాం ఇండో పసిఫిక్ ప్రాంతంలో మనకి అత్యంత కీలక భాగస్వామిగా ఉంది. భావసారూప్యత కలిగిన భాగస్వామ్య దేశమైన వియత్నాం నౌకాదళ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ దేశ ఆధిపత్యానికి చెక్ పెట్టాలన్నది భారత్ వ్యూహంగా ఉంది. దక్షిణ చైనా సముద్రంపై చైనా పెత్తనం పెరుగుతున్న కొద్దీ ప్రపంచ పటంలో కొత్త మార్పులు వస్తాయన్న ఆందోళనలున్నాయి. ఇటీవల కాలంలో వియత్నాంతో మన దేశానికి ద్వైపాక్షిక సంబంధాలు బలపడుతున్నాయి. రక్షణ రంగంలో సహకరించుకుంటున్నాం. దక్షిణ చైనా సముద్రంలో డ్రాగన్ దేశ పెత్తనం సహించలేనిదిగా మారింది. ఈ నేపథ్యంలో వియత్నాం రక్షణ మంత్రి జనరల్ ఫాన్ వాన్ జియాంగ్ భారతదేశ పర్యటనకు వచ్చినప్పుడు ఈ యుద్ధ నౌకను కానుకగా ఇవ్వాలని భారత్ నిర్ణయించింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. ఇప్పటివరకు భారత్ ఎన్నో మిత్ర దేశాలకు మిలటరీ సాయాలు చేసింది. మాల్దీవులు, మారిషస్ వంటి దేశాలకు చిన్న చిన్న పడవలు, మిలటరీ పరికరాలు ఇచ్చింది. మయన్మార్‌కు ఒక జలాంతర్గామిని ఇచ్చింది. కానీ వియత్నాంకు క్షిపణిని మోసుకుపోగలిగే సామర్థ్యమున్న యుద్ధ నౌకను ఇవ్వడం వల్ల ఆ తీరంలో చైనా కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేయడానికి వీలు కలుగుతుందన్నది భారత్ ఉద్దేశంగా ఉంది.

ప్రత్యేకతలివే..!

➤ ఐఎన్ఎస్ కృపాణ్ ఖుక్రీ క్లాస్‌కు చెందిన అతి చిన్న క్షిపణి యుద్ధనౌక. 1,350 టన్నుల బరువైన, సముద్రజలాలను పక్కకు తోసేస్తూ వేగంగా ముందుకు దూసుకెళ్లగల శక్తివంతమైన నౌక ఇది.

➤ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్, ఇంజనీర్లు రూపొందించిన ఈ నౌక గత కొన్నేళ్లుగా మన నావికాదళానికి గర్వకారణంగా ఉంది.

➤ 1991 జనవరి 12న దీనిని నావికాదళంలోకి ప్రవేశపెట్టారు.. 25 నాట్స్ వేగంతో ప్రయాణించగలదు.

➤ మీడియం రేంజ్ గన్స్ అంటే 30 ఎంఎం తుపాకీలను ఈ నౌకకు అమర్చవచ్చు. ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణులు, చాఫ్ లాంచర్స్ వంటి వైవిధ్యమైన పనులు చేయగలదు.

➤ తీరప్రాంతాల్లో భద్రత, గస్తీ, కదనరంగంలో పాల్గొనడం, యాంటీ పైరసీ, విపత్తు సమయాల్లో మానవతా సాయం వంటివి చేయగల సామర్థ్యముంది.



దక్షిణ చైనా సముద్రం వివాదమేంటి?

➤ దక్షిణ చైనా సముద్రంపై సుదీర్ఘకాలంగా వివాదం నడుస్తోంది. ఈ సముద్ర భూభాగంపై సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకున్న చైనా ఏకంగా కృత్రిమ దీవులను నిర్మిస్తోంది. ఈ సముద్రంలో ఎన్నో దీవులున్నాయి. మత్స్య సంపద అపారంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా చేపల ఉత్పత్తిలో 15 శాతం ఈ సముద్రంలో జరుగుతుంది. దీనిపై చైనా సార్వభౌమాధికారాన్ని ప్రకటించుకోవడం ఇతర దేశాలకు మింగుడు పడడం లేదు.ఈ సముద్రంలో ఉన్న అన్ని ద్వీపాలను ఒకే రేఖ మీద చూపిస్తూ చైనా విడుదల చేసిన ''నైన్ డ్యాష్ లైన్' మ్యాప్‌తో తన వేనని వాదిస్తోంది. ఈ సముద్రంలో భారీగా నున్న చమురు నిల్వలపై అన్వేషణ కూడా ప్రారంభం కావడంతో దేశాల మధ్య పోటీ ఎక్కువైంది. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహా సముద్రం మధ్యలో దక్షిణ చైనా సముద్రం ఉండడం వల్ల అక్కడ చైనా జోక్యం పెరిగితే భారత్‌కూ నష్టమే. ఈ సముద్రం చుట్టూ చైనా, తైవాన్, వియత్నాం, మలేసియా, ఇండోనేసియా, బ్రూనై, ఫిలిప్పీన్స్ దేశాలున్నాయి. ఇవి కూడా సముద్రంలో తమకూ వాటా ఉందని ప్రకటించాయి. మరోవైపు చైనా కృత్రిమ దీవులు, సైనిక స్థావరాలతో ఉద్రిక్తతలు చెలరేగుతూనే ఉన్నాయి. ఈ పరిణామాల మధ్య మనం పంపిన కృపాణ్ దక్షిణ చైనా జలాల్లో ఎంత మేరకు నిఘా పెడుతూ డ్రాగన్‌కు చెక్ పెడుతుందో వేచిచూడాలి.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఫ్రాన్స్‌లో ఆగని నిరసనలు

- 667 మంది ఆందోళనకారుల అరెస్ట్
- పారిస్ శివారు ప్రాంతాల్లో కర్ఫ్యూ
- 200 మంది పోలీసులకు గాయాలు

పారిస్: ఫ్రాన్స్‌లో పోలీసు కాల్పుల్లో యువకుడి మృతి ఘటన అనంతరం మొదలైన ఉద్రిక్తతలు మూడో రోజు రాత్రి కూడా కొనసాగాయి. నిరసనకారులు వీధుల్లో అడ్డంకులు ఏర్పాటు చేసి, కార్లు, దుకాణాలు, ప్రభుత్వ భవనాలకు నిప్పుపెడుతున్నారు. పోలీసులపై రాళ్లతో దాడులు చేస్తున్నారు. బాణసంచా కాల్చి పోలీసుల పైకి వదులుతున్నారు. పారిస్ శివారుల్లో ఆందోళనకారులు ఒక బస్‌డిపోకు, రోడ్లపై కార్లకు నిప్పుపెట్టారు. పారిస్‌లోని 12వ డిస్ట్రిక్ట్ పోలీస్‌స్టేషన్‌పై దాడి జరిగింది. రివోలీ వీధిలోని కొన్ని దుకాణాలను, నగరంలోని అతిపెద్ద షాపింగ్ మాల్ ఫోరం డెస్ హాలెస్‌ను దోచుకున్నారు. పరిస్థితులను చక్కదిద్దేందుకు అధికారులు 40వేల మంది పోలీసులను రంగంలోకి దించారు. టియర్ గ్యాస్, వాటర్ కెనన్లను ప్రయోగించి ఆందోళనకారులను చెదరగొడ్తున్నారు. శివారు ప్రాంతాల్లో రాత్రి వేళ కర్ఫ్యూ విధిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యగా పారిస్‌లో బస్సు, ట్రామ్ సర్వీసులను నిలిపివేశారు. ఆందోళనకారుల దాడుల్లో 200 మంది పోలీసులు గాయపడ్డారు. అదుపులోకి తీసుకున్న 667 మంది ఆందోళనకారుల్లో 307 మంది పారిస్ రీజియన్‌కు చెందినవారేనని అధికారులు తెలిపారు. ప్రశాంత పరిస్థితులను నెలకొల్పేందుకు కఠినంగా వ్యవహరిస్తామని అంతరంగిక శాఖ మంత్రి గెరాల్డ్ ప్రకటించారు. ఇలా ఉండగా, పారిస్ శివారు నాంటెర్రె వద్ద మంగళవారం యువకుడిపై కాల్పులు జరిపిన పోలీసు అధికారిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన 17 ఏళ్ల నహేల్ కుటుంబం ఆఫ్రికా దేశం అల్జీరియా నుంచి వలస వచ్చినట్లు సమాచారం. ఈ ఘటనతో మరోసారి ఫ్రాన్స్ పోలీసుల జాతి దురహంకార వైఖరిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాదిలో మరో ఇద్దరిని కూడా పోలీసులు తనిఖీల సమయంలోనే కాల్చి చంపినట్లు చెబుతున్నారు. ఫ్రాన్స్ అల్లర్లు బెల్జియం రాజధాని బ్రస్సెల్స్‌కు కూడా పాకాయి. బాహాబాహీకి దిగిన 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పలు చోట్ల ఆందోళనకారులు భవంతులకు, వాహనాలకు నిప్పుపెట్టారని ప్రభుత్వం తెలిపింది.

టీనేజర్లను బయటకు రానివ్వకండి: తల్లిదండ్రులకు మాక్రాన్ వినతి

దేశమంతటా వ్యాపిస్తున్న అల్లర్లను అణచివేసే క్రమంలో టీనేజీ యువకులను ఇంట్లోనే ఉంచి తోడ్పడాలని అధ్యక్షుడు ఎమ్మానుయేల్ మాక్రాన్ తల్లిదండ్రులను కోరారు. దేశంలో అల్లర్లకు సోషల్ మీడియానే హింసను ప్రేరేపిస్తోందని ఆరోపించారు. శుక్రవారం ఆయన సీనియర్ మంత్రులతో అత్యవసరంగా సమావేశమై శాంతి భద్రతలపై చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసు కాల్పుల్లో 17 ఏళ్ల యువకుడి మృతి అనంతరం అశాంతిని వ్యాపింపజేయడంలో సోషల్ మీడియానే ప్రముఖంగా ఉందన్నారు. హింసాత్మక ఘటనలకు ప్రేరణ కలిగిస్తున్న సామాజిక మాధ్యమ వేదికలైన స్నాప్ చాట్, టిక్‌టాక్ వంటివి సున్నిత అంశాలకు సంబంధించిన కంటెంట్‌ను తొలగించాలని కోరారు. వీడియో గేమ్‌లు యువత మెదళ్లను విషతుల్యం చేస్తున్నాయని, దీంతో కొందరు అస్తమానం వీధుల్లోనే గడుపుతున్నారని వ్యాఖ్యానించారు.



పారిస్ శివారులోని నాంటెర్రెలో దహనమవుతున్న వాహనాలు

ఎస్‌సీవో వర్చువల్ భేటీకి జిన్‌పింగ్

బీజింగ్: భారత్ ఆధ్వర్యంలో జూలై 4వ తేదీన వర్చువల్‌గా జరగనున్న షాంఘై సహకార సంఘం (ఎస్‌సీవో) శిఖరాగ్ర భేటీకి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరు కానున్నారు. ఈ విషయాన్ని డ్రాగన్ దేశం చైనా శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు ఎస్‌సీవో 23వ ప్రభుత్వాధినేతల సమావేశానికి జిన్‌పింగ్ హాజరవుతారని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మీడియాకు తెలిపారు. 2001లో ఏర్పాటైన ఎస్‌సీవోలో భారత్, పాక్‌లు 2017లో శాశ్వత సభ్యదేశాలయ్యాయి. రొటేషన్ విధానంలో భారత్‌కు ఈ ఏడాది అధ్యక్ష స్థానం దక్కింది.

మన వర్సిటీలు ప్రపంచంలో మేటి

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- క్యూఎస్ గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో 45 వర్సిటీలకు స్థానం
- అమెరికాతో ఒప్పందాలతో మన యువతకు నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు
- ఢిల్లీ యూనివర్సిటీ శతాబ్ది వేడుకలకు హాజరైన ప్రధాని మోదీ



రైలు బోగీలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లలో అమల్లోకి తీసుకొచ్చిన విధానాలు, తీసుకున్న నిర్ణయాలతో భారతీయ విశ్వవిద్యాలయాలకు ప్రపంచవ్యాప్తంగా మరింత గుర్తింపు లభించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. మన వర్సిటీలు ప్రపంచంలో అగ్రగామిగా ఎదుగుతున్నాయని చెప్పారు. శుక్రవారం ఢిల్లీ యూనివర్సిటీ శతాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2014లో క్యూఎస్ గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో కేవలం 12 భారతీయ యూనివర్సిటీలు చోటు దక్కించుకున్నాయని, ఇప్పుడు వాటి సంఖ్య 45కు చేరుకుందని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్, ఎన్ఐటీల సంఖ్య పెరిగిందని చెప్పారు. నవ భారత నిర్మాణంలో అవి విశిష్టమైన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. ఇటీవల జరిగిన తన అమెరికా పర్యటనను మోదీ ప్రస్తావించారు. మన దేశ యువత పట్ల ప్రపంచానికి విశ్వాసం పెరిగిందన్నారు. అమెరికాతో పలు ఒప్పందాలు కుదుర్చుకున్నామని, వీటివల్ల అంతరిక్షం, సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధ వంటి కీలక రంగాల్లో మన దేశ యువతకు నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు.

మన విద్యా వ్యవస్థకు ఘన చరిత్ర

మైక్రాన్, గూగుల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలు భారత్‌లో పెట్టుబడులు భారీగా పెట్టబోతున్నాయని, మనదేశ ఉజ్వల భవిష్యత్తుకు ఇదొక సూచిక అని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఢిల్లీ యూనివర్సిటీ అంటే కేవలం ఒక విద్యాలయం కాదని, ఒక ఉద్యమమని వ్యాఖ్యానించారు. ప్రాచీన కాలంలో నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలు సంతోషానికి, సౌభాగ్యానికి వనరులుగా నిలిచాయని చెప్పారు. భారతీయ విద్యావ్యవస్థకు ఘన చరిత్ర ఉందన్నారు. విదేశీయుల నిరంతర దాడుల వల్ల భారతీయ విద్యావ్యవస్థ కుప్పకూలిందని, తద్వారా అభివృద్ధి ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం వర్సిటీలు నైపుణ్యం కలిగిన యువతను దేశానికి అందించాయని, అభివృద్ధికి పాటుపడ్డాయని మోదీ ప్రశంసించారు.

'యుగే యుగే భారత్' మ్యూజియం

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో గిరిజన ప్రదర్శనశాలలు(మ్యూజియమ్స్) ఏర్పాటు చేశామని, ఢిల్లీలోని 'ప్రైమ్ మినిస్టర్స్ మ్యూజియం' ద్వారా స్వతంత్ర భారత్ అభివృద్ధి ప్రయాణాన్ని తెలుసుకోవచ్చని నరేంద్ర మోదీ చెప్పారు. 'యుగే యుగే భారత్' పేరిట ప్రపంచంలోనే అతిపెద్ద హెరిటేజ్ మ్యూజియాన్ని ఢిల్లీలో నిర్మిస్తున్నామని తెలిపారు. మన స్టార్టప్ కంపెనీల సంఖ్య లక్ష మార్కును దాటిందన్నారు. 2014లో కేవలం వందల సంఖ్యలోనే స్టార్టప్‌లు ఉండేవన్నారు. ఢిల్లీ యూనివర్సిటీ కంప్యూటర్ సెంటర్, ఫ్యాకల్టీ ఆఫ్ టెక్నాలజీ భవనాలు, నార్త్ క్యాంపస్ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి ప్రధాని పునాదిరాయి వేశారు. ఢిల్లీ యూనివర్సిటీ 1922 మే 1న ఏర్పాటైంది. ప్రస్తుతం ఈ వర్సిటీలో 86 డిపార్ట్‌మెంట్లు, 90 కాలేజీలు ఉన్నాయి.

మెట్రో రైలులో మోదీ ప్రయాణం

ప్రధాని మోదీ శుక్రవారం ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణించారు. ఢిల్లీ యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆయన మెట్రో రైలులో వచ్చారు. రైలులో విద్యార్థులతో సరదాగా సంభాషించారు. అనంతరం ఢిల్లీ యూనివర్సిటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తన మెట్రో రైలు ప్రయాణ అనుభవాన్ని పంచుకున్నారు. ఓటీటీల్లో ప్రసారమవుతున్న కొత్త వెబ్ సిరీస్‌ల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నానని చెప్పారు. ఏ వెబ్ సిరీస్ బాగుంది? ఏ రీల్స్ బాగున్నాయో వారు చెప్పగలరని పేర్కొన్నారు. మాట్లాడేందుకు విద్యార్థుల వద్ద ఎన్నో అంశాలు ఉన్నాయన్నారు. సైన్స్ నుంచి ఓటీటీల్లోని కొత్త వెబ్ సిరీస్‌ల దాకా చాలా విషయాలను వారితో మాట్లాడొచ్చని వెల్లడించారు. ఏ ఒక్క అంశాన్నీ వారు వదిలిపెట్టరని వ్యాఖ్యానించారు. భూగోళంపై ఉన్న అన్ని అంశాలను విద్యార్థులు చక్కగా చర్చించగలరని ట్వీట్ చేశారు.

మణిపూర్‌లో శాంతిని పునరుద్ధరించండి

గవర్నర్‌ను కోరిన రాహుల్ గాంధీ

ఇంఫాల్: సమాజంలో నెలకొన్న సమస్యలకు, వివాదాలకు హింసాకాండ ఎంతమాత్రం పరిష్కార మార్గం కాదని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. మణిపూర్‌లో తక్షణమే శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాహుల్ శుక్రవారం మణిపూర్ గవర్నర్ అనసూయ ఉయికేతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఘర్షణకు తెరదించి, శాంతియుత పరిస్థితులు నెలకొనేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మణిపూర్ ప్రజల దుఃఖాన్ని పంచుకోవడానికి తాను ఇక్కడికి వచ్చానని రాహుల్ చెప్పారు. రాహుల్ శుక్రవారం ప్రజా సంఘాల సభ్యులతో సమావేశమై తాజా పరిస్థితిపై వారితో చర్చించారు.

పదవి నుంచి తప్పుకోను..: బిరేన్ సింగ్

మణిపూర్‌లో జాతుల మధ్య ఎడతెగని ఘర్షణల నేపథ్యంలో సీఎం రాజీనామా చేశారంటూ వస్తున్న వదంతులకు ముఖ్యమంత్రి బిరేన్ సింగ్ చెక్‌పెట్టారు. పదవి నుంచి వైదొలగడం లేదని స్పష్టతనిచ్చారు. శుక్రవారం రాజ్‌భవన్ వైపు వెళ్తున్న సీఎం కాన్వాయ్‌ను పెద్దసంఖ్యలో ప్రజలు అడ్డగించారు. ఈ సందర్భంగా ఆయన.. సీఎం పదవికి రాజీనామా చేయడం లేదని ప్రకటించారు. ఇలా ఉండగా, గురువారం కాంగ్‌పోక్పి జిల్లాలో ఆందోళనకారులు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన కాల్పుల్లో గాయపడిన అయిదుగురిలో ఒకరు శుక్రవారం ఆస్పత్రిలో చనిపోయారు. దీంతో ఈ ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది.

నరేంద్ర మోదీ బిగ్ ఫ్రెండ్

భారత ప్రధానిపై రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రశంసలు



మాస్కో: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ రష్యాకు గొప్ప మిత్రుడు(బిగ్ ఫ్రెండ్) అని పేర్కొన్నారు. మోదీ కొన్నేళ్ల క్రితం ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేస్తోందని కొనియాడారు. గురువారం మాస్కోలో ఏజెన్సీ ఫర్ స్ట్రాటెజిక్ ఇనీషియేటివ్స్(ఏఎస్ఐ) కార్యక్రమంలో పుతిన్ మాట్లాడారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. మనం కాకపోయినా, మన స్నేహితుడు చేసిన పని సత్ఫలితాలు ఇస్తుంటే అనుకరించడంలో తప్పేమీ లేదన్నారు. స్థానికంగా తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా భారత నాయకత్వం ప్రభావవంతమైన విధానాలను సృష్టిస్తోందని, విదేశీ పెట్టుబడిదారులను అమితంగా ఆకర్శిస్తోందని చెప్పారు. పుతిన్, నరేంద్ర మోదీ చివరిసారిగా 2022 సెప్టెంబర్‌లో ఉజ్బెకిస్తాన్‌లో ఓ సదస్సు సందర్భంగా కలుసుకున్నారు.

ద్వైపాక్షిక, వ్యూహాత్మక బంధాలు బలోపేతం చేసుకుందాం

తమ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక, వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ నిర్ణయించుకున్నారు. ఇరువురు నేతలు శుక్రవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఉక్రెయిన్‌లో సంఘర్షణతోపాటు అంతర్జాతీయ పరిణామాలపై చర్చించుకున్నారు. కీలక రంగాల్లో భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సహకారంలో పురోగతిని ఇరువురూ సమీక్షించారు. ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా పరస్పర ప్రయోజనాలతో ముడిపడి ఉన్న అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. రెండు దేశాల నడుమ వ్యాపార, వాణిజ్యాల విలువ నానాటికీ పెరుగుతుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్‌లో ఘర్షణ ఆగిపోవాలన్నదే తమ ఉద్దేశమని, దౌత్య మార్గాల్లో చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఉక్రెయిన్ నాయకత్వం అందుకు అంగీకరించడం లేదని మోదీకి పుతిన్ తెలియజేశారు. వివాదాలకు తెరదించడానికి దౌత్య ప్రయత్నాలు, చర్చలే మార్గమని మోదీ పునరుద్ఘాటించారు. మోదీ, పుతిన్ మధ్య అర్థవంతమైన, నిర్మాణాత్మక సంభాషణ జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

రాహుల్ ప్రధాని అయితే స్కాములే గతి

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



ఉదయ్‌పూర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే దేశం కుంభకోణాలు, అవినీతి మయంగా మారుతుందని హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. మళ్లీ నరేంద్ర మోదీయే ప్రధానమంత్రి అయితే మోసగాళ్లంతా కటకటాల వెనక్కి వెళ్తారని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయ్‌పూర్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగించారు. పట్నాలో ఇటీవల జరిగిన ప్రతిపక్ష నేతల భేటీపై ఆయన..'అక్కడ సమావేశమైన వారంతా అవినీతితో సంబంధం ఉన్నవాళ్లే. వారి ఆరాటమంతా తమ కుమారుల భవిష్యత్తు కోసమే తప్ప ప్రజలకు మంచి చేయడం కాదు'అని విమర్శించారు. 'రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే సోనియా గాంధీ లక్ష్యం. లాలూ ప్రసాద్ యాదవ్ లక్ష్యం తేజస్వీయాదవ్‌ను ప్రధానిని చేయడం, తన మేనల్లుడు అభిషేక్‌ను సీఎంను చేయడమే మమతా బెనర్జీ లక్ష్యం. కొడుకు వైభవ్ గెహ్లాట్‌ను సీఎంను చేయడం అశోక్ గెహ్లాట్ లక్ష్యం'అని ఆయన ఎద్దేవా చేశారు. రాజస్తాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. గత ఏడాది ఉదయ్‌పూర్‌లో జరిగిన కన్హయ్య లాల్ హత్య కేసులో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసి ఉంటే, ఇప్పటికే నిందితులకు ఉరిశిక్ష పడి ఉండేదని పేర్కొన్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న సీఎం గహ్లోత్ వల్లే నిందితులకు శిక్ష పడటం ఆలస్యమవుతోందని ఆరోపించారు. సస్పెండైన బీజేపీ నేత నుపుర్ శర్మకు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ కన్హయ్య లాల్ అనే దర్జీని గత ఏడాది ఇద్దరు దుండగులు పొట్టనబెట్టుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో కన్హయ్యలాల్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రక్షణ కల్పించలేకపోయిందని మంత్రి అన్నారు.

సురోవికిన్ కూడా వాగ్నర్ సభ్యుడే

సీఎన్ఎన్ కథనంలో వెల్లడి



న్యూయార్క్: రష్యాలో వాగ్నర్ గ్రూప్ తిరుగుబాటు ఘటన అక్కడి మిలటరీలో లుకలుకలను ఒకటొకటిగా బయటపెడుతోంది. తాజాగా, రష్యా టాప్ మిలటరీ కమాండర్ జనరల్ సెర్గెయ్ సురోవికిన్ వాగ్నర్ గ్రూప్‌లో రహస్య వీఐపీ సభ్యుడని తెలిపే కొన్ని పత్రాలు దొరికినట్లు సీఎన్ఎన్ పేర్కొంది. వాగ్నర్ వీఐపీ సభ్యుడిగా సురోవికిన్ పేరు 2018లో నమోదైనట్లు అందులో తెలిపింది. ఆయనతోపాటు మరో 30 మంది రష్యా సీనియర్ మిలటరీ, ఇంటిలిజెన్స్ అధికారులు కూడా వాగ్నర్ వీఐపీ సభ్యులని పేర్కొంది. వాగ్నర్ సభ్యుడిగా సురోవికిన్ ఉన్నారనేందుకు కచ్చితమైన ఆధారాలేవీ లేనప్పటికీ, రష్యా సైనిక బలగాల్లోని చాలా మంది సీనియర్ అధికారులు వాగ్నర్ గ్రూప్‌తో దగ్గరి సంబంధాలు సాగించేందుకు అవకాశం ఉందని సీఎన్ఎన్ కథనం పేర్కొంది. ఇలాంటి దగ్గరి సంబంధాల వల్లే వాగ్నర్ కిరాయి సైనికులు రొస్తోవ్‌లోని కీలక మిలటరీ బేస్‌ను శ్రమ లేకుండా స్వాధీనం చేసుకోగలిగారన్న అనుమానాలున్నాయి. తిరుగుబాటు అనంతరం సురోవికిన్ కనిపించకుండా పోయారు. ప్రిగోజిన్ తిరుగుబాటు విషయం ఆయనకు తెలుసునంటూ న్యూయార్క్‌టైమ్స్ కథనం పేర్కొంది. ప్రిగోజిన్‌ను తిరుగుబాటు ఆపేయాలంటూ విడుదల చేసిన వీడియోలో సురోవికిన్ తడబడుతూ మాట్లాడుతున్నట్లు కనిపించారు. దీంతో, ఆయన మానసిక ఆరోగ్యంపైనా అనుమానాలున్నాయి. జనరల్ ఆర్మగెడ్డాన్‌గా పిలుచుకునే సురోవికిన్ అధ్యక్షుడు పుతిన్‌కు నిన్నటిదాకా నమ్మినబంటు. తాజా పరిణామాలతోనూ ఆయన్ను పుతిన్ నమ్ముతారా అన్నది తేలాల్సి ఉంది.

ఎగిరే కారుకు అమెరికా అనుమతి

- 2025 నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తామన్న అలెఫ్ కంపెనీ
- మోడల్-ఎ ధర రూ. 2.46 కోట్లు.. ప్రారంభమైన బుకింగ్



కాలిఫోర్నియా: తాము తయారు చేసిన ఎగిరే కారు(ఫ్లయింగ్ కారు)కు అమెరికా ప్రభుత్వం నుంచి చట్టబద్ధ అనుమతి లభించిందని కాలిఫోర్నియాకు చెందిన అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ ప్రకటించింది. ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్(ఈవీటీఓఎల్) వెహికల్ అని పిలిచే ఈ కారు పూర్తిగా విద్యుత్‌తో పనిచేస్తుంది. ఫ్లయింగ్ కారును తొలిసారిగా 2022 అక్టోబర్‌లో అలెఫ్ కంపెనీ ఆవిష్కరించింది. రోడ్లపైనే పరుగులు తీయడమే కాదు, గాల్లోనూ ప్రయాణించడం ఈ కారు ప్రత్యేకత. హెలికాప్టర్ తరహాలో గాల్లోకి నిలువుగా ఎగరగలదు. నిలువుగా భూమిపై దిగగలదు. మోడల్-ఎ ఫ్లయింగ్ కారు ఒకసారి పూర్తిగా చార్జింగ్ చేస్తే రోడ్డుపై 200 మైళ్లు(322 కిలోమీటర్లు), గాలిలో 110 మైళ్లు(177 కిలోమీటర్లు) ప్రయాణించగలదు. ఇద్దరు వ్యక్తులు ఇందులో ప్రయాణించవచ్చు. ఈ కారు ప్రారంభ ధర 3 లక్షల అమెరికన్ డాలర్లు(రూ.2.46 కోట్లు). 150 డాలర్లు (రూ.12,308) చెల్లించి అలెఫ్ వెబ్‌సైట్ ద్వారా ఫ్లయింగ్ కారును బుక్ చేసుకోవచ్చు. ఇప్పటికే ప్రజల నుంచే కాకుండా కంపెనీల నుంచి కూడా ఆర్డర్లు వెల్లువెత్తుతున్నాయని అలెఫ్ ఏరోనాటిక్స్ కంపెనీ వెల్లడించింది. మోడల్-ఎ కార్ల ఉత్పత్తిని 2025 నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని ప్రకటించింది. తమ ఎగిరే కారుకు యూఎస్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్ఏఏ) నుంచి స్పెషల్ ఎయిర్‌వర్తీనెస్ సర్టిఫికెట్ లభించిందని అలెఫ్ సంస్థ హర్షం వ్యక్తం చేసింది. ఇలాంటి వాహనానికి అమెరికా ప్రభుత్వం నుంచి అనుమతి రావడం ఇదే మొదటిసారి అని తెలియజేసింది. మోడల్-ఎ మాత్రమే కాకుండా మోడల్-జెడ్ తయారీపైనా అలెఫ్ సంస్థ దృష్టి పెట్టింది. మోడల్-జెడ్‌ను 2035 నుంచి మార్కెట్‌లోకి తీసుకురావాలని భావిస్తోంది. ఈ మోడల్ డ్రైవింగ్ రేంజ్, ఫ్లయింగ్ రేంజ్ మరింత అధికంగా ఉంటుంది. ఇందులో ఆరుగురు ప్రయాణించవచ్చు.

క్లుప్తంగా...

బీఆర్ఎస్, బీజేపీలది ఢిల్లీలో దోస్తీ .. గల్లీలో కుస్తీ

- కాంగ్రెస్ నేత పొన్నం ప్రభాకర్



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో ఈనెల 8న ప్రధాని మోదీ తలపెట్టిన పర్యటనపై కాంగ్రెస్ సీనియర్ నేత పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టా లేక రాష్ట్ర ప్రభుత్వ ప్రాజెక్టా అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్, బీజేపీలు ఢిల్లీలో దోస్తులుగా ఉంటూ.. గల్లీలో కుస్తీ పడుతున్నట్లు నటిస్తున్నాయని మండిపడ్డారు. ఒకవేళ ఈ రెండు పార్టీల మధ్య సయోధ్య లేక పోతే ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితను ఇంకా ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా జరిపిన రాష్ట్ర ప్రభుత్వం.. విభజన హామీలపై కేంద్రంతో ఎందుకు పోరాటం చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీజేపీకి అభ్యర్థులు కరువయ్యారని ఎద్దేవా చేశారు.

భార్యలను వదిలేసేవారే బీజేపీకి ఓటేయండి

కాంగ్రెస్ సీనియర్ నేత నిరంజన్



సాక్షి, హైదరాబాద్: 'పరివార్ వాద్‌కో ఓట్ దేనా హైతో కాంగ్రెస్‌కో ఓట్ దేనా'.. అని ప్రధాని మోదీ చెబుతున్నారని.. 'పరివార్‌కో చోడ్‌నా హైతో బీజేపీకో ఓట్ దేనా'అంటూ పెళ్లి చేసుకుని భార్యలను వదిలేయాలనుకునే వారు బీజేపీకి ఓటేయాలని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ప్రధాని మోదీ అర్థాంగి లేకుండానే అయోధ్యలో పూజ చేసి అపచారం చేశారని విమర్శించారు. జై శ్రీరామ్ కేవలం నినాదాలకేనా, శ్రీరాముడు పాటించిన ధర్మసూత్రాలు బీజేపీ నేతలకు పట్టవా? అని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు మైండ్ బ్లాక్ అయిందని.. అందుకే ఆయనేం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ కిరాణా దుకాణమంటున్న సంజయ్, తన పార్టీ అంగడి పేరేంటో చెప్పాలని కోరారు.

వైఎస్సార్‌తో కేసీఆర్‌కు పోలికా?: వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: నాగలోకానికి.. నక్కకు ఎంత తేడా ఉందో.. వైఎస్సార్ పాలనకు, కేసీఆర్ పాలనకు అంత తేడా ఉందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత వైఎస్ షర్మిల శుక్రవారం ట్వీట్ చేశారు. వైఎస్సార్ ఇమేజ్ ప్రో పూర్, ప్రో ఫార్మర్, ప్రో అగ్రికల్చర్ అయితే.. కేసీఆర్‌కున్న ఇమేజ్ యాంటీ పూర్ అని ఆమె వ్యాఖ్యానించారు. కరప్షన్ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే కరప్షన్ అని వ్యాఖ్యానించారు. తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రం సమతుల్య అభివృద్ధి చెందిందని చెబుతున్న కేటీఆర్‌కు ఆమె సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల స్కాం, కవిత లిక్కర్ స్కాం, రియల్ ఎస్టేట్ స్కాంలకు పాల్పడలేదని నిరూపించుకునే దమ్ముందా? అని షర్మిల నిలదీశారు

సత్ఫలితాలిస్తున్న పర్యావరణ పరిరక్షణ పాఠాలు

సిద్దిపేటలో 8 వేల మందికి పైగా శిక్షణ

3 వేలకు పైగా గృహాల్లో తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీ

మిద్దె తోటల్లో కూరగాయల సాగుకు వినియోగం

అన్నిచోట్లా ఇలాంటి బడులు ఏర్పాటు చేస్తామన్న మంత్రి కేటీఆర్



స్వచ్ఛ బడి..

సేంద్రియ సిరి

సాక్షి, సిద్దిపేట

సిద్దిపేటలో ఏర్పాటు చేసిన 'స్వచ్ఛ బడి' సత్ఫలితాలు ఇస్తోంది. పట్టణంలోని ఒకటి రెండు కాదు, ఏకంగా 3 వేలకు పైగా ఇళ్లలో చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. ఈ ఎరువును ఇంటిమేడపై సాగు చేస్తున్న మిద్దె తోటలకు వినియోగిస్తున్నారు. స్వచ్ఛ బడి ద్వారా నేర్చుకున్న పాఠాలను ఆచరణలో పెట్టి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. చెత్త ఒక వ్యర్థం కాదని నిరూపిస్తున్నారు. ఇదే విధానాన్ని అందరూ అవలంబిస్తే పర్యావరణ కాలుష్యానికి కళ్లెం వేయడంతో పాటు చెత్త, డంపింగ్ యార్డుల సమస్యను చాలావరకు అధిగమించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఈ స్వచ్ఛబడిని సందర్శించిన మంత్రి కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి బడులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రకటించారు.

స్వచ్ఛ బడి అంటే..

- సిద్దిపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 2021 ఏప్రిల్ 10న ఈ స్వచ్ఛ బడిని ప్రారంభించారు. ఎకరానికి పైగా విస్తీర్ణంలో దేశంలోనే రెండోదైన స్వచ్ఛ బడిని మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేశారు. ఇది అ..అంటే అమ్మ, ఆ..అంటే ఆవు లాంటి పదాలు ఇతర పాఠాలు బోధించే బడి కాదు. పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగంపై ఆరేళ్ల నుంచి అరవై ఏళ్ల వయసు గల వారికి పాఠాలు చెప్పే బడి. ఒకేసారి 50 మంది క్లాస్ వినే విధంగా దీనిని ఏర్పాటు చేశారు. వర్మీ కంపోస్టు యార్డు, పక్కనే పార్కు, డిజిటల్ తరగతి గది, హోం కమ్యూనిటీ కంపోస్టింగ్ ఏర్పాటు చేశారు. సేంద్రియ ఎరువుల ద్వారా పండించే కూరగాయల తోట పెట్టారు. ప్లాస్టిక్‌తో కలిగే అనర్థాల గురించి తెలిసేలా చిత్రాలను వేశారు. ఇందులో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగంపై బోధించడంతో పాటు పనికి రాని వస్తువులతో వివిధ రకాల వస్తువులను తయారు చేయడం, ఖాళీ సీసాలతో స్వాగత తోరణాలు, వెదురు బొంగులతో ప్రహరీ ఏర్పాటు చేయడంపై శిక్షణ ఇస్తున్నారు.

ఫోర్ ఆర్ పై శిక్షణ..

తడి, పొడి, హానికరమైన చెత్తను వేరు చేయడం, ఫోర్ ఆర్.. అంటే రీయూజ్ (పునర్వినియోగం), రీసైకిల్ (తిరిగి తయారీ), రెఫ్యూజ్ (నిరాకరించడం), రెడ్యూస్ (తగ్గింపు) చేయడం కూడా నేర్పిస్తున్నారు. జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్, తడి చెత్తతో సేంద్రియ ఎరువు తయారీపై ప్రత్యక్షంగా వివరిస్తున్నారు. ఇలా ఒక్క క్లాస్ రెండున్నర గంటల పాటు ఉంటుంది. ఈ బడిలో ఇప్పటివరకు 8వేల మందికి పైగా పాఠాలు విన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల వారు విదేశీయులు సైతం సందర్శించి స్వచ్ఛ బడి గురించి తెలుసుకుంటున్నారు. 15 మున్సిపాలిటీలకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు క్లాసులు విన్నారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ శాంతి పర్యవేక్షణలో స్వచ్ఛ బడి కొనసాగుతోంది.

తడి చెత్తతో ఎరువు..

ప్రతి రోజూ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చెత్త బండ్లు పట్టణంలోని గృహాలకు తిరిగి తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరిస్తుంటాయి. పట్టణంలోని 43 వార్డుల్లో 41,322 గృహాలు, 1,57,026 జనాభా ఉంది. ఇందులో 3 వేలకు పైగా ఇళ్లలో తడి చెత్తతో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నారు. కేవలం పొడి, హానికరమైన చెత్తను మాత్రం చెత్తబండికి అందజేస్తున్నారు. ఇలా ఇంట్లోనే తయారు చేసే సేంద్రియ ఎరువుతో కూరగాయలు బాగా కాస్తుండటంతో పట్టణవాసులు క్రమంగా దీని తయారీకి మొగ్గు చూపుతున్నారు.



స్వచ్ఛ బడిలో జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన మోడల్



స్వచ్ఛ బడిలో శిక్షణ ఇస్తున్న నిర్వాహకురాలు దీప్తి నాగరాజు

సేంద్రియ ఎరువుతో కూరగాయల సాగు



స్వచ్ఛ బడిలో పర్యావరణ పరిరక్షణ కోసం క్లాసులు విన్నాను. అప్పటి నుంచి మా ఇంటి నుంచి తడి చెత్తను మున్సిపాలిటీ బండికి ఇవ్వడం మానేశా. దాన్ని ఉపయోగించి ఇంట్లోనే సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నా. దీనిని మిద్దెతోటలోని మొక్కలకు వేయడంతో కూరగాయలు, పూలు బాగా కాస్తున్నాయి.
– గుడాల జ్యోతి, ప్రైవేట్ స్కూల్ టీచర్, సిద్దిపేట

భవిష్యత్ తరాల కోసం..



బెంగళూరులో జీరో వేస్ట్ మేనేజ్‌మెంట్ గురించి తెలుసుకున్నాం. డాక్టర్ శాంతి చెప్పిన మాటలు మాకు స్ఫూర్తిని ఇచ్చాయి. మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేటలోస్వచ్ఛ బడిని ఏర్పాటు చేసి పట్టణవాసులకు అవగాహన కల్పిస్తున్నాం. భవిష్యత్ తరాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని దీనికి శ్రీకారం చుట్టాం. – దీప్తి నాగరాజు, కౌన్సిలర్, స్వచ్ఛ బడి నిర్వాహకురాలు

కోవర్టులతో కేసీఆర్ కుట్రలు

- బీజేపీ, కాంగ్రెస్‌లను దెబ్బతీసేందుకు పన్నాగాలు
- జితేందర్‌రెడ్డి ట్వీట్‌పై ఆయన్నే అడగాలి
- ఎమ్మెల్యే ఈటల రాజేందర్



గజ్వేల్: బీజేపీ, కాంగ్రెస్‌లలో కోవర్టులను పెట్టుకొని.. ఈ రెండు పార్టీలపై కుట్రలను అమలు చేయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని, కేసీఆర్ ఎత్తుగడల నేపథ్యంలో ఇంటి దొంగల పట్ల ప్రతిపక్ష నేతలు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరముందని హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేసీఆర్ విధానాలపై ధ్వజమెత్తారు. పార్టీ నేత జితేందర్‌రెడ్డి ట్వీట్‌పై స్పందించాలని విలేకరులు కోరగా.. ఆ ట్వీట్‌పై ఆయన్నే అడగాలని చెప్పారు. ప్రగతి భవన్ కేంద్రంగా తన నియోజకవర్గంపై సాగుతున్న కుట్రలకు తెరదించాలన్నారు. ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌ను ఓడించారనే అక్కసుతో తనకు మద్దతు ఇచ్చే నాయకులు, కార్యకర్తలు, ప్రజలను బూతులు తిడుతున్నారని ఆరోపించారు. ఇక్కడి సమస్యలను పట్టించుకోని కేసీఆర్, ఆర్భాటంగా మహారాష్ట్రకు వెళ్లి ఆ రాష్ట్ర సమస్యలను పరిష్కరిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చేర్యాలలో జరిగిన బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి కూడా ఈటల హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటు చేసి పేదలను దోచుకుంటున్నారని ఆరోపించారు. పేదల భూములు లాక్కొని పెద్దలకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు.

ఈటలకు భద్రత పెంపు?

బుల్లెట్‌ప్రూఫ్ వాహనంతోపాటు 16 మంది భద్రతా సిబ్బంది కేటాయింపు!

సాక్షి, హైదరాబాద్: హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు భద్రత పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈటలకు బుల్లెట్‌ప్రూఫ్ వాహనంతోపాటు 16 మంది భద్రతా సిబ్బందిని కేటాయించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి తనను చంపించేందుకు రూ. 20 కోట్ల సుపారీ ఇచ్చినట్లు సమాచారం ఉందంటూ ఈటల, ఆయన సతీమణి జమున ఇటీవల ఆరోపించిన నేపథ్యంలో స్పందించిన మంత్రి కేటీఆర్ ఆయనకు భద్రత పెంపు అంశాన్ని సమీక్షించాలని డీజీపీకి సూచించడం విషయం తెలిసిందే. ఈ మేరకు మేడ్చల్ డీసీపీ సందీప్‌రావు ఈటల నివాసానికి వెళ్లి భద్రతాపరమైన అంశాలను పరిశీలించారు. అనంతరం డీజీపీకి నివేదిక సమర్పించారు. దీనిపై సమీక్షించిన ఉన్నతాధికారులు ఈటలకు భద్రత పెంచినట్లు తెలిసింది.

భట్టి పాదయాత్ర అంశాలే మేనిఫెస్టో

ఆయన పాదయాత్ర తెలంగాణ సమాజాన్ని కదిలించింది

- తెలంగాణ ప్రజలు కేసీఆర్ పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారు
- ఖమ్మంలో రాహుల్ సభతో తెలంగాణ ముఖచిత్రం మారనుంది
- భట్టి పాదయాత్ర శిబిరంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- ఈసారి 80కిపైగా సీట్లు దక్కించుకుంటామని ధీమా



శిబిరంలో భట్టితో సమాలోచనలు చేస్తున్న రేవంత్‌రెడ్డి, మధుయాష్కీ

కూసుమంచి/ఖమ్మం సహకారనగర్: ఆదిలాబాద్ జిల్లా మొదలుకొని ఖమ్మం జిల్లా వరకు తెలంగాణ ప్రజలు పడుతున్న కష్టాలను పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క దగ్గరగా చూశారని.. ప్రజలు కూడా తమకు ఏమి కావాలో చెప్పినందున ఆ సమస్యలతోనే కాంగ్రెస్ మేనిఫెస్టో రూపొందనుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలంలో శుక్రవారం భట్టి పాదయాత్ర కొనసాగగా తల్లంపాడులో పాదయాత్ర శిబిరాన్ని పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్, మాజీ ఎంపీ మల్లు రవితో కలసి రేవంత్ సందర్శించారు. పలు అంశాలపై గంటకుపైగా చర్చించాక అక్కడే భోజనం చేశారు. ఆ తర్వాత ఖమ్మంలో ఆదివారం జరగనున్న సభ విజయవంతంపై రేవంత్ సమీక్షించారు. అలాగే సభావేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించాక రేవంత్ మీడియాతో మాట్లాడారు. భట్టి చేపట్టిన పాదయాత్ర యావత్ తెలంగాణ సమాజాన్ని కదిలించిందని చెప్పారు. భవిష్యత్తులో తాము ప్రజల జీవితాల్లో మార్పులు తెచ్చేందుకు, అవసరమైన ఆలోచనలు చేసి నిర్ణయాలు తీసుకొనేందుకు ఈ యాత్ర దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి పేరిట ప్రజల్లో తీసుకొచ్చిన భ్రమలన్నీ భట్టి పాదయాత్రతో పటాపంచలయ్యాయన్నారు. తెలంగాణ ప్రజలంతా కేసీఆర్ పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారని, ఆ రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రేవంత్ అన్నారు. ఖమ్మం సభలో రాహుల్ గాంధీ ఇచ్చే సందేశం తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనుందని, ఈ సభ ద్వారా ఎన్నికల సమరశంఖం పూరించనున్నామని తెలిపారు.

అంతకుమించి...

ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరికతో రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని రేవంత్ అన్నారు. తమ పార్టీలో చేరే వారిపై అందరితో చర్చించాకే నిర్ణయం తీసుకుంటామని.. అంతా సమన్వయంతో ముందుకెళ్లి అధికారమే లక్ష్యంగా కృషి చేయాలని నేతలకు సూచించారు. ఖమ్మం సభతో బీఆర్ఎస్ పాలనకు సమాధి కడతామని జోస్యం చెప్పారు. శ్రీనన్న మూడో కన్ను లాంటి వాడని, శివుడు మూడో కన్ను తెరిస్తే ఏమవుతుందో.. బీఆర్ఎస్ పరిస్థితి కూడా అంతే ఉంటుందన్నారు. తాజాగా బీజేపీ నేత జితేందర్‌రెడ్డి ట్వీట్ చూస్తే ఆ పార్టీ నాయకులు ఎంత అవమానాలు భరిస్తున్నారో తెలుస్తోందని... బాత్‌రూంకు వెళ్లి ఏడవాల్సిన పరిస్థితి వచ్చిందని రేవంత్ ఎద్దేవా చేశారు. కాగా, బీఆర్ఎస్ తొలి సభ కంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ జనగర్జన సభకు అధిక సంఖ్యలో జనం వస్తారని, అడ్డంకులు ఎదురైనా అధిగమిస్తారనే నమ్మకం ఉందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది సీట్లు గెలవడంతోపాటు రాష్ట్రంలో 80కిపైగా సీట్లు దక్కించుకుంటామని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సచివాలయానికి రాని కేసీఆర్‌ను ప్రజల బాట పట్టించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని చెప్పారు. ఇప్పుడు ఖమ్మంలో పొంగులేటి కాంగ్రెస్‌లో చేరుతున్నారనే కేసీఆర్ పోడు పట్టాలు ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ వీహెచ్, తెలంగాణ జనగర్జన సభ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బి.మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు ఎమ్మెల్యే సీతక్క పాల్గొన్నారు. సభ విజయవంతానికి నియోజకవర్గాల వారీగా కోఆర్డినేటర్లను రేవంత్ ప్రకటించారు.

అభ్యర్థుల వడపోత షురూ

- అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రారంభమైన కాంగ్రెస్ పార్టీ కసరత్తు
- నియోజకవర్గానికి ముగ్గురికి మించకుండా పేర్లు పంపిన టీపీసీసీ
- మూడుసార్లు వరుసగా ఓడిన నేతల స్థానంలో కొత్త పేర్లు తెరపైకి
- 70కిపైగా స్థానాల్లో మూడు పేర్లు!
- పీఈసీ పరిశీలన అనంతరం స్క్రీనింగ్ కమిటీకి ఫైనల్ లిస్ట్



సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు గుర్రాలెవరన్న దానిపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు ప్రారంభించింది. కర్ణాటక తరహాలోనే ముందస్తుగా అభ్యర్థులను ప్రకటించేందుకు అప్పుడే వడపోత కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. ఏఐసీసీ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీ తరఫున పోటీ చేయదగిన నాయకుల పేర్లను రాష్ట్ర నాయకత్వం ఢిల్లీకి పంపినట్లు తెలుస్తోంది. గతంలో ఎమ్మెల్యేలుగా పోటీ చేసిన వారు, ఆశావహులతో కూడిన జాబితా ఢిల్లీకి వెళ్లిందని సమాచారం. నియోజకవర్గానికి ముగ్గురు చొప్పున పేర్లను పంపాలన్న ఏఐసీసీ సూచన మేరకు కసరత్తు చేసిన టీపీసీసీ... ఆ జాబితాను అధిష్టానానికి పంపిందని, ఈ నెల 26న ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాహుల్, ఖర్గేలతో భేటీ కావడానికి ముందే ఈ జాబితా అక్కడకు వెళ్లిందనే చర్చ గాంధీ భవన్‌లో జరుగుతోంది. ఈ జాబితాను త్వరలో ఏర్పాటు కాబోయే ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) పరిశీలించిన అనంతరం కొన్ని మార్పుచేర్పులు చేసి స్క్రీనింగ్ కమిటీకి పంపుతుందని, ఈ జాబితా నుంచి అధిష్టానం పరిశీలన కోసం రెండు పేర్లు వెళతాయని టీపీసీసీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు.

ముగ్గురి వరకు..

ఏఐసీసీ సూచన మేరకు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఆశావహుల పేర్లను టీపీసీసీ ఢిల్లీకి పంపింది. ఇందులో 70కిపైగా స్థానాల్లో ముగ్గురి పేర్లు వెళ్లాయని, స్పష్టత ఉన్న స్థానాల్లో కేవలం ఒకే పేరు, మరికొన్ని చోట్ల రెండుపేర్లు వెళ్లాయని సమాచారం. దీంతోపాటు 2009, 2014, 2018లలో వరుసగా మూడుసార్లు ఓడిపోయిన నేతలున్న నియోజకవర్గాల్లో కొత్త పేర్లు వెళ్లాయని, అక్కడ కొత్త వారికి అవకాశం ఇచ్చేందుకు ఏఐసీసీ మొగ్గుచూపుతోందని అంటున్నారు. మొత్తంమీద ఎన్నికలకు మరో ఐదు నెలల సమయం ఉండగానే ఏఐసీసీ అభ్యర్థుల జాబితా కోరడం రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.

మమ్మల్నెందుకు పట్టించుకోరు..!

బీజేపీలో జోరందుకుంటున్న అసంతృప్త స్వరాలు

- మునుపెన్నడూ లేని విధంగా బహిరంగ విమర్శలు, వ్యాఖ్యలు
- వ్యంగ్య ధోరణిలో ప్రతీకాత్మక వీడియో పోస్ట్ చేసిన జితేందర్‌రెడ్డి
- తగిన ప్రాధాన్యత, గుర్తింపు దక్కలేదంటున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు... ఇదే తరహా భావనలో మరికొందరు నేతలు
- జాతీయ నాయకత్వం ఎలా స్పందిస్తుందోనన్న చర్చ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో అసంతృప్త స్వరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనంతగా, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తున్నారనేంత స్థాయి వరకు నేతలు గళం విప్పుతున్నారు. జాతీయ, రాష్ట్ర నాయకత్వాల తీరుపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్న ఉదంతాలు ఇటీవలి కాలంలో అధికమౌతున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, ఎమ్మెల్యేలతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యులు సైతం ఈ తరహా నేతల జాబితాలో ఉండటం గమనార్హం.

వారితో మాట్లాడి..మమ్మల్ని విస్మరించారు!

పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డిలు అసంతృప్తితో ఉన్నారనే వార్తల నేపథ్యంలో జాతీయ నాయకత్వం ఇటీవల వారిని ఢిల్లీ పిలిపించి బుజ్జగించింది. ఈ నేపథ్యంలో మరికొందరు ముఖ్యనేతలు.. తమ అసంతృప్తిని తెలుసుకునేందుకు నాయకత్వం ఎందుకు ప్రయత్నించడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో విజయం ద్వారా పార్టీకి పెద్ద ఊపు తెచ్చిన తనను ఎమ్మెల్యేగా, ముఖ్యనేతగా పరిగణించకుండా రాష్ట్ర నాయకత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడి తీరును, పార్టీలో తనకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం గురించి పలుమార్లు అమిత్‌షా, నడ్డాలకు తెలియజేసినా ఓపిక పట్టాలనే సూచన తప్ప సమస్య పరిష్కారానికి ఏ చర్యా తీసుకోలేదనే భావనలో ఆయన ఉన్నట్టు తెలుస్తోంది. ఇటీవల ఈటల, రాజ్‌గోపాల్‌రెడ్డిలను ఢిల్లీకి పిలిపించారని, తనను మాత్రం పట్టించుకోలేదనే భావనతో ఆయన ఉన్నట్టు సమాచారం. బీజేఎల్పీ నేత రాజాసింగ్ సస్పెన్షన్ తర్వాత తనకు శాసన సభాపక్షపక్ష నేతగా అవకాశం ఇవ్వకపోవడం, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని జాతీయ కార్యవర్గ సభ్యులుగా నియమించి తనను విస్మరించడం, పార్టీకి తాను చేసిన సేవలకు గుర్తింపుగా పార్టీ జాతీయ అధికార ప్రతినిధిగా నియమిస్తారని ఆశించినా అవి జరగకపోవడం రఘునందన్‌లో అసంతృప్తిని మరింత పెంచిందని అంటున్నారు. తన కార్యకర్తలు, అనుయాయులు వెలిబుచ్చుతున్న అసంతృప్తినే తాను బయటకు చెబుతున్నానని ఆయన పేర్కొనడం గమనార్హం. ఇక జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి రాష్ట్ర బీజేపీపై వ్యంగ్య ధోరణిలో ఓ ప్రతీకాత్మక వీడియోను ట్విటర్‌లో పోస్ట్ చేయడం పార్టీలో దుమారాన్నే రేపింది. దున్నపోతును వెనుకనుంచి తన్ని వ్యాన్‌లోకి ఎక్కించే వీడియో పోస్ట్ చేసి, రాష్ట్ర నాయకత్వానికి ఇలాంటి చికిత్స అవసరమంటూ వ్యాఖ్యానించడంపై పలువురు నేతలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



నేరుగా నడ్డా దృష్టికి..

బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇటీవల హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగానూ పలువురు నాయకులు రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, నాయకత్వం వ్యవహరిస్తున్న తీరు, తమకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించక పోవడంపై అసంతృప్తిని తెలియజేశారు. జాతీయ కార్యవర్గసభ్యులు డా.వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు వేర్వేరుగా నడ్డాను కలుసుకుని వివిధ అంశాలపై తమ అసంతృప్తికి గల కారణాలను తెలియజేశారు. రాష్ట్ర పార్టీలో ఏర్పడిన గందరగోళ పరిస్థితులతో నాయకులు సమైక్యంగా లేరనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్లడం, పార్టీలో సమష్టి నిర్ణయాలు కొరవడడంతో నష్టం జరుగుతోందని కొందరు ఫిర్యాదు చేశారు. పలు సందర్భాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలను సంప్రదించకుండానే ముఖ్య నేతల భేటీలో నిర్ణయమంటూ ప్రకటనలు వెలువడుతున్నాయని నడ్డా దృష్టికి తీసుకొచ్చారు. తాము జాతీయ కార్యవర్గ సభ్యులుగా, మాజీ ఎంపీలుగా, ఉద్యమకారులుగా ఉన్నా తగిన ప్రాధాన్యత, గుర్తింపునివ్వడం లేదని, నష్టం కలుగజేసేలా వ్యవహరిస్తున్న ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి వంటి వారికి ప్రాధాన్యతనిస్తున్నారంటూ కొందరు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. కాగా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ మొత్తం పరిణామాలపై జాతీయ నాయకత్వం ఏ విధంగా స్పందిస్తుంది? పరిస్థితిని చక్కదిద్దేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది పార్టీలో చర్చనీయాంశమైంది.

బండిని మార్చాల్సిందే!

అమిత్‌షా, సునీల్ బన్సల్, నడ్డా సూచన

సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు తథ్యమేనా? బండి సంజయ్ స్థానంలో మరొకరిని నియమించాలని బీజేపీ పెద్దలు భావిస్తున్నారా? ఈ దిశగా ఇప్పటికే చర్చ జరుగుతోందా? ఈ ప్రశ్నలకు బీజేపీ జాతీయ పార్టీ వర్గాల నుంచి ఔననే సమాధానం వస్తోంది. అసెంబ్లీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న బీజేపీ పెద్దలు పార్టీలో గందరగోళాన్ని సరిదిద్దేందుకు చర్యలు చేపట్టారని.. ఈ క్రమంలో సంజయ్ స్థానంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు అప్పగించాలని నిర్ణయించారని పార్టీలో చర్చ జోరుగా సాగుతోంది. కానీ దీనికి కిషన్‌రెడ్డి విముఖంగా ఉన్నారని.. దీనిపై ప్రధాని నిర్ణయమే ఫైనల్ అని, ఆయన స్పందన కోసం నేతలు ఎదురుచూస్తున్నారని విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. ఇక రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి మార్చాక సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవి ఇచ్చే చాన్సుందనే చర్చ జరుగుతోంది.

సమన్వయ లోపం నేపథ్యంలోనే..

బండి రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక పార్టీలో దూకుడు పెరిగిందని.. బీఆర్ఎస్‌తో ఢీ అంటే ఢీ అనే స్థాయికి రావడంలో సంజయ్ విజయం సాధించారని బీజేపీ వర్గాలు అంటున్నా యి. కానీ నేతల మధ్య సమన్వయం, పాత–కొత్త నేతలను కలుపుకొని వెళ్లడం, సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వడంలో సంజయ్ విఫలమయ్యారంటూ హైకమాండ్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఈ క్రమంలో పార్టీలో అందరినీ సమన్వయపరుస్తూ ముందుకెళ్లేందుకు, ఎన్నికల్లో కేసీఆర్ వ్యూహాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు.. నాయకత్వ మార్పు, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ నియామకం అవసరమనే భావన నేతల్లో వ్యక్తమవుతున్నట్టు తెలిసింది.

కీలక ఎన్నికల నేపథ్యంలో..

దక్షిణాదిలో బలపడేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్న బీజేపీ.. అందుకు తెలంగాణలో అవకాశం ఉందన్న ఆలోచనతో గతంలోనే ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే ఇటీవల కర్ణాటక ఎన్నికల్లో పార్టీకి ఎదురుదెబ్బ తగలడంతో అప్రమత్తమైంది. అక్కడి మాదిరిగానే ఇక్కడా జరగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కొందరు నేతలు చేసిన సూచనలతో నాయకత్వం ఆలోచనలో పడినట్టు సమాచారం. కీలకమైన అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో.. రాష్ట్ర అధ్యక్షుడి మార్పు, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ నియామకంతోపాటు ఇతర సంస్థాగత మార్పులు చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. పార్టీ అగ్రనేత అమిత్‌షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ తదితరులు కూడా తాము జరిపిన సమీక్షల్లో ఇదే అభిప్రాయాన్ని గుర్తించినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

మోదీ కోర్టులో బంతి!

తెలంగాణ ఎన్నికల్లో వివిధ సామాజికవర్గాల ఓట్లను రాబట్టేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని అమిత్‌షా, నడ్డా, సంతోష్, బన్సల్ నిర్ణయించినట్టు తెలిసింది. ఈ దిశలోనే.. రెడ్డి వర్గానికి చెందిన కిషన్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడిగా, సీఎం కేసీఆర్‌పై పోరులో ముందున్న, బీఆర్ఎస్ కిటుకులు తెలిసిన, ప్రజల్లోనూ గుర్తింపు ఉన్న బీసీ నేత ఈటల రాజేందర్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించాలని ప్రాథమికంగా ప్రతిపాదించినట్టు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనపై మోదీ వెంటనే స్పందించలేదని.. విదేశీ పర్యటన, తిరిగి రాగానే బిజీ షెడ్యూల్ వల్ల తుది నిర్ణయమేదీ తీసుకోలేదని తెలిసింది. జూలై 3న ఢిల్లీలో జరగనున్న కీలక సమావేశంలో.. కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణతోపాటు వివిధ రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షుల మార్పు, సంస్థాగత మార్పులపై నిర్ణయాలు వెలువడవచ్చని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కేంద్ర మంత్రిగా ఉండేందుకే మొగ్గు!

రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలను చేపట్టేందుకు కిషన్‌రెడ్డి విముఖంగా ఉన్నారని, కేంద్ర మంత్రిగా కొనసాగేందుకే మొగ్గుచూపుతున్నారని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. బండినే కొనసాగించాలని.. ముఖ్య నేతలమంతా ఆయనతో కలసి సాగుతామని కోరుతున్నారని అంటున్నాయి. రాష్ట్రంలో పార్టీ స్తబ్దతకు నేతల తీరు కారణం కాదని, ఇతర అంశాలు ప్రభావితం చేస్తున్నాయని ఆయన చెప్తున్నారని పేర్కొంటున్నాయి. కిషన్‌రెడ్డి వాదనతో మోదీ ఏకీభవించి బండినే కొనసాగిస్తారా లేక అందరినీ కలుపుకొని వెళ్లే మరో నేతను తెరపైకి తెస్తారా? అన్న దానిపైనా పార్టీలో చర్చ సాగుతోంది.

అవినీతిపై ఆరోపణలే.. చర్యలేవనే ప్రశ్నలతో..

కేసీఆర్ సర్కారు అవినీతి, ప్రాజెక్టుల్లో అక్రమాలు, ఎమ్మెల్సీ కవితకు ఢిల్లీ లిక్కర్ స్కాంలో ప్రమేయం ఇలా బీజేపీ తరచూ ఆరోపణలు గుప్పిస్తోంది. బీజేపీ అగ్రనేతలు కూడా బహిరంగ సభల్లో ఈ అంశాలను ప్రస్తావిస్తూ వస్తున్నారు. ఇన్ని ఆరోపణలు చేస్తున్న బీజేపీ.. కేంద్రంలో అధికారంలో ఉండీ ఎలాంటి చర్య తీసుకోవడం లేదేమని ప్రజల్లో సందేహాలు వస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు అంటున్నారు. దీనికితోడు కొన్నిరోజులుగా సీఎం కేసీఆర్, బీఆర్ఎస్‌పై జాతీయ నేతల విమర్శలు తగ్గిపోవడం, ఢిల్లీ లిక్కర్ స్కాంలో దర్యాప్తు సంస్థలు ఎలాంటి చర్యలు చేపట్టక పోవడంతో.. బీఆర్ఎస్–బీజేపీ కలసిపోయాయనే అభిప్రాయం మొదలైందని చెప్తున్నారు. దీనంతటినీ చక్కదిద్దేలా చర్యలు చేపట్టేందుకు, రాష్ట్ర పార్టీని మళ్లీ పట్టాలెక్కించేందుకు జాతీయ నాయకత్వం ఏం చేస్తుందన్నది చర్చనీయాంశంగా మారింది.

క్లుప్తంగా...

'గూడెం'లో రావణాసురుడి పాలన

• హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు



కొత్తగూడెం రూరల్: కొత్తగూడెం నియోజకవర్గంలో రావణాసురుడి పాలన నడుస్తోందని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుడు (డీహెచ్) గడల శ్రీనివాసరావు అన్నారు. శ్రీనివాసరావు తన పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం పాల్వంచలోని పెద్దమ్మగుడిలో పూజలు చేసి కొత్తగూడెం వరకు ఓపెన్‌టాప్ వాహనంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కలలుకన్న బంగారు తెలంగాణకు అనుగుణంగా కొత్తగూడెంను నిర్మించుకుందామని అన్నారు. స్థానిక నాయకత్వం అలసత్వం వల్ల ఆశించిన అభివృద్ధి జరగలేదని పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యేను ఉద్దేశించి విమర్శలు చేశారు. కొత్తగూడెంలో రావణాసురుడి పాలనకు అంతం పలికి, ఇంటింటా దీపావళి చేసుకునే రోజులు వస్తాయన్నారు. జీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న తనకు అడ్డుపడుతున్న శక్తులకు బుద్ధి చెప్పే సమయం వస్తోందని తెలిపారు. త్వరలోనే గడపగడపకూ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకునే కార్యక్రమం చేపడతానని గడల వెల్లడించారు.

జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలి

• బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



ఖమ్మం మామిళ్లగూడెం: జనాభా దామాషా ప్రకారమే అన్ని రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని జెడ్పీ అతిథిగృహంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాజకీయ పార్టీలు బీసీలను జెండాలు మోసేందుకే వాడుకుంటూ వారి ఆకాంక్షలను గుర్తించడం లేదని మండిపడ్డారు. రాష్ట్రంలో 60% ఉన్న బీసీలను రాజకీయ పార్టీలు విస్మరిస్తే అధికారంలోకి రాలేవన్నారు. ఈ మేరకు ఆదివారం ఖమ్మంలో జరిగే కాంగ్రెస్ సభలో బీసీల వాటా తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల కోసం బిల్లు ఆమోదానికి కృషి చేయాలని ఆయన కోరారు.

బీఆర్‌ఎస్‌కు మందుల సామేలు రాజీనామా



అర్వపల్లి(తుంగతుర్తి): మాదిగలకు తీరని అన్యాయం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీలో ఉండలేనని, తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు ప్రకటించారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా అర్వపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు పంపుతున్న తన రాజీనామా పత్రాన్ని చూపించారు. పార్టీలో మాదిగలను చిన్న చూపు చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర కేబినెట్‌లో ఒక్కరు కూడా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి లేరని అన్నారు. మాదిగలకు జరుగుతున్న అన్యాయాన్ని పలుమార్లు పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి పనిచేసిన తనకు టికెట్ ఇవ్వకుండా స్థానికేతరుడికి ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీ సమావేశంలో సీఎం కేసీఆర్ స్వయంగా ఈసారి తనకే టికెట్ ఇస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. కానీ, గురువారం తిరుమలగిరిలో జరిగిన ప్రగతి నివేదన సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న తనను ఆహ్వానించకపోగా.. ఐటీమంత్రి కేటీఆర్ ప్రస్తుత ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కు టికెట్ ప్రకటించి.. హ్యాట్రిక్ ఎమ్మెల్యే అనడం తనను అవమానించడమేనని అన్నారు. ఇక నుంచి బీఆర్‌ఎస్‌కు గ్రామ గ్రామానా మాదిగలు చావుడప్పు కొట్టనున్నట్లు చెప్పారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, రాష్ట్ర కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

12న పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ ముట్టడి

సాక్షి, హైదరాబాద్: రాయితీపై గొర్రెలు ఇస్తామంటూ గొల్ల కురుములతో డీడీలు కట్టించుకుని ఇవ్వకుండా మోసగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) ఆధ్వర్యంలో ఈనెల 12న రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్ ముట్టడి కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్ల సమావేశంలో నిర్ణయించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిల్లె గోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 9వ తేదీ నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభిస్తామని చెప్పి హడావుడి చేసి రాష్ట్ర వ్యాప్తంగా 1500 మందికి మాత్రమే పంపిణీ చేసి ప్రభుత్వం చేతులు దులిపేసుకుందని విమర్శించారు. అందరికీ గొర్రెలిస్తామని నమ్మించి 80 వేల మంది గొల్ల కురుములతో డీడీలు కట్టించుకుని వారిని అప్పులపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త ముఖాలు.. కోటి ఆశలు!

బీఆర్‌ఎస్ తరఫున అసెంబ్లీ బరిలో దిగేందుకు యత్నాలు

- అధినేత కేసీఆర్ ఆశీర్వాదం కోసం నేతల ఆరాటం
- అరంగేట్రానికి సన్నాహాలు చేసుకుంటున్న 30 మంది!
- కేటీఆర్, హరీశ్, కేసీఆర్ సన్నిహిత వర్గాల ద్వారా లాబీయింగ్
- సిట్టింగ్‌లను తప్పిస్తే తమకు అవకాశం ఇవ్వాలంటూ వినతులు
- సామాజికవర్గ సమీకరణాలు, ఆర్థిక స్థితిగతులు అనుకూలించవచ్చనే అంచనాలు



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో భారత్ రాష్ట్ర సమితి తరఫున బరిలో దిగాలని ఉవ్విళ్లూరుతున్న ఔత్సాహిక నేతలు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆశీస్సుల కోసం ఆరాటపడుతున్నారు. ముఖ్యంగా సిట్టింగ్ ఎమ్మెల్యేలు కొందరికి ఈసారి అవకాశం లభించకపోవచ్చనే వార్తల నేపథ్యంలో పార్టీలో కొత్త ముఖాలు అభ్యర్థిత్వంపై ఆశతో విస్తృతంగా లాబీయింగ్ చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సొంత కేడర్‌ను తయారు చేసుకోవడం వంటి ఏర్పాట్లు కొనసాగిస్తూనే కేసీఆర్ దృష్టిలో పడేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోశ్‌తో పాటు కేసీఆర్‌కు అత్యంత సన్నిహితంగా ఉండే నేతల ద్వారా టికెట్ వేట కొనసాగిస్తున్నారు. దాదాపుగా సిట్టింగ్ ఎమ్మెల్యేలందరితో పాటు సుమారు 40 మంది ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్లు, జిల్లా పరిషత్‌ల చైర్మన్ల వంటి కీలక పదవుల్లో ఉన్న నేతలు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. వీరు కాకుండా మరో 30 మంది అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున అరంగేట్రం చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలపై స్థానికంగా వ్యతిరేకత, రాష్ట్ర, జిల్లా స్థాయిలో సామాజికవర్గ సమీకరణాలు, ఆర్థిక స్థితిగతులు తదితరాలు.. టికెట్ వేటలో తమకు అనుకూలిస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొందరు ఆశావహులు అధినేత కేసీఆర్ దృష్టిలో పడేందుకు ఇటీవలి మహారాష్ట్ర పర్యటనకు తమ అనుచరులతో సహా తరలివెళ్లారు.

సిట్టింగులకు దక్కని స్థానాల్లో..

ప్రస్తుత శాసనసభలో మొత్తం 119 మంది సభ్యులకు గాను 103 మంది ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ పార్టీ టికెట్ దక్కుతుందని కేసీఆర్ పలు సందర్భాల్లో ప్రకటించినా.. పనితీరు సరిగా లేని వారిని పక్కన పెడతామనే సంకేతాలు కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో సుమారు 15 నుంచి 20 మంది సిట్టింగులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కదని బీఆర్‌ఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు ఈ నెలాఖరులో సుమారు 75 శాతం స్థానాల్లో అభ్యర్థుల పేర్లపై స్పష్టత వచ్చే అవకాశముందని అంటున్నారు. ఇప్పటికే పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలతో పాటు ఇతరులను కలుపుకొని సుమారు 20 మందికి టికెట్ ఖరారుపై కేసీఆర్, కేటీఆర్‌లు సంకేతాలు ఇచ్చారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్యేల మార్పిడికి అవకాశమున్న చోట తమకు అవకాశం ఇవ్వాలని కొత్తగా టికెట్ ఆశిస్తున్న నేతలు కోరుతున్నారు. కేసీఆర్, కేటీఆర్ గతంలోనే తమకు హామీ ఇచ్చారని కొందరు చెప్తుండగా, మరికొందరు తమ పనితీరు, గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకుని టికెట్ ఇవ్వాలని కేసీఆర్‌ను కోరుతున్నారు.

ఆశగా ఎదురుచూపులు

కొత్తగా బీఆర్‌ఎస్ టికెట్ ఆశిస్తున్న నేతల్లో ప్రధానంగా గడాల శ్రీనివాసరావు (కొత్తగూడెం), మన్నె గోవర్ధన్‌రెడ్డి (ఖైరతాబాద్), మోతె శోభన్‌రెడ్డి (సికింద్రాబాద్), రేణికుంట్ల ప్రవీణ్ (బెల్లంపల్లి), మిట్టపల్లి సురేందర్ (మానకొండూరు), మైనంపల్లి రోహిత్ (మెదక్), చల్లా నారాయణరెడ్డి (మంథని) మరికొందరు ఉన్నారు. మన్నెం రంజిత్ యాదవ్ (నాగార్జునసాగర్), కందుల సంధ్యారాణి (రామగుండం), బొద్దుల లక్ష్మీనర్సయ్య అలియాస్ లక్ష్మణ్ (పెద్దపల్లి), వలిదాస్ జగదీశ్వర్‌గౌడ్ (శేరిలింగంపల్లి), నీలం మధు ముదిరాజ్ (పటాన్‌చెరు), ఢిల్లీ వసంత్ (జహీరాబాద్) ఈ జాబితాలో ముందు వరుసలో ఉన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సంచాలకుడు గడాల శ్రీనివాసరావు ఇప్పటికే క్షేత్ర స్థాయిలో సన్నద్ధతను ప్రారంభించారు. గాయకుడు మిట్టపల్లి సురేందర్ మానకొండూరు నుంచి టికెట్ కోసం ఇప్పటికే కేసీఆర్‌ను కలిసినట్లు సమాచారం. నాగార్జునసాగర్ ఉప ఎన్నికలో టికెట్‌ను ఆశించిన మన్నెం రంజిత్ యాదవ్ తనకు అవకాశం దక్కుతుందనే ధీమాతో నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో సామాజికవర్గ సమీకరణాలు తమకు అనుకూలిస్తాయని కందుల సంధ్యారాణి (పెరిక), బొద్దుల లక్ష్మీనర్సయ్య (పద్మశాలి), నీలం మధు (ముదిరాజ్) భావిస్తున్నారు. ఇటీవల పటాన్‌చెరు పర్యటన సందర్భంగా ప్రగతిభవన్‌కు రావాల్సిందిగా మధుకు కేసీఆర్ సూచించినట్లు తెలిసింది. ఇప్పటికే బీఆర్‌ఎస్‌తో సన్నిహితంగా ఉంటున్న ఢిల్లీ వసంత్ పార్టీలో చేరికకు సంబంధించి షోలాపూర్ పర్యటన సందర్భంగా కేసీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

ఫేక్ సర్వేలను విశ్వసించొద్దు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్



జడ్చర్ల టౌన్: వచ్చే ఎన్నికల్లో తామే అధికారంలోకి వస్తామంటూ కొన్ని పార్టీలు ఫేక్ సర్వేలను వదులుతున్నాయని... వాటిని ప్రజలు విశ్వసించరాదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నుంచి అలంపూర్ వెళ్తూ మార్గమధ్యలో జడ్చర్లలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయా పార్టీల సర్వేలు వంట గదుల్లో, బాత్‌రూంలలో కూర్చొని రూపొందించినవంటూ ఎద్దేవా చేశారు. బీఎస్పీ పట్ల ప్రజలు సైలెంట్‌గా ఓటింగ్ వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్యాగాలు తమవి.. అధికారం భూస్వాములదా అని ప్రజలు గుర్తించారని, అందుకే బహుజన రాజ్యం కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. బహుజనులను బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలన్నీ కరివేపాకులా చూస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రిగా ప్రకటించినా వారితో కలిసేది లేదని స్పష్టం చేశారు. 2018లో భట్టిని సీఎల్పీగా ప్రకటించగానే ఎమ్మెల్యేలు ఆ పార్టీని వీడారని, చివరికి ప్రతిపక్ష పాత్ర లేకుండా పోయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

సాయిచంద్ మృతికి బీఆర్ఎస్సే కారణం

పాలమూరు బిడ్డ, గాయకుడు సాయిచంద్ మృతికి అధికార పార్టీనే కారణమని ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. సాయిచంద్ హైదరాబాద్‌లో ఉంటే బతికేవాడని మంత్రి కేటీఆర్ అనడం విడ్డూరంగా ఉందని, నాగర్‌కర్నూల్ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు ఉంటే బతికేవాడు కాదా? అని నిలదీశారు. తెలంగాణ వాళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే హైదరాబాద్‌లో కూర్చోవాలా.. కేటీఆర్ ఎంతో బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలనలో బహుజనులకు అవమానం జరుగుతోందని, మొన్న గూడ అంజయ్య, కంటోన్మెంట్ సాయన్న, నేడు సాయిచంద్‌లకు అధికార లాంఛనాలతో ఎందుకు అంత్యక్రియలు నిర్వహించలేదని ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కైకాల సత్యనారాయణ, హరికృష్ణ, కృష్ణ, దాసరి నారాయణరావు లాంటి వారందరికీ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించిన ప్రభుత్వం... దళితుల విషయాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

రెండోసారి పీడీ యాక్ట్ పెట్టరాదని చెప్పలేం: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఒకసారి పీడీ యాక్ట్ కేసు కొట్టివేసినంత మాత్రాన.. మరో కేసులో ఇదే చట్టం వర్తింపజేయకూడదని చెప్పలేమని హైకోర్టు వ్యాఖ్యానించింది. ముందస్తు నిర్బంధం నుంచి విడుదల అయ్యాక మరో నేరానికి పాల్పడిన నిందితుడిపై ప్రభుత్వం పీడీ యాక్ట్ ప్రయోగించడాన్ని సమర్థించింది. ఈ మేరకు దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. హైదరాబాద్‌కు చెందిన సల్మాన్‌పై పీడీ యాక్ట్ ప్రయోగించి అరెస్టు చేయడాన్ని అతని భార్య అమీనాబేగం హైకోర్టులో సవాల్ చేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధ ధర్మాసనం విచారణ జరిపి.. ఇటీవల తీర్పునిచ్చింది. 2021లో సల్మాన్‌పై పీడీ యాక్ట్‌ను ప్రయోగిస్తే ఇదే హైకోర్టు కొట్టేసిందని, ఇటీవల మళ్లీ పీడీ యాక్ట్ కింద మళ్లీ నిర్బంధంలోకి తీసుకోవడం చట్టవిరుద్ధమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. దీన్ని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ముజీబ్ కుమార్ వ్యతిరేకించారు. రెండేళ్లలో సల్మాన్‌పై 9 కేసులు నమోదయ్యాయని, 5 కేసులపై కమిషనర్ వినతి మేరకు పీడీ యాక్ట్ అమలుపై ప్రభుత్వం గత మేలో జీవో జారీ చేసిందని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్‌ను కొట్టివేసింది.

ధాన్యం నమోదులో దగా!

- మిల్లర్ల ట్రక్ షీట్ల మాయాజాలం
- బస్తాల నమోదు సమయంలో కొత్త తరహా కటింగ్
- కిలోలు దాటి.. క్వింటాళ్లు మింగేసిన వైనం
- ఖాతాల్లో నగదు పడ్డాక లబోదిబోమంటున్న అన్నదాతలు
- బిల్లు వచ్చేలోగా మొత్తం మూడు సార్లు దోపిడీకి గురవుతున్న రైతన్న



ఎండీ అలీ అనే రైతుకు జారీ చేసిన ట్రక్‌షీట్‌లో 383 బస్తాలకు బదులు 372 అని రాసిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్‌కు చెందిన శ్రీనివాస్ వేసంగిలో 104 బస్తాల ధాన్యం తూకం వేశాడు. మిల్లు వద్ద ట్రక్‌షీట్‌లో 104 బస్తాలుగానే నమోదు చేశారని భావించాడు. కింద 104 మైనస్ 4 అని రాసినట్టుగా గమనించలేదు. తీరా 100 బస్తాలకు మాత్రమే నగదు జమ కావడంతో అవాక్కయ్యాడు. ఇది ఒక్క కరీంనగర్‌లోనే కాదని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో మిల్లర్లు రైతుల కష్టాన్ని యథేచ్ఛగా దోచేశారని తెలుస్తోంది. మొన్నటిదాకా తాలు పేరిట కొనుగోలు కేంద్రాల్లో, నాణ్యత లేదని రైస్‌మిల్లుల్లో క్వింటాలుకు 9 నుంచి 11 కిలోల వరకు కోతపెట్టారు. వీటికి తోడు తాజాగా మరో కొత్త తరహా దోపిడీకి మిల్లర్లు తెరతీసినట్లు.. శ్రీనివాస్ తరహా ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి.

రూ.వందల కోట్ల విలువైన ధాన్యానికి ఎసరు

గతేడాది 50.23 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయింది. అయితే ఈసారి అకాల వర్షాలు ఇబ్బంది పెట్టినా దిగుబడి పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 7,037 కొనుగోలు కేంద్రాల్లో 11,39,597 మంది రైతుల నుంచి ఇప్పటివరకూ 66.49 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. ఈ మొత్తం ధాన్యం విలువ రూ.12,011 కోట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఇందులో దాదాపు రూ.1,500 కోట్లు మినహా మొత్తం ధాన్యం డబ్బులు ప్రభుత్వం చెప్పిన విధంగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. వాస్తవానికి ప్రతి క్వింటాలుకు సగటున 10 కిలోల చొప్పున లెక్కలు వేసుకుంటే.. వేలాది క్వింటాళ్ల వరకు ధాన్యం కోతకు గురైంది. సాధారణ తరుగుతోనే రూ.కోట్లు వెనకేసుకున్న మిల్లర్లు ట్రక్‌షీట్ల మాయాజాలం కుంభకోణంతో రూ.వందల కోట్ల విలువైన ధాన్యాన్ని పోగు చేసుకున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

మొత్తం 21 బస్తాలకు కోత..!

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం చిన్నబొంకురుకి చెందిన రైతులు 10 మంది స్థానిక పీఏసీఎస్‌లో ధాన్యం అమ్ముకున్నారు. ధాన్యం కాంట వేస్తున్నప్పుడే తరుగు పేరుతో 2 కిలోలు కోత విధించారు. 10 మంది రైతులకు చెందిన 625 బస్తాల ధాన్యం లారీలో లోడ్ చేసి మిల్లుకు తరలించారు. అయితే రైతులకు తెలియకుండానే మిల్లుల్లో సైతం మరోసారి కటింగ్ పెట్టారు. తర్వాత ట్రక్ షీట్ మాయాజాలంతో కేవలం 604 బస్తాలకే లెక్కగట్టారు. ఆ మేరకే డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో తమకు ధాన్యం డబ్బులు తక్కువపడ్డాయని రైతులు వాపోతున్నారు. ఎంతలేదన్నా వీరి వద్దనుంచి 9 క్వింటాళ్ల వరకు ధాన్యం దోపిడీకి గురైంది.

11 బస్తాలు కొట్టేశారు

వేసంగి ధాన్యాన్ని మహమ్మదాబాద్‌లోని కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించాం. నాతో పాటు మరో ఇద్దరు రైతుల బస్తాలు కలిపి మొత్తం 383 బ్యాగులు తూకం వేశారు. తొలుత కొనుగోలు కేంద్రంలోనే తరుగు పెట్టారు. మళ్లీ మిల్లు వద్దకు వెళ్లాక మొత్తం మీద 372 బస్తాలుగా ట్రక్‌షీటులో నమోదు చేశారు.

– ఎండీ ఆలీ, కంచన్‌పల్లి, మహబూబ్‌నగర్

తేమ, తాలు పేరుతో కట్ చేశారు..

యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యాన్ని ఇప్పగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ సెంటర్‌కు తీసుకెళ్లా. కాంటా పూర్తయిన తర్వాత, 439 బస్తాలు ఉన్నట్లు లెక్కవేసి రైస్ మిల్లుకు పంపించారు. ధాన్యం బస్తాలు మిల్లుకు వెళ్లిన తర్వాత తేమ, తాలు పేరిట కొన్ని బస్తాలు కట్ చేశారు. మొత్తం మీద 428 బస్తాలనే బిల్లులో చూపించారు.

–జి.వెంకటయ్య, ఇప్పగూడెం, స్టేషన్‌ఘన్‌పూర్

రైతుల ఇష్టం మేరకే తరుగు

ఎడతెరిపిలేని వర్షాల వల్ల ధాన్యం డామేజ్ వచ్చింది. దానివల్ల రైతుల ఇష్టం మేరకే మిల్లర్లు తరుగు తీశారు. ధాన్యం ఆరబెట్టడం, మళ్లీ వర్షం పడటం పక్షం రోజులు అదే పరిస్థితి. కానీ ఒకసారి తరుగు తీశాక మళ్లీ తీయడం ఉండదు.

– అన్నమనేని సుధాకర్‌రావు, రైస్ మిల్లర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి

మొత్తం డబ్బులు పడలేదు



మా ఊరిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మిన. అప్పుడు తరుగుతో 142 బస్తాలు లెక్క గట్టారు. తీరా ఇప్పుడు 138 బస్తాలకే డబ్బులు పడ్డాయి. సెంటర్ వాళ్లను అడిగితే.. మాకేమీ తెలియదు మిల్లు వాళ్లను అడగమంటున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు.

–ప్రశాంత్, కౌలు రైతు, చిన్న బొంకూర్, సుల్తానాబాద్

4.4 క్వింటాళ్ల కోత.. రూ.9,800 నష్టం



కొనుగోలు కేంద్రం నుంచి మొత్తం 303 బస్తాలు తూకం వేశారు. ఒకలారీలో 199 బస్తాలు పోగా.. ఆరు బ్యాగులు కట్ చేశారు. మరో దాంట్లో 104 బ్యాగులు పోయినయి.. ఐదు బ్యాగులు కట్ చేశారు. మొత్తంగా 4.4 క్వింటాళ్ల కోతతో మొత్తం రూ.9,800 నష్టం జరిగింది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు.

– విష్ణువర్ధన్, కరీంనగర్

ఐక్యంగానే ముందుకు..

- ఎన్నికల్లో వామపక్షాల ఉమ్మడి పోరాటం
- సీపీఎం, సీపీఐ నేతల వెల్లడి
- బీఆర్‌ఎస్‌కు మద్దతు కొనసాగుతుంది
- త్వరలో సీఎం కేసీఆర్‌తో చర్చిస్తాం



సమావేశానికి వస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, చాడ వెంకట్‌రెడ్డి తదితరులతో కరచాలనం చేస్తున్న తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: 'వామపక్ష పార్టీలైన సీపీఎం, సీపీఐలు విడివిడిగా పోటీ చేసి ఎంతో నష్టపోయాయి. ఇకపై వేరువేరుగా పోరాటం చేయకుండా ఐక్యంగా ముందుకు పోవాలని నిర్ణయించాం. అంతేకాకుండా బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నాం. దేశంలో బీజేపీ వ్యతిరేక లౌకిక శక్తులను ఏకం చేయడం ద్వారా కేంద్రంలో బీజేపీయేతర ప్రభుత్వ ఏర్పాటే మా లక్ష్యం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి మద్దతు కొనసాగిస్తూ మాకు బలం ఉన్న చోట్ల పోటీ చేయాలని నిర్ణయించుకున్నాం. అతి త్వరలో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో చర్చిస్తాం..' అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఎంబీ భవన్‌లో సీపీఎం, సీపీఐల ఉమ్మడి సమావేశం జరిగింది. వచ్చే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే అంశాలపై ఈ సమావేశంలో చర్చలు జరిపారు. అనంతరం తమ్మినేని, కూనంనేని మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్‌తో జట్టు కట్టం: తమ్మినేని

బీఆర్‌ఎస్‌తో కమ్యూనిస్టులు దూరంగా ఉన్నారని, కాంగ్రెస్ పార్టీతో జత కడతారనే తప్పుడు వార్తలను తమ్మినేని ఖండించారు. జాతీయ స్థాయిలో బీజేపీని ఎదుర్కొనే సత్తా బీఆర్‌ఎస్‌కు ఉందని, అందుకే మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. బీఆర్‌ఎస్ తనకు తానుగా చొరవ చేసి మునుగోడులో కలిసి పని చేద్దామని కోరిందని, రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ కమ్యూనిస్టులతో పొత్తు ఉంటుందని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారని చెప్పారు. అయితే మంత్రులు, ఎమ్మెల్యేలు సీట్ల అంశంపై మైండ్ గేమ్ ఆడుతున్నారని విమర్శించారు. సీట్ల కేటాయింపులపై సీఎం కేసీఆర్‌తో ఇప్పటివరకు తాము చర్చించలేదన్నారు. కమ్యూనిస్టులు ఎన్నికలకు సమాయత్తం అవ్వడం లేదని కొందరు అనుకుంటున్నారని, కానీ తమకు బలం ఉన్న చోట సన్నాహాలు చేసుకుంటున్నామని తెలిపారు.

ఓట్లు, సీట్ల కోసం దిగజారం: కూనంనేని

మునుగోడులో ఏర్పడిన విపత్తును వామపక్షాలు అడ్డుకున్నాయని కూనంనేని అన్నారు. మునుగోడులో బీజేపీ గెలిస్తే ప్రభుత్వాన్ని అస్థిర పరిచేదని, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీఎల్ సంతోష్ ప్రయత్నం చేశారని ఆరోపించారు. కమ్యూనిస్టులు లేని అసెంబ్లీ, పార్లమెంటులను ప్రజలు ఊహించుకోవడం లేదన్నారు. బీజేపీకి ప్రజల సమస్యలు పట్టవని, వ్యక్తిగత దూషణలకే పరిమితమవుతుందని విమర్శించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులతో కేసీఆర్ కలిసి పని చేయాలని కోరుకుంటున్నట్లు వివరించారు. గిరిజనేతరులకూ పోడు భూములు ఇవ్వాల్సిన అవసరం ఉందని, ఈ అంశం త్వరలో సీఎంకు వివరిస్తామన్నారు.

రాజకీయ నేతల పాత్రలో గవర్నర్లు

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం

సాక్షి, హైదరాబాద్: దేశంలో గవర్నర్లు రాజకీయ నేతల పాత్ర పోషిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. ఆయన శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ పాలనలో గవర్నర్ రాజకీయ వ్యవస్థగా మారిందని విమర్శించారు. తమిళనాడు మంత్రిని తొలగిస్తూ గవర్నర్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ గవర్నర్ యూనివర్సిటీ బిల్లును ఆపి విద్యార్థులకు నష్టం కలిగించడం సరైంది కాదని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో రాజకీయ లబ్ధి కోసం బీజేపీ ప్రయత్నిస్తోందని, అక్కడ ఓ వర్గాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో సీట్ల కేటాయింపుపై చర్చించేందుకు సీఎం కేసీఆర్ అపాయింట్‌మెంట్ అడిగామని, ఆయన రాగానే చర్చిస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్‌పై అసంతృప్తితో పొంగులేటి కాంగ్రెస్‌లో చేరుతున్నారని వ్యాఖ్యానించారు. రాజకీయ భవిష్యత్ కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని, రాజకీయాలు విలువల్లేనివిగా తయారయ్యాయన్నారు. ఫిరాయింపుదారులకు మొదటి ఎంపిక బీఆర్‌ఎస్ ఉంటుందని, ఆ పార్టీ కాదంటేనే ఇతర పార్టీలకు వెళ్తున్నారని చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్నికలకు ముందు అన్ని ప్రతిపక్ష పార్టీలు ఏకమవ్వడం కష్టమని, కానీ ముందస్తు సమావేశాలు జరగడం మంచిదన్నారు. ఎన్నికల ప్రయోజనం నెరవేరాలంటే రాష్ట్ర స్థాయిలో అవగాహన కుదుర్చుకుంటే మంచిదని వీరభద్రం పేర్కొన్నారు.

హైకోర్టుకు హాజరైన మంత్రి కొప్పుల

• 2018 ధర్మపురి ఎన్నికలపై క్రాస్ ఎగ్జామినేషన్

సాక్షి, హైదరాబాద్: ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల వీవీప్యాట్‌ల్లో తేడాలున్నాయంటూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో అడ్వొకేట్ కమిషనర్ ముందు మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరయ్యారు. కమిషనర్ జరిపిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో పాల్గొన్నారు. 2018 ఎన్నికల్లో ధర్మపురి నియోజకవర్గం నుంచి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్యేగా గెలుపొందడాన్ని సవాల్ చేస్తూ.. ఆయనపై కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన అడ్లూరి లక్ష్మణ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వీవీప్యాట్ స్లిప్స్‌లో తేడాలున్నాయని, రీకౌంటింగ్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. దీనిపై హైకోర్టులో విచారణ సాగుతోంది. ఈ నేపథ్యంలో సాక్ష్యాల వాంగ్మూలం నమోదుకు హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎన్‌వీవీ నాతారెడ్డిని కమిషనర్‌గా నియమించడం తెలిసిందే. కమిషనర్ ముందు హాజరైన కొప్పుల.. పలు వివరాలు వెల్లడించారు. పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది ధర్మేశ్ జైస్వాల్ వాదనలు వినిపించారు. మంత్రి తన అధికారాన్ని ఉపయోగించి తహసీల్దార్ నుంచి ఆర్టీఐ ద్వారా కొన్ని పత్రాలను సేకరించి, వాటిని డాక్యుమెంట్లుగా మార్క్ చేయిస్తున్నారని ఆరోపించారు. తహసీల్దార్‌కు అవి ఇచ్చే అధికారం కూడా లేదని వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. సాక్షులు, క్రాస్ ఎగ్జామినేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సోమవారం కోర్టుకు సమర్పించాలని కమిషనర్‌ను ఆదేశించారు.

బీరెల్లి కుట్ర కేసుపై ఎన్‌'ఐ'ఏ!

- నిందితులను 'ఉపా' కేసులో చేర్చిన పోలీసులు
- బీరెల్లి కుట్ర కేసు వివరాలు సేకరించిన ఎన్‌ఐఏ

సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'బీరెల్లి'కుట్ర కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) రంగంలోకి దిగింది. ములుగు జిల్లా తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 152/2022 ప్రకారం 2022, ఆగస్టు 19న 152 మందిపై కేసు నమోదైంది. తాడ్వాయి మండలం బీరెల్లి అడవుల్లో మావోయిస్టు నేతలతో పాటు కొందరు ఆ పార్టీ ప్రజాసంఘాల నాయకులు (ప్రాక్షన్ కమిటీ మెంబర్లు) సమావేశం అయ్యారనేది ఆ ఎఫ్‌ఐఆర్‌లోని సారాంశం. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (ఉపా)తోపాటు 10 సెక్షన్ల కింద ప్రొఫెసర్ హరగోపాల్ సహా 152 మందిపై నేరాభియోగం మోపారు. ఈ కేసు ఇటీవల వివాదాస్పదం కావడంతో డీజీపీ ఆదేశాల మేరకు విచారణ జరిపారు. ఎలాంటి ఆధారాలు లభించలేదంటూ ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు జస్టిస్ సురేష్ (లేట్), వి.రఘునాథ్, జర్నలిస్ట్ పద్మజా షా, గడ్డం లక్ష్మణ్, గుంటి రవీందర్‌లపై 'ఉపా'కేసులు ఎత్తివేశారు. ఈ మేరకు జూన్ 17న ప్రకటన చేసిన ములుగు ఎస్పీ గౌస్ ఆలం.. మిగతా వారిపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. తాజాగా ఈ కేసు పూర్వాపరాలపై ఎన్‌ఐఏ ఆరా తీస్తుండటం చర్చనీయాంశమైంది.

'ఉపా'కేసులో ఎన్‌ఐఏ ఆరా

2022 ఆగస్టు 19న తాడ్వాయి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కుట్ర కేసులో 152 మంది పేర్లుండగా.. అందులో చాలా మందిని గతంలో నిందితులుగా ఎన్‌ఐఏ పేర్కొంది. విశాఖపట్నం జిల్లాలో రాధ అనే నర్సింగ్ విద్యార్థినిని మావోయిస్టు అనుబంధ సంస్థ చైతన్య మహిళా సంఘం నాయకులు కిడ్నాప్ చేశారని ఆమె తల్లి పోచమ్మ 2017లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విశాఖపట్నం పోలీసులు కేసు నమోదు చేసినా.. 2021 మే 31వ తేదీన కేసు మళ్లీ తెరిచి దర్యాప్తు చేయాలని ఎన్‌ఐఏకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో 2022 సెప్టెంబర్ మొదటి వారంలో కేసును స్వీకరించిన ఎన్‌ఐఏ రంగారెడ్డి, మెదక్, సికింద్రాబాద్ జిల్లాల్లో సోదాలు నిర్వహించి హైకోర్టు న్యాయవాది, చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) సభ్యురాలు చుక్కా శిల్పను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో అరెస్టు చేశారు. డి.దేవేంద్ర, దుబాసి స్వప్నలను కూడా ఎన్‌ఐఏ అరెస్టు చేసింది. పర్వతపురంలోని చైతన్య మహిళా సంఘం నేత దేవేంద్ర, అంబేడ్కర్ పూలే యువజన సంఘం అధ్యక్షుడు కిరణ్ ఇంట్లో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. ఇదే క్రమంలో చైతన్య మహిళా సంఘంలో గతంలో క్రియాశీలకంగా పని చేశారన్న సమాచారంతో హనుమకొండకు చెందిన సముద్రాల అనిత, ఆమె తల్లి ఇంట్లో కూడా 2022 సెప్టెంబర్ 5న దాడులు చేయడం అప్పట్లో కలకలం రేపింది. వీరందరితోపాటు మరో నలభై మంది వరకు వివిధ కేసుల్లో ఎన్‌ఐఏ నిందితులుగా పేర్కొన్న వారి పేర్లు కూడా 'బీరెల్లి'కుట్ర కేసులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా ఆరా తీస్తుండడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

వివరాలు సేకరించిన ఏపీ ఇంటెలిజెన్స్

ములుగు జిల్లా తాడ్వాయి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైనా.. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు కూడా ఉన్నారు. 13 మంది మావోయిస్టు పార్టీల నేతలతోపాటు 20 సంఘాలకు చెందిన 146 మందిపై 10 సెక్షన్ల కింద నమోదైన కేసుల విచారణ జరుగుతోంది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలువురు ప్రజాసంఘాల ప్రతినిధుల పేర్లుండగా.. ఇదే కేసు విషయమై ఏపీ ఇంటెలిజెన్స్ అధికారులు రెండు రోజుల క్రితం ములుగు పోలీసు ఉన్నతాధికారులను సంప్రదించినట్లు తెలిసింది. తాడ్వాయి, పస్రా ఎస్‌హెచ్‌వోలు, స్పెషల్‌బ్రాంచ్ అధికారులతోనూ మాట్లాడి కేసుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.

సాక్షి హైదరాబాద్

శనివారం । 1 । జూలై । 2023



బిర్యానీ ఆర్డర్లు అదిరే..

నగరవాసులు నిత్యం వేల సంఖ్యలో బిర్యానీలు హాంఫట్ మనిపిస్తున్నారు. స్విగ్గీ నిర్వహించిన ఓ అధ్యయనం ఒక్క ఏడాదిలో..కోటిన్నర బిర్యానీలు నగరవాసులు ఆరగించారని తేలింది. -10లో



బీఎండబ్ల్యూ కార్ల దొంగ అరెస్ట్

బీఎండబ్ల్యూ లగ్జరీ కార్లను చోరీ చేసిన యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి రూ.1.70 కోట్ల విలువైన రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు. -10లో

బస్సు ఢీకొని ఇద్దరు విద్యార్థుల దుర్మరణం



బోడుప్పల్ సమీపంలోని ప్రతాపసింగారం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని డిగ్రీ చదువుతున్న విద్యార్థులు సాయికుమార్, అనితలు దుర్మరణం పాలయ్యారు. వీరు బైకుపై ప్రయాణిస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. -10లో

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి బంగారు బోనం



బంజారాహిల్స్/చార్మినార్: సప్తమాతృకల సప్తబంగారు బోనం పూజా కార్యక్రమాల్లో భాగంగా భాగ్యనగర శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలె భాస్కర్‌రాజ్ ఆధ్వర్యంలో మూడో బంగారు బోనాన్ని శుక్రవారం శ్రీ జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లికి సమర్పించారు. జోగిని నిషా క్రాంతి బంగారు బోనంతో ఆలయంలో అమ్మవారికి బోనం సమర్పించారు. నగరంలోని ఏడు అమ్మవారి దేవాలయాలకు ఏడు బంగారు బోనాలతో పాటు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నిర్వాహకులు ఇప్పటికే మొదటిబోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మతల్లికి సమర్పించారు. మూడో బంగారు బోనాన్ని గౌలిపుర కోట మైసమ్మ దేవాలయం నుంచి బాజా భజంత్రీలు, పెద్ద ఎత్తున భక్తుల సమక్షంలో బయల్దేరి పెద్దమ్మతల్లికి సమర్పించిమొక్కులు చెల్లించుకున్నారు. భారీగా భక్తులు కార్యక్రమంలో పాల్గొని పెద్దమ్మతల్లిని దర్శించుకున్నారు. బంగారు బోనాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు.

8 నుంచి హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్



బంజారాహిల్స్: రాబోయే వెడ్డింగ్ సీజన్‌ను పురస్కరించుకొని ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు హెచ్ఐసీసీ నోవాటెల్‌లో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన సన్నాహక ప్రదర్శన శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నెం10లో నిర్వహించారు. సినీ తారలు నిఖితా బిష్ట్, సిరియాతో పాటు పలువురు మోడల్స్ ప్రదర్శనలో ఉంచబోయే డిజైనరీ దుస్తులు, ఆభరణాలు ధరించి సందడి చేశారు. దేశ నలుమూలల నుంచి ప్రఖ్యాత డిజైనర్లు ఇక్కడ బ్రైడల్ వేర్, డిజైనర్ వేర్, వెడ్డింగ్ వేర్, ఫ్యాషన్ వేర్‌తో ఆకట్టుకుంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

17,18 తేదీల్లో నాట్‌కాన్-2023 సదస్సు



సనత్‌నగర్: హైదరాబాద్ వేదికగా జాతీయ స్థాయి సివిల్ ఇంజనీర్స్ సదస్సు జరగనుంది. నేషనల్ కన్వెన్షన్ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ (నాట్‌కాన్)-2023 పేరిట జులై 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు హైటెక్ సిటీలోని హెచ్ఐసీసీ హోటల్‌లో జరిగే ఈ సదస్సుకు 600 మంది నిపుణులతో పాటు జాతీయ, అంతర్జాతీయంగా 14 మంది వక్తలు హాజరుకానున్నారు. ఈ సదస్సు సన్నాహక కార్యక్రమం శుక్రవారం బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో జరిగింది. అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా (ఏసీసీఈఐ)సౌత్ ఇండియా అధ్యక్షుడు రాజ్‌కుమార్, రంగారావు, హైదరాబాద్ సెంటర్ చైర్మన్ కాశీరామ్, సెక్రటరీ భీంరావు, కోశాధికారి రమేష్, కార్యవర్గ సభ్యురాలు సీహెచ్.నర్మదలు సదస్సు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏసీసీఈఐ ప్రతినిధులు సదస్సు బ్రోచర్‌ను విడుదల చేశారు.

పుస్తకానందం



సర్కారు బడుల్లో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులను ఆకర్షించే దిశలో విద్యాశాఖ ఈ విద్యాసంవత్సరం తొలిసారిగా రాత పుస్తకాలను(నోట్‌బుక్స్) కూడా అందజేసింది. గతేదాది కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే పంపిణీ చేయగా...ఈసారి తల్లిదండ్రులపై భారం తగ్గించాలనే ఉద్దేశంతో నోట్‌బుక్స్ కూడా పంపిణీ చేయడం విశేషం. ఇందులో భాగంగా శుక్రవారం ఫిలింనగర్‌లోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేయగా...వాటిని తీసుకుని ఆనందంతో విద్యార్థులు కేరింతలు కొట్టారు. పాఠ్యపుస్తకాలే కాకుండా నోట్‌బుక్స్ కూడా ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. మన బస్తీ- మన బడి పథకంలో భాగంగా విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని 17 ప్రభుత్వ ఉన్నత, 47 ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు రాత పుస్తకాలను పంపిణీ చేశారు. దీంతో ఈ జోన్ పరిధిలో సుమారు 20 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు తెలిపారు.

– బంజారాహిల్స్





ఎయిర్‌పోర్టు మెట్రోకు క్రేజ్!



పోటీలో అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు

- జూలై 5న ముగియనున్న బిడ్డింగ్ గడువు
- రాయదుర్గం-ఎయిర్‌పోర్టు మధ్య 11 రైళ్లు
- ఒక్కో రైలుకు 3 కోచ్‌ల చొప్పున 33 కోచ్‌లతో సర్వీసులు
- రెండేళ్లలో పట్టాలెక్కేవిధంగా నిర్మాణం

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎయిర్‌పోర్టు మెట్రో ఎక్స్‌ప్రెస్ నిర్మాణానికి అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు పోటీపడుతున్నాయి. బిడ్డింగ్ గడువు సమీపిస్తుండడంతో పలు నిర్మాణ సంస్థల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ సంస్థ టెండర్లను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. సుమారు రూ.6 వేల కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును దక్కించుకొనేందుకు అనేక సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని, మరో ఐదు రోజులే మిగిలి ఉన్నందువల్ల మరిన్ని సంస్థలు బిడ్‌లను దాఖలు చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాగోల్-రాయదుర్గం, ఎల్‌బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్ కారిడార్‌లలో మెట్రో అందుబాటులోకి వచ్చిన తరువాత హైదరాబాద్ ముఖచిత్రం మారింది. వ్యాపార, వాణిజ్య రంగాలు, రియల్ ఎస్టేట్ పరుగులు పెట్టాయి. దీంతో నగరంలో మెట్రో రైలును నిర్మాణ సంస్థలు లాభదాయకమైన ప్రాజెక్టుగా భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే ఐటీ, రియల్ రంగాల్లో గణనీయమైన అభివృద్ధిని సాధించిన రాయదుర్గం- శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయ కారిడార్‌ను దక్కించుకొనేందుకు గ్లోబల్‌స్థాయిలో పోటీ పెరిగింది. నిర్మాణ సంస్థలు ఈ కారిడార్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించడమే ఇందుకు కారణమని ఒక అధికారి అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఎల్‌అండ్‌టీ, ఆల్‌స్టామ్, సీమెన్స్, టాటా ప్రాజెక్ట్స్, ఐఆర్‌సీఓఎన్, ఆర్‌వీఎన్‌ఎల్, బీఈఎంఎల్, పీఎన్‌సీఆర్‌ఓఎల్ రహీ టెక్నాలజీస్ తదితర జాతీయ, అంతర్జాతీయ స్థాయికి చెందిన కంపెనీలు పోటీలో ఉండగా, గడువు ముగిసేనాటికి మరిన్ని సంస్థలు పోటీలో నిలిచే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు.

రెండేళ్లలో పూర్తి...

మరోవైపు ఈ మార్గాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ 2026 నాటికి పూర్తి చేసేవిధంగా హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ కార్యాచరణ చేపట్టింది. తాము విధించిన నిబంధనలు, షరతులకు అనుగుణంగానే నిర్మాణ సంస్థలు తమ బిడ్‌లను దాఖలు చేయాలని గతంలోనే అధికారులు స్పష్టం చేశారు. రాయదుర్గం నుంచి ఎయిర్‌పోర్టు వరకు సుమారు 31 కిలోమీటర్ల దూరంలో అందుబాటులోకి రానున్న ఎయిర్‌పోర్ట్ మెట్రో ఎక్స్‌ప్రెస్ కోసం ఇప్పటి వరకు సర్వే, పెగ్‌మార్కింగ్, అలైన్‌మెంట్ తదితర పనులు పూర్తయ్యాయి. ఈ మార్గంలో 29.3 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ కాగా, 1.7 కిలోమీటర్ల వరకు భూగర్భమార్గంలో ట్రాక్ నిర్మాణం చేపట్టవలసి ఉంటుంది. ఎయిర్‌పోర్టు టర్మినల్ సమీపంలో ఒక భూగర్భ మెట్రో స్టేషన్‌తో పాటు మొత్తం 9 మెట్రో స్టేషన్‌లు రానున్నాయి. ఈ ప్రాజెక్టు వ్యయంలో హెచ్ఎండీఏ, జీఎమ్మార్ ఎయిర్‌పోర్టు 10 శాతం చొప్పున భరిస్తుండగా, మిగతా మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

మొదట 11 రైళ్లతో ప్రారంభం..

రాయదుర్గం -ఎయిర్‌పోర్టు మార్గంలో మొదట 11 రైళ్లను ప్రవేశపెట్టనున్నారు. ప్రతి మెట్రోకు 3 కోచ్‌లు ఉంటాయి. మొత్తం 33 కోచ్‌లతో సర్వీసులను అందుబాటులోకి తెస్తారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్‌కు అనుగుణంగా కోచ్‌ల సంఖ్యను పెంచనున్నట్లు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌మెట్రో 6 కోచ్‌లు, చెన్నై ఎయిర్‌పోర్ట్ మెట్రో 4 కోచ్‌లతో నడుస్తోంది. మొదట్లో రద్దీ సమయంలో ప్రతి 8 నిమిషాలకు ఒకటి, రద్దీ లేని సమయాల్లో ప్రతి 10 నిమిషాలకు ఒక ట్రెన్ చొప్పున నడుపుతారు. ఆ తరువాత రద్దీ వేళల్లో ప్రతి 3 నిమిషాలకు ఒకటి, రద్దీ లేని సమయాల్లో ప్రతి 5 నిమిషాలకు ఒకటి చొప్పున నడిపే విధంగా ప్రణాళికలను రూపొందించినట్లు తెలిసింది. నగరం పడమటి వైపు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా కేవలం ఎయిర్‌పోర్టు ప్రయాణికులే కాకుండా అన్ని వర్గాల ప్రయాణికులు కూడా ఎయిర్‌పోర్ట్ మెట్రో సేవలను వినియోగించుకొనే అవకాశం ఉంది. దీంతో రైళ్లు, సర్వీసుల సంఖ్య భారీగా పెరగవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రాథమికంగా 9 స్టేషన్‌లను ఖరారు చేసినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణ క్రమంలో మరిన్ని స్టేషన్‌లకు కూడా డిమాండ్ నెలకొనే అవకాశం ఉంది.

దేశం దాటేద్దామని..



పోలీసుల అదుపులోని సుమేరా తదితరులు

మత్స్యకారుల ముసుగులో వెళ్లేందుకు ప్లాన్!

- సుమేరా నేతృత్వంలో ఐఎస్‌కేపీ ఉగ్రవాదుల కుట్ర
- ఆఫ్ఘనిస్తాన్ మీదుగా ఖురాసన్ ప్రావిన్స్ చేరాలనే...
- అక్కడ అవసరమైతే ఆత్మాహుతి దాడులకూ సిద్ధం
- ఆ చర్యలకు తానూ సిద్ధమంటూ ఖదీజ సందేశం

సాక్షి, సిటీబ్యూరో: గుజరాత్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు అక్కడి పోరుబందర్‌తో పాటు హైదరాబాద్‌లో పట్టుకున్న సుమేరా భాను, మహ్మద్ ఖదీజ భారీ స్కెచ్‌లే వేసినట్లు వెలుగులోకి వచ్చింది. సుమేరాను పోలీసు కస్టడీకి తీసుకుని, ఖదీజను అహ్మదాబాద్ తరలించిన ఏటీఎస్ అక్కడి ఛారోడీలో ఉన్న తమ హెడ్-క్వార్టర్స్‌లో వివిధ కోణాల్లో ప్రశ్నిస్తోంది. వీరితో పాటు శ్రీనగర్, గోరఖ్‌పూర్ ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువకులూ ఇస్లామిక్ స్టేట్ ఇన్ ఖురాసన్ ప్రావెన్స్ (ఐఎస్‌కేపీ) కుట్రలో భాగంగా ఉన్నారని దర్యాప్తు అధికారులు తేల్చారు. ఈ నెట్‌వర్క్‌కు సంబంధించి సుమేరాతో పాటు నలుగురు యువకులను ఈ నెల 9న సుమేరాతో పాటు పోరుబందరులో అరెస్టు చేసిన విషయం విదితమే. విదేశాల్లో ఉన్న ఐఎస్‌కేపీ హ్యాండ్లర్ అబు హంజ ఆదేశాల మేరకు పనిచేస్తున్న ఈ మాడ్యుల్‌కు సుమేరా నేతృత్వం వహిస్తోంది. టెలిగ్రామ్ సహా వివిధ సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో ఏర్పాటు చేసుకున్న గ్రూపులతో పాటు వ్యక్తిగత ఖాతాల ద్వారానూ వీళ్లు సంప్రదింపులు జరిపారు. ఖదీజ కూడా సుమేరాతో దాదాపు ఏడాది కాలంగా సంప్రదింపులు జరుపుతోంది. ఈ మాడ్యుల్ మొత్తం సుమేరా నేతృత్వంలో ఆఫ్ఘనిస్తాన్-పాకిస్థాన్-ఇరాన్‌ల్లో విస్తరించి ఉన్న ఖురాసన్ ప్రావెన్స్‌కు వెళ్లాలని భావించారు. అక్కడ ఇస్లామిక్ రాజ్య స్థాపన కోసం పోరాడాలని కుట్ర పన్నారు. దీనికోసమే శ్రీనగర్‌కు చెందిన నలుగురు యువకులూ పోర్‌బందరు చేరుకుని ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. ఆ సందర్భంలోనూ సోషల్ మీడియా ద్వారా జరిగిన చర్చల్లో ఖదీజ ఆన్‌లైన్‌లో పాల్గొన్నట్లు ఏటీఎస్ ప్రాథమిక ఆధారాలు సేకరించింది. ఈమె అమన్ అనే మారుపేరుతో ఈ నెట్‌వర్క్‌లో చెలామణి అయినట్లు తేల్చారు. ఐఎస్‌కేపీ నెట్‌వర్క్‌లో ఉన్న వీరంతా తొలుత పోరుబందరు చేరుకోవాలని భావించారు. అక్కడ కొన్ని రోజుల పాటు మత్స్యకారులుగా పని చేయాలని, ఆపై అదును చూసుకుని ఓ బోటును తస్కరించడం ద్వారా అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించాలని పథకం వేశారు. ఇలా ఇరాన్ మీదుగా ఆఫ్ఘనిస్తాన్ చేరుకుని ఖురాసన్ ప్రావిన్స్ వెళ్లాలని కుట్ర పన్నారు. అక్కడ ఇస్లామిక్ రాజ్యం కోసం పోరాటం చేయడంతో పాటు అవసరమైతే ఆత్మాహుతిదాడులు చేయాలని సుమేరా, ఖదీజ సోషల్‌మీడియా ఖాతాల ద్వారా చర్చించుకున్నట్లు ఏటీఎస్ గుర్తించింది. అయితే సుమేరా అరెస్టు విషయం తెలుసుకున్న ఖదీజ తన సెల్‌ఫోన్‌లోని సమాచారాన్ని డిలీట్ చేసిందని, దాన్ని రిట్రీవ్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని అధికారులు వెల్లడించారు. పోరుబందరులో తాత్కాలిక షెల్టర్ ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడానికే ఈ నెల 9న సూరత్ నుంచి సుమేరా, శ్రీనగర్ నుంచి నలుగురు యువకులు అక్కడకు వచ్చారు. వీరితో ఖదీజతో పాటు గోరఖ్‌పూర్‌కు చెందిన ఓ యువకుడూ టచ్‌లో ఉన్నాడు. తాజాగా గోరఖ్‌పూర్‌కు చెందిన తారిఖ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రస్తుతం ఖదీజతో పాటు ఆమె తండ్రి మహ్మద్ జావీద్‌ను ఏటీఎస్ బృందం వివిధ కోణాల్లో ప్రశ్నిస్తోంది.

మహిళల సేఫ్టీ కోసం.. మరో 12 మొబైల్ షీ టాయిలెట్స్ !

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మహిళల భద్రత, రక్షణ కోసం ఇప్పటికే ఉన్న 12 మొబైల్ షీ టాయిలెట్లకు తోడు అదనంగా మరో 12 మొబైల్ షీ టాయిలెట్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. సేఫ్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా జీహెచ్ఎంసీ, పోలీసు విభాగం వీటిని అందుబాటులోకి తేనున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా కేంద్రం నుంచి అందే నిధులతో మహిళల రక్షణ, భద్రతలకు సంబంధించి వివిధ ఏర్పాట్లు చేస్తారని అధికారులు పేర్కొన్నారు. అందులో భాగంగా నగరంలోని మహిళలకు పరిశుభ్రమైన, ఆధునిక మొబైల్ టాయిలెట్లను ఎంపిక చేసిన ప్రాంతాల్లో అందుబాటులో ఉంచనున్నారు. నగరంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ప్రయాణాలు చేసేవారి సదుపాయార్థం ఆయా ప్రాంతాల్లో ఉంచనున్నారు. మెట్రోనగరాల్లో మహిళల రక్షణ కోసం కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. వీటి కొనుగోలుకు జీహెచ్ఎంసీ టెండర్లు పిలిచింది. పోలీసు విభాగం నిధులు చెల్లిస్తుంది. ఒక్కో మొబైల్ షీ టాయిలెట్ అంచనా వ్యయం దాదాపు రూ. 45 లక్షలు. వీటిని కొనుగోలు చేశాక ఏయే ప్రాంతాల్లో ఉంచాలో పోలీసు అధికారుల సూచనల మేరకు ఉంచుతారు. వీటిని సరఫరా చేసే సంస్థలే మూడేళ్ల వరకు నిర్వహణ కూడా చేయాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లకుగాను ఒక్కో జోన్‌లో రెండేసి చొప్పున అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఒక్కో మొబైల్ వాహనాన్ని ఒకేసారి నలుగురు వినియోగించుకోవచ్చు. వాహనంలో చంటిపిల్లలకు పాలిచ్చే గది ప్రత్యేకంగా ఉంటుంది. వాహనాలకు జీపీఎస్‌తో పాటు ముందు, వెనుక, పక్క భాగాల్లో సీసీటీవీలు కూడా ఉంటాయని అధికారులు చెప్పారు.

మినిస్టర్ క్వార్టర్స్ కరెంటు బకాయిలు రూ.70 లక్షలు

బంజారాహిల్స్: సామాన్య వినియోగదారులు వంద రూపాయలు బిల్లు చెల్లించకపోతే విద్యుత్ లైన్‌మెన్లు వెంటనే రంగప్రవేశం చేసి ఆ ఇంటి కరెంటు కనెక్షన్‌ను కట్ చేస్తారు. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే శాసనాలు రూపొందించి చట్టాలను అమలుపరిచే అమాత్యులే కరెంటు బిల్లులు చెల్లించకపోతే ఎలా ఉంటుందో ఊహకందని విషయం. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో గత ఆగస్టు నుంచి ఈ ఏడాది జూలై వరకు కరెంటు బిల్లులు చెల్లించడం లేదు. రూ.70 లక్షలు బకాయిలు మినిస్టర్ క్వార్టర్స్ బిల్లుల రూపంలో పేరుకుపోయాయి. ఇక్కడ 16 క్వార్టర్లు, ఒక క్లబ్ హౌజ్ ఉంది. ప్రతినెలా రూ.5 నుంచి రూ.6 లక్షల వరకు కరెంటు బిల్లు వస్తుంది. గతేదాది ఆగస్టు 21వ తేదీ నుంచి ఇప్పటి వరకు బిల్లులు చెల్లించకపోవడంతో భారీగా బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. సంబంధిత అధికారులు ఆర్‌అండ్‌బి ఎస్ఈ, డీఈ, ఏఈలతో నిత్యం బిల్లులు క్లియర్ చేయాలంటూ సంప్రదింపులు చేపడుతూనే ఉన్నారు. గత ఆరు నెలలుగా విపరీతమైన ఒత్తిడి కూడా తీసుకొస్తున్నారు. ట్రెజరీలో టోకెన్ నెంబర్ కూడా వచ్చిందని ఫైనాన్స్ సెక్రటరీ వద్ద ఈ బిల్లులు నిలిచిపోయాయని ఆర్‌అండ్‌బి అధికారులు సర్దిచెబుతున్నారు. భారీగా కరెంటు బిల్లులు మినిస్టర్ క్వార్టర్స్‌లో పేరుకేపోవడంతో విద్యుత్ శాఖలో కలెక్షన్ సమస్య తీవ్రరూపం దాల్చింది. దీని ప్రభావం సంబంధిత సబ్ స్టేషన్లపై చూపుతున్నది. ఇంత పెద్ద మొత్తంలో కరెంటు బిల్లులు గతంలో ఎప్పుడూ పెండింగ్‌లో లేవని ఆర్‌అండ్‌బి ఇంజనీర్లతో పాటు విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని మినిస్టర్ క్వార్టర్స్

ఎట్టకేలకు 'పరిహారం' రికవరీ!

- తప్పుడు పత్రాలతో కాజేసిన వ్యక్తిపై ఎండోమెంట్ శాఖ ఫిర్యాదు



ఆలయ నష్టపరిహారం చెక్కును తిరిగి స్వాధీనం చేసుకున్న ఆర్డీఓ వెంకటేశ్వర్లు

సైదాబాద్: రహదారి విస్తరణలో భాగంగా సైదాబాద్ హనుమాన్ దేవాలయ స్థలానికి మంజూరైన నష్ట పరిహారాన్ని తప్పుడు పత్రాలతో పొందిన వ్యక్తి నుంచి అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. మూడు రోజుల క్రితం హనుమాన్ దేవాలయ ప్రహరీని జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేయడంతో ఆలయ స్థల నష్ట పరిహారాన్ని ప్రైవేట్ వ్యక్తి కాజేశాడనే విషయం వెలుగుచూసింది. దీంతో విచారణ చేపట్టిన అధికారులు నష్ట పరిహారాన్ని పొందిన రఘునాథ్ ప్రసాద్ మిశ్రాను కార్యాలయానికి పిలిపించారు. అతని నుంచి రూ.71 లక్షల వ్యక్తి గత చెక్కును ఆర్‌డీఓ వెంకటేశ్వర్లు స్వాధీనం చేసుకున్నారని సైదాబాద్ మండల తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. నష్టపరిహారం సొమ్మును దేవాదాయ అధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

పోలీసులకు ఫిర్యాదు

స్థలం యజమానిని నేనే అంటూ సైదాబాద్ హనుమాన్ ఆలయానికి రావాల్సిన నష్టపరిహారాన్ని తప్పుడు ధ్రువపత్రాలతో కాజేసిన వ్యక్తిపై దేవాదాయ శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం సైదాబాద్ హనుమాన్ దేవాలయ ఈఓ జయంతి సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయం దేవాలయ శాఖ ఆధీనంలో ఉంది. అయితే ఆలయ వివాదంలో పార్టీగా ఉన్న పూజారి కుటుంబానికి చెందిన రఘునాథ్ ప్రసాద్ మిశ్రా అనే వ్యక్తి స్థలానికి నేనే యజమానిని అని, అందుకు కాంప్రమైజ్ డీడ్ కూడా చేసుకున్నామని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించాడు. రహదారి విస్తరణ చేపడుతున్న ల్యాండ్ అక్వయిరింగ్ విభాగానికి ఆ పత్రాలు సమర్పించి ఆలయ స్థలానికి నష్టపరిహారంగా మంజూరైన రూ. 71 లక్షలను తనే కాజేశాడు. మూడు రోజుల క్రితం ఆలయ ప్రహరీ కూల్చివేతతో విషయం వెలుగులోకి వచ్చింది. దాంతో దేవాదాయ శాఖ అధికారులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఔటర్‌పై నేటి నుంచి నార్సింగి ఇంటర్‌చేంజ్



సిద్ధమైన నార్సింగి ఇంటర్‌చేంజ్

రూ.29.50 కోట్లతో నిర్మాణం..

- ఔటర్‌పై ఇది 20వ ఇంటర్‌చేంజ్
- నేడు ప్రారంభించనున్న మంత్రి కేటీఆర్

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుపై మరో ఇంటర్ చేంజ్ అందుబాటులోకి రానుంది. నార్సింగి వద్ద సుమారు రూ.29.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఇంటర్ చేంజ్‌ను శనివారం మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఈ ఇంటర్ చేంజ్ వల్ల నార్సింగి, మంచిరేవుల, గండిపేట్ ప్రాంతాలతో పాటు లంగర్ హౌస్, శంకర్‌పల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రజలకు ఎంతో ప్రయోజనం లభించనుంది. ఔటర్‌పైన రాకపోకలు సాగించే వాహనదారులు నార్సింగి వద్ద ఎక్కేందుకు, దిగేందుకు అనుకూలంగా ర్యాంపులు, రోడ్లను నిర్మించారు. ఈ ఇంటర్‌చేంజ్ వల్ల ప్రయాణికులకు ఎంతో ఊరట లభించనుంది. ప్రస్తుతం శంషాబాద్ వైపు నుంచి వచ్చే వాహనదారులు నార్సింగి వైపు వెళ్లేందుకు అవకాశం లేదు, అక్కడి నుంచి నానక్‌రాంగూడ టోల్‌ప్లాజా వరకు వెళ్లి వెనక్కి తిరిగి రావలసి వస్తుంది. దీంతో కనీస 5 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయవలసి ఉంటుంది. శనివారం నుంచి అందుబాటులోకి రానున్న ఈ ఇంటర్‌చేంజ్ వల్ల ఆ ఇబ్బంది తొలగనుంది. అలాగే మెహదీపట్నం నుంచి కోకాపేట్ వైపు వెళ్లే వాహనదారులకు కూడా దీనివల్ల ప్రయాణం సులువవుతుంది. ప్రస్తుతం 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్‌రోడ్డు మార్గంలో 19 చోట్ల ఇంటర్ చేంజ్‌లు ఉన్నాయి. నార్సింగితో ఈ సంఖ్య 20కి చేరింది. వీటితో మల్లంపేట్, కోకాపేట్‌ల వద్ద కూడా హెచ్ఎండీఏ ఇంటర్‌చేంజ్‌ల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుతం ఆ రెండు చోట్ల పనులు కొనసాగుతున్నాయి. ఇవి కూడా పూర్తయితే ఔటర్‌పైన ఇంటర్‌చేంజ్‌ల సంఖ్య 22కు చేరనుంది. భవిష్యత్‌లో వచ్చే డిమాండ్ మేరకు ఔటర్‌మార్గంలో అవసరమైన చోట్ల ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ అర్వింద్‌కుమార్ తెలిపారు.

నేడు కోకాపేట ఎస్టీపీ ప్రారంభం

జలమండలి నూతనంగా నిర్మించిన కోకాపేట మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు శనివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటిని జలమండలి ఎండీ దానకిశోర్ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. కోకాపేట ఎస్టీపీని ప్యాకేజీ-2 లో భాగంగా.. 15 ఎంఎల్డీల సామర్థ్యం, ఆధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్బీఆర్) టెక్నాలజీతో నిర్మించారు. ఈ టెక్నాలజీ ఉపయోగించడం వల్ల తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నీటిని మురుగు శుద్ధి చేయవచ్చు.

బిర్యానీ ఆర్డర్లు అదిరే...

నగరవాసులు వేలూ లక్షల బిర్యానీలు హాంఫట్ మనిపిస్తున్నారు. ఏ యేటికా యేడు బిర్యానీ పై తమ ఇష్టాన్ని పెంచుకుంటూనే ఉన్నారు. ఆదివారం ప్రపంచ బిర్యానీ దినోత్సవం సందర్భంగా, ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ నిర్వహించిన ఓ అధ్యయనం ఒక్క ఏడాదిలో.. కోటిన్నర బిర్యానీలు నగరం ఆరగించేసిందని తేల్చింది. – సాక్షి, సిటీబ్యూరో



- ఏడాదిలో నగరంలో కోటిన్నర బిర్యానీల ఆర్డర్..
- అత్యధికంగా కూకట్‌పల్లి నుంచే..
- రేపు ప్రపంచ బిర్యానీ డే...

గత ఆరు నెలల్లో హైదరాబాదీలు 72 లక్షలకు పైగా బిర్యానీ ఆర్డర్‌లను గత 12 నెలల్లో 150 లక్షల బిర్యానీ ఆర్డర్‌లను అందుకున్నారు. బిర్యానీపై తరగని మోజుకు, నగరానికి బిర్యానీకి మధ్య ఉన్న అనుబంధానికి అద్దం పడుతుంది.

ధమ్ బిర్యానీ చాంపియన్...

గత ఐదున్నర నెలల్లో, 2022 ఇదే కాలంతో పోలిస్తే నగరంలో బిర్యానీ ఆర్డర్‌లలో 8.39% వృద్ధి నమోదైంది. దమ్ బిర్యానీ 9 లక్షలకు పైగా ఆర్డర్‌లతో తిరుగులేని చాంపియన్‌గా నిలిచింది. 7.9 లక్షల ఆర్డర్‌లతో సువాసనగల ఫ్లేవర్డ్ బిర్యానీ తన సత్తా చాటగా, బ్యాచిలర్స్, సింగిల్స్‌కి అలవాటైన మినీ బిర్యానీ 5.2 లక్షల ఆర్డర్‌లను అందుకుంది. బిర్యానీ ప్రియత్వం ఓ రేంజ్‌లో ఉండటంతో నగరంలో దాదాపు 15,000 పైగా రెస్టారెంట్‌లు తమ మెనూలో బిర్యానీని తప్పనిసరి డిష్‌గా అందజేస్తున్నాయి. బిర్యానీలు అందించే రెస్టారెంట్స్ అత్యధికంగా ఉన్న ప్రాంతాల్లో కూకట్‌పల్లి, మాదాపూర్, అమీర్‌పేట్, బంజారాహిల్స్, కొత్తపేట్ – దిల్‌సుఖ్‌నగర్ ఉన్నాయి,

కూకట్‌పల్లి టాప్...

హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో ఆర్డర్ పరిమాణం పరంగా అత్యధిక బిర్యానీ వినియోగం జరిగింది. వీటిలో. కూకట్‌పల్లి నెంబర్ వన్ కిరీటం అందుకుంటోంది. ఆ తర్వాతి స్థానాల్లో వరుసగా మాదాపూర్, బంజారాహిల్స్, గచ్చిబౌలి కొండాపూర్ ఉన్నాయి.

బిర్యానీ ఓ అనుభవం...



నగరంలో బిర్యానీ ప్రియులతో మా ప్రయాణం చాలా సుదీర్ఘమైనది. నగరవాసులకు బిర్యానీ అనేది కేవలం ఒక తినే వంటకం మాత్రమే కాదు అంతకు మించిన ఒక సంతోషకరమైన అనుభవం. ఈ ప్రపంచ బిర్యానీ దినోత్సవ వేడుకల్ని పురస్కరించుకుని రూ.199 నుంచే ప్రారంభం అవుతున్న మా బిర్యానీ వెరైటీలను నగరవాసులకు ఆస్వాదించవచ్చు.

– కుశాగ్ర గుప్తా, వైస్‌ప్రెసిడెంట్, ప్యారడైజ్ ఫుడ్ కోర్ట్

అమ్మాయి లవ్ ప్రపోజ్ చేసిందని..

- సహ విద్యార్థిపై నలుగురు విద్యార్థుల దాడి
- బాధితుడి ఫిర్యాదు
- కేసు నమోదు, నలుగురూ మైనర్‌లే

హిమాయత్‌నగర్: ఇంటర్ చదువుతున్న ఓ బాలిక తన తోటి విద్యార్థిని ప్రేమించింది. ఆ విషయాన్ని గత ఏడాది బాలుడికి చెప్పడంతో అతను ఆమె ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు. ఈ విషయం సదరు బాలిక స్నేహితుడికి తెలియడంతో ఆగ్రహానికి లోనైన అతను మరో ముగ్గురితో కలిసి కాలేజీ గేటు ఎదుటే బాలుడిని చితకబాదారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన నలుగురు విద్యార్థులపై కేసు నమోదు చేసినట్లు అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపారు.

◆ వివరాలిలా ఉన్నాయి. నారాయణగూడలోని ఓ ప్రముఖ కాలేజీలో వీరందరూ ఇంటర్మీడియేట్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. బాలిక, బాధితుడు ఎంపీసీ గ్రూపు కాగా, దాడి చేసిన నలుగురు విద్యార్థులు ఎంఈసీ గ్రూప్‌నకు చెందిన వారు. రెండు రోజుల క్రితం బాధితుడికి బాలిక స్నేహితుడు ఫోన్ చేసి మాట్లాకుందాం కాలేజీ గేటు వద్దకు రమ్మన్నాడు. అప్పటికే తన స్నేహితులు ముగ్గురితో అక్కడ కాపు కాసిన అతను బాధితుడిపై ఒక్కసారిగా దాడి చేశారు. 'నా ఫ్రెండ్ నీకు ప్రపోజ్ చేయడం ఏంటిరా' అంటూ, చితకబాదడమేగాక రాళ్లతో కొట్టారు. తీవ్రంగా గాయపడిన అతను కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశాడు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన యాజమాన్యం, పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించింది. బాలుడి ఫిర్యాదు మేరకు నారాయణగూడ పోలీసులు నలుగురు విద్యార్థులపై కేసు నమోదు చేశారు.

బీఎండబ్ల్యూ కార్ల చోరీకి పాల్పడుతున్న యువకుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి

- రెండు బీఎండబ్ల్యూ కార్లు స్వాధీనం
- నకిలీ నెంబర్ ప్లేట్లతో లగ్జరీ కార్లలో షికార్లు



స్వాధీనం చేసుకున్న బీఎండబ్ల్యూ కార్లు

గచ్చిబౌలి: పబ్‌లు, మ్యూజికల్ ఈవెంట్‌కు వచ్చిన వారిని నమ్మించి బీఎండబ్ల్యూ లగ్జరీ కార్ల చోరీ చేసిన యువకుడిని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ శిల్పవల్లి కేసు వివరాలు వెల్లడించారు. కొండాపూర్‌కు చెందిన మనోజ్ఞ గత నెల 24న గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్‌లో బాద్షా మ్యూజికల్ ఈవెంట్‌కు బీఎండబ్ల్యూ జడ్4 కారులో వచ్చింది. ఆమె వద్దకు వచ్చిన కొత్తగూడకు చెందిన బైరెడ్డి అరుణ్ రెడ్డి తాను వాలెట్ డ్రైవర్‌ను అని చెప్పి యాప్‌లో వివరాలు నమోదు చేసుకుని మనోజ్ఞ నుంచి కారు తీసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. ఈవెంట్ ముగిసిన తర్వాత కారు కనిపించకపోవడంతో ఆమె గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. గచ్చిబౌలి క్రైం, మాదాపూర్ సీసీఎస్ పోలీసులు విచారణ చేపట్టారు. సీసీ ఫుటేజీల ఆధారంగా సదరు కారు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని షెరటాన్ హోటల్‌లో బీ2 పార్కింగ్‌లో పార్క్ చేసినట్లు గుర్తించారు. నిందితుడిని టీఎన్‌జీఓస్ కాలనీలో ఉంటున్న అరుణ్ రెడ్డిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతను ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని జీరో–40 పబ్‌లో 2022 మేలో బీఎండబ్ల్యూ ఎక్స్5 కారును దొంగిలించినట్లు పోలీసు విచారణలో అంగీకరించాడు. కారు ఓనర్‌నని నమ్మించి కారుతో ఉడాయించాడు. ఇంటర్ ఫెయిల్ అయిన అరుణ్ కుమార్ వెబ్ డెవలపర్‌గా పని చేస్తున్నాడు. లగ్జరీ కార్లపై మోజుతోనే ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మొదట చోరీ చేసిన కారును అమ్మేందుకు ప్రయత్నించగా డాక్యుమెంట్లు లేకపోవడంతో ఎవరు కొనలేదని పోలీసులు పేర్కొన్నారు. దీంతో అదే కారులో దర్జాగా తిరుగుతున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి రూ.1.70 కోట్ల విలువైన రెండు బీఎండబ్ల్యూ కార్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మేకప్ కోసం వెళ్తే డైమండ్ రింగ్ కొట్టేశారు

ఫిలింనగర్: ఫేషియల్‌తో పాటు మేకప్ చేయించుకునేందుకు వెళ్లిన మహిళ ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... వనస్థలిపురం ఎఫ్‌సీఐ కాలనీ ఫేజ్–2లో నివసించే దాసరి పార్వతి శుక్రవారం ఫిలింనగర్ రోడ్ నెం 9లోని జూస్ సెలూన్‌కు ఫేషియల్, ఇతర మేకప్ చేయించుకునేందుకు వెళ్లింది. మేకప్ చేసే సమయంలో సెలూన్ వర్కర్లు ఆమె మెడలో ఉన్న డైమండ్ నెక్లెస్‌తో పాటు వేళ్లకు ఉన్న రెండు డైమండ్ ఉంగరాలను తీయాల్సిందిగా సూచించారు. ఆమె ఆభరణాలను తీసి తన హ్యాండ్ బ్యాగ్‌లో వేసి తన సీటు పక్కన ఉంచింది. మేకప్ అయిపోయిన తర్వాత బ్యాగులో చూడగా డైమండ్ రింగ్ కనిపించలేదు. దీంతో సెలూన్ నిర్వాహకులు, వర్కర్లను ప్రశ్నించగా సరైన సమాధానం రాలేదు. నిర్వాహకుల్లో కనీస స్పందన కూడా కరువైందని ఆరోపిస్తూ బాధితురాలి సోదరుడు శశాంక్ బాబు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎంఐ చెల్లించలేదని..

- ఫైనాన్స్ రికవరీ ఏజెంట్ల దాడి
- వాహనదారుడికి తీవ్ర గాయాలు

బంజారాహిల్స్: బైక్ ఈఎంఐ చెల్లించలేదని ఫైనాన్స్ రికవరీ ఏజెంట్లు దాడి చేయడంతో వాహనదారుడు తీవ్రంగా గాయపడిన ఐసీయూలో చికిత్స పొందుతున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. బంజారాహిల్స్‌రోడ్ నెం. 2లోని ఇందిరానగర్‌కు చెందిన నరేష్ గత జనవరిలో సోమాజిగూడలోని ఎల్‌అండ్‌టీ కంపెనీలో హోండా యాక్టీవా 6 జీ బండి ఫైనాన్స్‌లో తీసుకున్నాడు. గత నెల వాయిదా చెల్లించడంలో జాప్యం జరిగింది. జూన్ 28న అతడి సోదరుడు శ్రీనివాస్ బైక్‌పై వెళ్తుండగా బంజారాహిల్స్‌లో ఏడుగురు రికవరీ ఏజెంట్లు బైక్‌ను అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న నరేష్ అక్కడికి చేరుకుని వారితో వాగ్వాదానికి దిగాడు. దీంతో వారు అతడిని అసభ్యంగా దూషించడమేగాక రాయితో శ్రీనివాస్ తలపై కొట్టడంతో చెవి తెగిపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం యశోదా ఆస్పత్రికి తరలించగా, చెవి పూర్తిగా దెబ్బతిన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం అతను ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. నిందితులపై చర్యలు తీసుకోవాలని బాధితుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రికవరీ ఏజెంట్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక..


యువతి ఆత్మహత్య




సౌజన్య (ఫైల్)

దుండిగల్: ఒంటరి తనం భరించలేకపోతున్నా.. ఎవరూ నాతో మాట్లాడడం లేదు.. నాకు బతుకు మీద ఆశ లేదు.. జీవితం మీద విరక్తి వస్తుంది.. నా గురించి ఎవరూ పట్టించుకోవడం లేదంటూ'' ఓ యువతి సూసైడ్ నోట్ రాసి చెరువులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీకి చెందిన చంద్రయ్య కుమార్తె సౌజన్య(23) డిగ్రీ ఫెయిలై ఇంటి వద్దనే ఉంటోంది. ఎప్పుడు ఒంటరిగా ముభావంగా ఉండేది. ఈ నెల 28న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లిన సౌజన్య తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం బహదూర్‌పల్లిలోని బొబ్బాఖాన్ చెరువులో సౌజన్య మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని ఇద్దరు విద్యార్థుల దుర్మరణం



భూమా సాయి కుమార్(ఫైల్)



అనిత(ఫైల్)

మేడిపల్లి: ఆర్టీసీ బస్సు ఢీ కొని ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన శుక్రవారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోడుప్పల్‌లోని జాహ్నవి డిగ్రీ కాలేజీ కి చెందిన విద్యార్థులు భూమ సాయి కుమార్ (22) అనిత (20) స్నేహితులతో కలిసి శుక్రవారం సంఘీటెంపుల్‌కు వెళ్లారు. బైక్‌పై బోడుప్పల్‌కు తిరిగి వస్తుండగా ప్రతాప్ సింగారం పరిధిలోని డబల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో ఆర్‌టీసీ బస్సు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడిన వారు అక్కడికి అక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

'క్విక్ ఐడెంటిఫికేషన్ వాటర్ సొల్యూషన్ సోర్స్'తో...

పైప్‌లైన్లలో సమస్యలకు చెక్

మంచినీటి పైప్‌లైన్లలో తరచూ రాళ్లు, ఇతర వ్యర్థాలు ఇరుక్కుపోతూ సమస్యలు సృష్టిస్తుంటుంది. ఎక్కడ ఈ సమస్య ఉందో తెలియకపోవడంతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి పైపులను గుర్తించేవారు. దీని వల్ల సమయంతో పాటు డబ్బు కూడా వృథా అయ్యేది. అనవసర తవ్వకాలతో గోతులు సమస్యాత్మకంగా మారాయి. దీనికి చెక్ పెట్టేందుకు జలమండలి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నది.

- నల్లాల్లో ఇరుక్కుపోతున్న వ్యర్థాలు
- ఆయా ప్రాంతాల్లో తప్పని తాగునీటి కష్టాలు
- సిబ్బందికీ తప్పని తలనొప్పులు
- అన్ని సమస్యలకు ఒకే పరిష్కారం



యంత్రంతో పైపులను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

బంజారాహిల్స్: జలమండలి డివిజన్–6 పరిధిలో తాజాగా క్విక్ ఐడెంటిఫికేషన్ వాటర్ సొల్యూషన్ సోర్స్ యంత్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు.

- డివిజన్–6 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, తట్టికాన, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ఎల్లారెడ్డిగూడ, సోమాజిగూడ, ఎస్పీఆర్ హిల్స్ తదితర వాటర్ సెక్షన్ల పరిధిలో మంచినీటి పైప్‌లైన్లను పరిశీలించేందుకు ఈ యంత్రాన్ని వినియోగిస్తున్నారు.
- ఇటీవలే అందుబాటులోకి వచ్చిన ఈ యంత్రం ద్వారా ఎలాంటి తవ్వకాలు లేకుండా ఎక్కడా సమస్య ఉందో గుర్తించేందుకు వినియోగిస్తున్నారు. ఇందులో ఉండే కెమెరా ద్వారా పైపుల్లో ఎక్కడ సమస్య ఉందో వెంటనే తెలుసుకొని ఆ ప్రాంతంలో మాత్రమే మరమ్మతులు చేపడుతున్నారు.
- 400 ఫీట్ల వరకు ఈ కెమెరా సమస్యలను గుర్తిస్తుంది. మొత్తం రోడ్డు కటింగ్ చేయకుండానే సమస్య ఉన్న ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి ఈ సమస్యను పరిష్కరిస్తున్నారు.
- పైపులకు ఎక్కడైనా రంధ్రం పడ్డా, పైపుల కండీషన్ బాగా లేకున్నా, ఈ మిషన్ గుర్తిస్తుంది. దీని ద్వారా కలుషిత మంచినీటి సమస్య పరిష్కారమవుతుందని అధికారులు పేర్కొన్నారు.
- ఈ మిషన్‌ను అవసరమున్న సెక్షన్లకు పంపిస్తున్నారు. కొత్తగా రోడ్లు వేసే క్రమంలో కూడా ఈ యంత్రాన్ని వినియోగిస్తూ సమస్యలను అక్కడికక్కడే గుర్తించే ప్రక్రియ చేపడుతున్నారు.

క్లుప్తంగా...

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి

వెంగళరావునగర్: డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ సూచించారు. ఈస్ట్ రహమత్‌నగర్‌లోని న్యూలక్ష్మీ టాలెంట్ హైస్కూల్ సమీపంలో తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇటీవల ఆ పనుల్లో జాప్యం జరుగుతున్నట్లు పలువురు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కార్పొరేటర్ శుక్రవారం ఆయా ప్రాంతాలను సందర్శించారు. వానాకాలం ప్రారంభమైనందున పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ శ్యాంరావు ముదిరాజ్, నేతలు కృష్ణ, గోపాల్, పవన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ మరణం తీరనిలోటు



నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖైరతాబాద్: ప్రజా గాయకుడు సాయిచంద్ మరణం తీరనిలోటు అని జాతీయ మాలల ఐక్యవేదిక నేతలు పేర్కొన్నారు. చింతల్‌బస్తీలోని కార్యాలయంలో శుక్రవారం సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాతీయ మాలల ఐక్యవేదిక ప్రమోషన్ వింగ్ అధ్యక్షురాలు అంజలి, నాయకురాళ్లు కె.శోభరాణి, ప్రసన్న, కవితారాణి, లక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రముఖ కళాకారుడిగా, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా సాయిచంద్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరుతున్నామని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: న్యాయ స్థానం స్టే విధించినా అక్రమంగా జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి చెందిన జూబ్లీహిల్స్ రోడ్ నెం–1లో నర్సరీని అనుకుని క్లినిక్‌కు కేటాయించిన స్థలంలో వేసిన అక్రమ నిర్మాణాలను తొలగించినట్లు సొసైటీ వర్గాలు వెల్లడించాయి. పోలీసుల బందోబస్తు నడుమ శుక్రవారం ఈ నిర్మాణాలను తొలగించారు. వివరాలివీ... కొంతకాలంగా నర్సరీ స్థలం విషయంలో వివాదం నడుస్తోంది. అయితే పి.సత్యనారాయణ రాజు అనే వ్యక్తితో పాటు మరికొంత మంది ఈ స్థలంలో శుక్రవారం తెల్లవారుజామున రేకుల షెడ్లు వేయడంతో అక్కడకు చేరుకున్న సొసైటీ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దంటూ కోర్టులో స్టే ఉందని, దాన్ని ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేయడంతో పాటు కూల్చివేతలు చేపట్టారు. ఈ మేరకు అక్రమ నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డీఎల్ లేని వాహనదారులకు జరిమానా

బంజారాహిల్స్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డ ఏడు మంది వాహనదారులను పోలీసులు శుక్రవారం నాంపల్లిలోని పదవ ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వీరందరికీ రూ. 8 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

సబ్జెక్టు మినహాయింపు కల్పించాలంటూ వినతి



మంత్రి సబితా ఇంద్రారెడ్డితో మాట్లాడుతున్న విద్యార్థులు

వెంకటేశ్వరకాలనీ: జేఎన్‌టీయూ హైదరాబాద్ ఆర్18 విద్యార్థులకు గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా 8 క్రెడిట్స్ సబ్జెక్ట్ మినహాయింపు సదుపాయాన్ని కల్పించాలని విద్యార్థులు జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి నేతృత్వంలో శుక్రవారం విద్యాశాఖా మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ... గత 25 సంవత్సరాలుగా ఈ 8 క్రెడిట్స్ విధానాన్ని అమలు చేసి ప్రస్తుతం తీసేయడంతో వేలాది మంది విద్యార్థులు నష్టపోతారని ఏఐసీటీఈ అకడమిక్ రూల్ ప్రకారం ఒక విద్యార్థి ఇంజనీరింగ్‌లో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పొందడానికి 150 నుంచి 160 క్రెడిట్‌ల శ్రేణిని పొందాలని స్పష్టంగా ఉందని తెలిపారు. జేఎన్‌టీయూహెచ్ గతంలో ఉన్న ఆర్ 07 నుంచి ఆర్ 16 వరకు అందరికీ మినహాయింపు ఇచ్చి ఇప్పుడు ఆర్18 విద్యార్థులకు మినహాయింపును ఇవ్వట్లేదని తెలిపారు. ఆర్18 విభాగంలో ఉన్న విద్యార్థులు ఒకే సంవత్సరంలో మూడు సెమిస్టర్లు రాయాల్సి వచ్చిందని పరీక్షలను టైమ్‌టేబుల్‌కు అనుగుణంగా ఉంచడానికి హడావుడిగా నిర్వహించారని తెలిపారు. తమ ఆర్18 విభాగంల చాలా మంది విద్యార్థులకు సగానికి పైగా ఆన్‌లైన్ మోడ్ ద్వారానే జరిగిందని దీంతో చాలా మంది విద్యార్థులు కనెక్టివిటీ సమస్యలు ఎదుర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు శ్రావణ్, అరవింద్, ధనుష్, గోపిచంద్, తదితరులు పాల్గొన్నారు.


నాణ్యత లేని స్టెంట్ వేసిన వైద్యుడిపై ఫిర్యాదు

బంజారాహిల్స్: నాణ్యత లేని స్టెంట్ వేయడం ద్వారా తన కూతురు ఆరోగ్యం మరింత క్షీణించిందని ఇందుకు కారకుడైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ... షేక్‌పేటకు చెందిన నిషితా అసావ(23) ఊపిరితిత్తుల సమస్యతో బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేరారు. బ్రాన్‌కోస్కోపికల్ స్టెంట్ వేయాల్సి ఉంటుందని డాక్టర్ జయచంద్ర చెప్పగా నాణ్యమైన స్టెంట్ వేయాలని తల్లి మంజు అసావ విజ్ఞప్తి చేసింది. గత నెల 23వ తేదీన ఆమెను ఓపీ విభాగంలో స్టెంట్ వేశారు. అయితే నెల రోజుల తర్వాత సమస్య తీవ్రం కావడంతో మళ్లీ ఆస్పత్రికి వచ్చి వైద్యులను సంప్రదించారు. స్టెంట్ మార్చాల్సి ఉంటుందని వైద్యులు చెప్పడంతో తాము ముందే నాణ్యమైనది వేయాల్సిందిగా కోరిన విషయాన్ని తల్లి గుర్తుచేశారు. రెండోసారి స్టెంట్ వేయడానికి అదనంగా ఖర్చు అవుతుందని చెప్పడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఇదెక్కడి అన్యాయమని ప్రశ్నించారు. తొలగించిన స్టెంట్‌ను చూపించాల్సిందిగా డాక్టర్ జయచంద్ర సహాయకురాలు జ్యోత్స్నను అడగగా ఆమె అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించడంతో బాధిత రోగి నిషిత తల్లితోపాటు మిగతా కుటుంబ సభ్యులు ఆమెను పట్టుకోవడానికి వెళ్తుండగా తల్లి మంజు కిందపడటంతో ఆమెకు గాయాలయ్యాయి. ఓ వ్యక్తి తనను టాస్క్‌ఫోర్స్ పోలీసునంటూ తమను బెదిరింపులకు గురి చేశాడని ఆయన పేరు మోహన్ అని పోలీస్ ఆఫీసర్‌ను అంటూ తమను హెచ్చరికలకు గురి చేశాడని ఆరోపించారు. తమను మోసం చేసిన డాక్టర్‌పైనా ఆయన సహాయకురాలిపైనా చర్యలు తీసుకోవాల్సిందిగా రోగి తల్లి మంజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వైద్యుడితో పాటు ఆయన అసిస్టెంట్‌పై ఐపీసీ సెక్షన్ 337, 506, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోగి బంధువులపై ఫిర్యాదు...

తమ విధులకు ఆటంకం కలిగించడమే కాకుండా తమను తీవ్రపదాలతో దూషిస్తూ ఇబ్బందులకు గురి చేశారంటూ బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి ఉద్యోగి జ్యోత్స్న ఆస్తానా బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత నెల 29వ తేదీన నిషితా అసావాకు వైద్యం చేశారని... ఆమె కుటుంబ సభ్యులు తమపై దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా మానసిక క్షోభకు గురి చేశారని తనపై దాడికి యత్నించారని ముగ్గురు, నలుగురు తన వెంట పడి వేధించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు నిషితతో పాటు కుటుంబ సభ్యులపై ఐపీసీ సెక్షన్ 323, 506, రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


యువతలో స్ఫూర్తి కోసం 'ఫ్యాషన్ టు ప్రొఫెషన్'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పంజగుట్ట: యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడలోని పార్క్ హోటల్‌లో ఫ్యాషన్ టు ప్రొఫెషన్ అనే ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. కార్యక్రమానికి హౌస్ ఆఫ్ మిసు సహ వ్యవస్థాపకురాలు మితాలీ పటేల్, మిస్ మాలినీ ఎంటర్‌టైన్‌మెంట్ వ్యవస్థాపకులు మాలినీ అగర్వాల్, ఫిన్‌టెక్ స్టార్టప్ సహ వ్యవస్థాపకుడు రీజ్ ఈపెన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యంగ్ ఫిక్కీ చైర్‌పర్సన్ ఆర్తీ షా మాట్లాడుతూ... ఈ ప్రత్యేక కార్యక్రమం యువతలో స్ఫూర్తిని నింపుతుందని, సహకారాన్ని పెంపొందిస్తుందని, సానుకూల ప్రభావాన్ని చూపుతుందని అన్నారు. ఫ్యాషన్ టు ప్రొఫెషన్ ఈవెంట్ ఆలోచనాత్మకమైన చర్చలు, నెట్‌వర్కింగ్ అవకాశాలు, దూరదృష్టిగల కంటెంట్ సృష్టికర్తలను ఒకచోట చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు.

పోష్ నోష్ కిచెన్‌లో సరికొత్త వంటకాలు



సరికొత్త మెనూతో పోష్ నోష్ నిర్వాహకులు

బంజారాహిల్స్: కాంటినెంటల్ రుచులను ఆస్వాదించాలనుకునే ఆహార ప్రియులకు జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని పోష్ నోష్ కిచెన్ సరికొత్త మెనూతో సిద్ధమైంది. శుక్రవారం ఈ ఆహారోత్సవం ప్రారంభం కాగా గ్లోబల్ వంటకాలకు ప్రసిద్ధి చెందిన పోష్ నోష్ ఎగ్జిక్యూటివ్ చెఫ్ శ్రీనాథ్ మాట్లాడుతూ... ప్రఖ్యాత చెఫ్‌ల బృందం ఇక్కడ రుచికరమైన వంటకాలను అత్యుత్తమ పదార్థాలతో వండి వడ్డిస్తుందని తెలిపారు. కలినరి ప్రత్యేకతతో ఈ కొత్త మెనూను పరిచయం చేస్తున్నామని అన్నారు. ప్రాంతీయ పాకశాస్త్ర పోకడలు, మారుతున్న సీజన్లకు అనుగుణంగా ఇక్కడ వంటకాలు ఉంటాయని తెలిపారు. కుంగ్‌పావో బ్రోకలి, మష్రూమ్ అండ్ బ్రోకలీ సూప్, ఘోష్కా మర్గ్, చిల్లీ కార్న్ పకోడా, ముర్గ్ ధమ్ బిర్యానీ, కోడి పులావ్, బటర్ చికెన్ మసాలా ఇక్కడ ప్రత్యేక రుచులను అందజేస్తామన్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటకలతో పాటు ఆసియా, ఇటలీ, యూరప్ దేశాల వంటకాలను ఇక్కడ రుచి చూడవచ్చని తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

రహమత్‌నగర్: బీఆర్ఎస్ ప్రభుత్వంలో అమలవుతున్న షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు పేదింటి ఆడపడుచుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్‌కు మంజూరైన 59 షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ పథకాల అమలుతో రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడుతున్నా పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ వాటిని కొనసాగిస్తున్నారని స్పష్టం చేశారు. ఖైరతాబాద్ తహసీల్దార్ గోవర్ధనగిరి, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు, నేతలు దుబాయ్ నజీర్, రవిశంకర్, సయ్యద్ బషీర్, షేక్ సాబేర్, చోటు, గఫూర్, జాఫర్‌హుస్సేన్, గనీ, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

వెంగళరావునగర్: సమాజంలో నివసించే ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఖైరతాబాద్ తహసీల్దార్ గిరిధర్ తెలిపారు. ఎల్లారెడ్డిగూడలోని పీజేఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎర్ర నగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పౌరహక్కుల అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ... ప్రజలు హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాన్నారు. చాలామందికి తమ హక్కులు తెలియకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తమకు సమస్యలు వచ్చినప్పటికీ చైతన్యం లేక ఎవరికీ చెప్పుకోలేక తమలో తాము కుంగిపోతున్నారన్నారు. పౌరులు తమ హక్కులను తెలుసుకుంటే ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం పనులు త్వరితగతిన చేయించుకోవచ్చున్నారు. కార్యక్రమంలో నేతలు ఎస్.మహేష్, బి.కన్యాకుమారి, దొరపల్లి రమేష్ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను అమలు చేయండి

పంజగుట్ట: మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదని మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికుల జేఏసీ శుక్రవారం ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ కార్యాలయంలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ... ఇంటింటికీ మంచినీరు అందించే కార్యక్రమంలో భాగంగా కార్మికులు పంప్ ఆపరేటర్లుగా, లైన్‌మెన్‌లుగా విధుల్లోకి తీసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 60 ప్రకారం జీతాలు అమలు చేయాలని, కార్మిక చట్టాలైన పీఎఫ్, ఈఎస్ఐ, పండగ సెలవులు, జాతీయ సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం పెద్ద ఎత్తున కార్మికులు కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారని అందుకే ఈఎన్‌సీ నేడు కార్మిక సంఘాల నాయకులతో చర్చలకు ఆహ్వానించారని తెలిపారు. ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చామని ఆయన స్పందించి విధులు క్రమబద్ధీకరణ చేయడం ప్రభుత్వం చేతిలో ఉందని, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ విషయమై అధికారులకు ఆదేశాలు ఇస్తానని ప్రతినిధులకు వివరించినట్లు పేర్కొన్నారు.

విషమంగానే విద్యార్థి ఆరోగ్యం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్‌నెం 7లోని ఓ కార్పొరేట్ స్కూల్‌లో 11వ తరగతి చదువుతున్న మహ్మద్ అనస్ ఈ నెల 23వ తేదీన తరగతి గదిలో నుంచి బయటికి వచ్చి సెక్యూరిటీ కళ్లుగప్పి గోడ దూకి పారిపోయేందుకు యత్నించే క్రమంలో కరెంట్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలతో బాధిత విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేర్చారు. బాలుడి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. కరెంటు షాక్‌తో వీపు పూర్తిగా కాలిపోయిందని వెల్లడించారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే తన కొడుకు ప్రమాదానిక గురయ్యాడని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు పాఠశాల యాజమాన్యంపై ఐపీసీ సెక్షన్ 337 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రహరీ దూకేందుకు యత్నించడం వల్లనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం.

అకారణంగా దాడి చేసిన వ్యక్తిపై బాధితుడి ఫిర్యాదు

ఫిలింనగర్: అకారణంగా తనపై దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదుచేశారు. వివరాలివీ... ఫిలింనగర్‌లోని మహాత్మాగాంధీనగర్ బస్తీకి చెందిన ఎ.కృష్ణ సమీప బంధువు వెంకటేష్ తెల్లవారుజామున ఇంటికి వచ్చాడు. తాగిన మైకంలో ఉన్న వెంకటేష్ అకారణంగా గొడవ పడటమే కాకుండా అక్కడే ఉన్న ఓ బండరాయితో బాదడంతో కృష్ణ తలకు గాయాలయ్యాయి. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించారు. తలకు తీవ్ర గాయాలతో బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడు వెంకటేష్‌పై ఐపీసీ సెక్షన్ 324 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు

కేసు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు

హిమాయత్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఓ వ్యక్తి సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలకు చేస్తున్నాడంటూ సైబర్ క్రైం పోలీసులకు ఇద్దరు ఫిర్యాదు చేశారు. వారు సమర్పించిన ఆధారాల ప్రకారంగా సైబర్ క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్ శుక్రవారం కేసు నమోదు చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలు అయిన ట్విట్టర్, ఫేస్‌బుక్‌లో ముఖ్యమంత్రి ఫొటో ఆయన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పోస్ట్ చేశారు. దీనిని గమనించిన సీఎం అభిమానులు ఇద్దరు ట్విట్టర్, ఎఫ్‌బీ స్క్రీన్‌షాట్స్‌ను జత చేస్తూ ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కేవీఎం ప్రసాద్ చెప్పారు.

బైక్ ఢీకొని సినీ కార్మికుడికి తీవ్రగాయాలు

ఫిలింనగర్: రోడ్డు పక్కన నిలబడి బస్సు కోసం వేచి చూస్తున్న సినీ కార్మికుడిని అతివేగంతో వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. యూసుఫ్‌గూడలో నివాసం ఉంటున్న కొత్తపల్లి మణికంఠ ప్రశాంత్(25) సినీ పరిశ్రమలో సౌండ్ ఇంజినీర్‌గా పనిచేస్తుంటాడు. విశాఖపట్నంలో జరగాల్సిన షూటింగ్‌లో పాల్గొనేందుకు వెళ్లే నిమిత్తం ఈ నెల 28న అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో ఫిలింనగర్‌లోని విగ్రహాల చౌరస్తాకు వచ్చిన ప్రశాంత్ రోడ్డు పక్కన నిలబడ్డాడు. కాసేపట్లో షూటింగ్ యూనిట్‌కు సంబంధించిన బస్సు వస్తుందని చూస్తుండగా వేగంగా వచ్చిన ఓ బైక్ అదుపు తప్పి ప్రశాంత్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రశాంత్‌ను స్థానికులు అపోలో ఆస్పత్రిలో చేర్చారు. ఈ ప్రమాదంలో ప్రశాంత్ కుడికాలు విరగడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఈ మేరకు బాధితుడు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఎల్‌జీ మెగా బ్లడ్ డొనేషన్ డ్రైవ్



బంజారాహిల్స్: ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల సంస్థ ఎల్‌జీ ఇండియా ఆధ్వర్యంలో నగరంలో బ్లడ్ డొనేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డు నెం.36లోని కావూరిహిల్స్‌లో ఈ శిబిరం నిర్వహించారు. 'లైఫ్ ఈజ్ గుడ్. వెన్ లైఫ్స్ షేర్డ్' అనే థీమ్‌తో జరిగిన క్యాంపులో సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. రక్తదానంపై వినియోగదారులకు అవగాహన కల్పించారు.

రేపు ముగియనున్న సమ్మర్ ఉత్సవ్ మేళా

ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళా జూలై 2వ తేదీతో ముగుస్తుందని నిర్వాహకులు మిర్జా రఫీక్ బేగ్ తెలిపారు. నెల రోజులుగా 400 రకాల వివిధ రకాల చేపలతో ఏర్పాటు చేసిన ఫిష్ టన్నెల్, ఎక్వేరియంలతో నగరవాసులను అలరించిందని తెలిపారు. వినూత్న రీతిలో ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళాను పెద్ద ఎత్తున నగరవాసులు, విద్యార్థులు సందర్శించారని తెలిపారు.

సీనియర్ పాస్టర్ కప్పల కృపావర్మ మృతి




కేకే వర్మ (ఫైల్)

బంజారాహిల్స్: తెలుగు యునైటెడ్ చర్చి కువైట్ వ్యవస్థాపకుడు, బంజారాహిల్స్ రోడ్ నెం. 12 ఎమ్మెల్యే కాలనీ షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చి పూర్వ సీనియర్ పాస్టర్ కప్పల కృపావర్మ అలియాస్ కేకే వర్మ (89) శుక్రవారం తెల్లవారుజామున ఎమ్మెల్యే కాలనీలోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కువైట్‌లో క్రైస్తవ మత వ్యాప్తికి, చర్చిల విస్తరణకు ఆయన ఎంతగానో కృషి చేశారు. రేడియో టీవీ గాస్పెల్ స్పీకర్‌గా, ఆధ్యాత్మిక ప్రసంగీకుడిగా క్రైస్తవ సమాజంలో ఆయనకు మంచి పేరు ఉంది. ఆయన అంత్యక్రియలను శనివారం ఉదయం గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రి వెనుక ఉన్న క్రిస్టియన్ గ్రేవియార్డ్‌లో నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. వర్మ మృతితో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్‌తో పాటు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. క్రైస్తవ సమాజం అభ్యున్నతి కోసం ఆయన ఎంతగానో కృషి చేశాడని షారోన్‌ఫుల్ చర్చి పాస్టర్ ఎం. ప్రభుదాస్ తెలిపారు. ఆయన మృతి తీరని లోటన్నారు.

తోడు దొంగలు దొరికారిలా..

బాబు, నారాయణ క్విడ్ ప్రో కో బట్టబయలు

- చంద్రబాబు కరకట్ట నివాసం అటాచ్‌మెంట్‌కు అనుమతి
- నారాయణ కుటుంబ సభ్యుల ప్లాట్లు, రూ.1.92 కోట్ల బ్యాంకు ఖాతాలు కూడా..
- ఏసీబీ న్యాయస్థానం ఆదేశాలు జారీ
- అమరావతి పేరిట టీడీపీ ప్రభుత్వం భారీ భూబాగోతం
- సీడ్ క్యాపిటల్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్‌లో అక్రమాలు
- క్విడ్ ప్రో కోలో భాగంగానే చంద్రబాబుకు కరకట్ట నివాసం
- నారాయణ కుటుంబ సభ్యులకు అమరావతిలో ప్లాట్లు
- సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా బట్టబయలు



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు యథేచ్ఛగా సాగించిన అమరావతి భూ కుంభకోణాల బాగోతం బట్టబయలైంది. చంద్రబాబు, అప్పటి మంత్రి పొంగూరు నారాయణ ద్వయం భూ దోపిడీ నిర్ధారణ అయ్యింది. అమరావతిలో సీడ్ క్యాపిటల్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ పేరిట క్విడ్ ప్రో కోకు పాల్పడ్డారన్నది స్పష్టమైంది. ఈ కేసులో ఏ–1గా ఉన్న చంద్రబాబు కరకట్ట నివాసాన్ని అటాచ్ చేసేందుకు న్యాయస్థానం అనుమతినిచ్చింది. దాంతోపాటు ఈ కేసులో ఏ–2గా ఉన్న పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు, భూ సమీకరణ కింద పొందిన కౌలు మొత్తం రూ.1.92 కోట్లను కూడా అటాచ్ చేసేందుకు న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానం శుక్రవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబు కరకట్ట నివాసం, నారాయణ కుటుంబ సభ్యులు, బినామీల పేరిట ఉన్న ప్లాట్లు, బ్యాంకు నిల్వలను బదలాయించేందుకు మార్పులు చేసేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. ఆ ఆస్తుల అటాచ్‌మెంట్ కోసం జులై 14 లోపు నోటీసులు జారీ చేయాలని కూడా ఆదేశించింది. ఈ కేసులో పూర్తి స్థాయి అటాచ్‌మెంట్ కోసం కేసు విచారణ కొనసాగుతుందని తెలిపింది. దాంతో అమరావతి భూ కుంభకోణం ద్వారా చంద్రబాబు, నారాయణ, వారి బినామీలు భారీగా అవినీతికి పాల్పడ్డారని నిగ్గుతేలింది. అమరావతిలో చంద్రబాబు, నారాయణ సాగించిన భూ అక్రమాలను సిట్ నిర్ధారించిది. క్విడ్ ప్రో కో కింద పొందిన కరకట్ట నివాసం, అమరావతిలో ప్లాట్లు, భూ సమీకరణ కింద పొందిన కౌలు మొత్తాన్ని అటాచ్ చేసేందుకు అనుమతించాలన్న సిట్ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దాంతో ఆ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని సిట్ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌పై రెండు నెలల విచారణ అనంతరం న్యాయస్థానం అటాచ్‌మెంట్‌కు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దాంతో చంద్రబాబు కరకట్ట నివాసం, నారాయణ కుటుంబ సభ్యుల ప్లాట్లు, బ్యాంకు ఖాతాల అటాచ్‌మెంట్ కోసం సీఐడీ చర్యలు తీసుకోనుంది.

అటాచ్ చేయనున్న చంద్రబాబు, నారాయణ ఆస్తులు

- ఏ–1 చంద్రబాబు కరకట్ట నివాసం (లింగమనేని రమేశ్ కుటుంబం పేరిట ఉన్న ఈ నివాసాన్ని చంద్రబాబు క్విడ్ ప్రో కో కింద పొందారు)
- ఏ–2 పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులు, బంధువులు, బినామీల పేరిట అమరావతిలో ఉన్న 75,888 చదరపు గజాల ఇళ్ల స్థలాలు
- ఏ–2 నారాయణ భార్య పొత్తూరి ప్రమీల, కుటుంబ సభ్యులు, బంధువులు రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప భూ సమీకరణ కింద ఇప్పటి వరకు పొందిన కౌలు మొత్తం రూ.1.92,11,482

చంద్రబాబు అవినీతి మాస్టర్‌ప్లాన్

అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే ఏ-1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీ అవినీతికి పాల్పడినట్టు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) విచారణలో ఆధారాలతో సహా బట్టబయలైంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు టీడీపీ ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో కన్సల్టెన్సీని ఎంపిక చేసింది. లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు బినామీలకు చెందిన భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా.. వారి భూముల వెలుపలి నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేలా మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా చంద్రబాబు కుటుంబానికి లింగమనేని కుటుంబం భారీగా ప్రతిఫలాన్ని ముట్టజెప్పింది. ఇన్నర్ రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను హెరిటేజ్ ఫుడ్స్‌కు 'అమ్మినట్టు'ఇవ్వడంతో సరిపెట్టకుండా, కృష్ణా నది కరకట్ట మీద ఉన్న నివాసాన్ని కూడా చంద్రబాబుకు అప్పగించింది.

బెడిసికొట్టిన పన్నాగం

- కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు జీతంతో పాటు హౌస్ రెంట్ అలవెన్స్ (ఇంటి అద్దె అలవెన్స్) కూడా తీసుకున్నారు. కానీ చంద్రబాబు 2017 నుంచి తాను ఉంటున్న కరకట్ట నివాసానికి గాను లింగమనేని కుటుంబానికి అద్దె చెల్లించినట్టు ఎక్కడా బ్యాంకు లావాదేవీలు లేవు. చంద్రబాబు నుంచి తీసుకున్న అద్దెకు లింగమనేని ఎక్కడా జీఎస్టీ చెల్లించనే లేదు. దీన్నిబట్టి క్విడ్ ప్రో కోలో భాగంగానే కరకట్ట నివాసాన్ని చంద్రబాబుకు లింగమనేని ఇచ్చారన్నది సుస్పష్టమైంది.
- కరకట్ట నివాసంపై తప్పుదోవ పట్టించేందుకు లింగమనేని రమేశ్ కూడా యత్నించారు. తాను దేశభక్తితోనే కరకట్ట నివాసాన్ని అప్పటి ప్రభుత్వం వాడుకునేందుకు ఉచితంగా ఇచ్చానని న్యాయస్థానానికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. ఇంటిని ఉచితంగా ఇస్తే చంద్రబాబు ప్రజాధనం నుంచి ఇంటి అద్దె అలవెన్స్‌ను ఎందుకు తీసుకుంటున్నారని సిట్ అధికారులు ప్రశ్నించగా లింగమనేనికి నోట మాట రాలేదు.
- దేశభక్తితో ఉచితంగా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి గానీ, చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఇవ్వడం ఏమిటంటే కూడా సమాధానం లేదు. ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చి ఉంటే.. చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోగానే ఆ ఇంటిని ఖాళీ చేసి ప్రభుత్వానికి అప్పగించాలి.
- 2019లో సీఎం పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా చంద్రబాబు అదే కరకట్ట నివాసంలో ఉంటున్నారు. అంటే లింగమనేని దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నది అవాస్తవం. క్విడ్ ప్రో కో లో భాగంగానే ఆయన చంద్రబాబుకు ఇచ్చారన్నది నిర్ధారణ అయ్యింది.

లింగమనేని నుంచి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూమి

కరకట్ట నివాసమే కాదు లింగమనేని కుటుంబం భూములను కూడా చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్‌కు అప్పగించిందన్నది కూడా సిట్ దర్యాప్తులో వెల్లడైంది. 2014లో లింగమనేని కుటుంబ సభ్యుల నుంచి హెరిటేజ్ ఫుడ్స్ 4 ఎకరాల కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు చూపించారు. అమరావతి ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమినే హెరిటేజ్ ఫుడ్స్‌కు బదలాయించారు. ఆ సమయంలో నారా లోకేశ్ డైరెక్టర్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై మంత్రి కూడా అయిన లోకేశ్ అదే లింగమేని కుటుంబం ఇచ్చిన కరకట్ట మీద నివాసంలోనే నివసించారు.

సీడ్ క్యాపిటల్‌లో వేళ్లూనుకున్న అవినీతి

అమరావతికి గుండెకాయ వంటి సీడ్ క్యాపిటల్‌లో కూడా ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారు. శాసనసభ, సచివాలయం మొదలైన ప్రధాన విభాగాలన్నీ కూడా సీడ్ క్యాపిటల్ పరిధిలోనే నిర్మిస్తామని ప్రకటించడంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరుగుతాయి. అందుకే సీడ్ క్యాపిటల్‌లో పూర్తిగా తమ వాటా భూములే ఉండేట్టుగా వారు వ్యవహారం సాగించారు. సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వానికి 2015 జూలైలోనే సమర్పించినప్పటికీ ఆమోదించకుండా మూడు నెలలపాటు కాల యాపన చేశారు. ఆ మూడు నెలల్లోనే నారాయణ తమ బినామీలు, బంధువులైన పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో 65.50 ఎకరాలు కొనుగోలు చేశారు. అందుకోసం నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. వారి పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేశారు. ఆ నిధులతో ఆ కంపెనీ ఉద్యోగుల పేరున భూములు కొనుగోలు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆ ఉద్యోగులను సిట్ అధికారులు ప్రశ్నించగా తాము నారాయణ బినామీలుగానే భూములు కొనుగోలు చేశామని వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.

బినామీల పేరుతో 75,888 చ.గజాలు

నారాయణ తమ బంధువులు, బినామీల పేరిట సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్‌డీయేకు ఇచ్చారు. అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చ.గజాల స్థలాలను పొందారు. వాటిలో 7,620 చ.గజాలు, 8,880 చ.గజాలు, 6,550 చ.గజాలు, 25 వేల చ.గజాల స్థలాలు కూడా ఉండటం... అవి నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానించి ఉండటం గమనార్హం. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్‌డీఏ ఇప్పటి వరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. అంటే ఆ భూములు కొనుగోలు చేసి సీఆర్‌డీఏకే ఇచ్చినట్టు పేర్కొన్న పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప నారాయణ బినామీలేనన్నది నిర్ధారణ అయ్యింది.

వారి భూముల సమీపం నుంచే ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించడంలోనూ చంద్రబాబు, నారాయణ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థల సమీపం నుంచి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా చంద్రబాబు, నారాయణ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. అందుకోసం సామాన్య రైతుల భూముల గుండా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అందుకోసం ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు కూడా సీఆర్‌డీయే అనుమతులు నిలిపివేసింది. అంటే కన్సల్టెన్సీ సంస్థ అలైన్‌మెంట్‌ను రూపొందించకముందే చంద్రబాబు, నారాయణ ఇన్నర్‌రింగ్ రోడ్డు ఎలా నిర్మించాలో నిర్ణయించేశారు. వాస్తవానికి విజయవాడలోని కామినేని ఆసుపత్రి వద్ద ఉన్న తాడిగడప- ఎనికేపాడు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కన్సల్టెన్సీ సంస్థ ఎస్‌టీయూపీ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూముల గుండా రోడ్డును నిర్మించాల్సి వస్తుంది. దీనిపై అప్పటి సీఆర్‌డీయే వైస్ చైర్మన్‌గా ఉన్న నారాయణ సీఆర్‌డీయే సమావేశంలోనే అధికారులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. తాడిగడపకు 3 కి.మీ. దూరంగా తూర్పు వైపు నుంచి పెనమలూరు- నిడమానూరు మీదుగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్పించారు. ఈ అక్రమాలన్నీ నిర్ధారణ అయ్యాయి. క్రిడ్ ప్రో కో కు పాల్పడినట్టు న్యాయస్థానం కూడా భావించి.. చంద్రబాబు, నారాయణ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతినిచ్చింది.

సెంథిల్ బాలాజీ డిస్మిస్ ఉత్తర్వులు వెనక్కి

తమిళనాడు గవర్నర్ యూటర్న్

సాక్షి, చెన్నై: తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ వ్యవహారంలో గవర్నర్ ఆర్ఎన్ రవి యూటర్న్ తీసుకున్నారు. సెంథిల్ బాలాజీని మంత్రి వర్గం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ఐదు గంటల వ్యవధిలోనే గవర్నర్ వెనక్కి తగ్గారు. తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్ వ్యవహరిస్తున్న తీరుపై చట్ట పోరాటానికి సీఎం స్టాలిన్ సిద్ధమయ్యారు. సెంథిల్‌ను డిస్మిస్ చేస్తూ గురువారం రాత్రి గవర్నర్ రవి ఉత్తర్వులు జారీ చేశారు. స్పందించిన సీఎం స్టాలిన్ చట్టపరంగా గవర్నర్‌ను ఎదుర్కొంటామని చెప్పారు. ఇది జరిగిన ఐదు గంటల్లోనే డిస్మిస్ ఉత్తర్వులను వెనక్కి తీసుకుంటూ గవర్నర్ రవి మరో ప్రకటన చేశారు. గవర్నర్ జారీ చేసిన డిస్మిస్ ఉత్తర్వులపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పందించి తన కార్యాలయ వర్గాల ద్వారా గవర్నర్‌కు సూచనలు చేశారు. అటార్నీ జనరల్ అభిప్రాయం తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అటార్నీ జనరల్ తుషార్ మెహతాతో గవర్నర్ ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. ఆయన సలహా మేరకు డిస్మిస్ ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది.

వివేకా హత్య కేసులో సీబీఐ చార్జ్‌షీట్

కోర్టుకు హాజరుకాని కీలక నిందితుడు దస్తగిరి

సాక్షి, హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణలో భాగంగా సీబీఐ ప్రత్యేక న్యాయస్థానంలో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) సప్లిమెంటరీ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. 2019 మార్చి 15న హత్యకు గురైన వివేకా కేసు.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానానికి బదిలీ అయ్యాక సీబీఐ తొలిసారి చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఇందులో ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ–6), వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ–7), వైఎస్ అవినాశ్‌రెడ్డి(ఏ–8)లతో పాటు అనుమానిత నిందితుల కింద వివేకా పీఏ ఎంవీ కృష్ణారెడ్డిని ఏ–9గా, ఏదుల ప్రకాశ్‌ను ఏ–10గా పేర్కొంది. విచారణ సందర్భంగా గంగిరెడ్డి(ఏ–1), సునీల్ యాదవ్(ఏ–2), ఉమాశంకర్‌రెడ్డి(ఏ–3), శివశంకర్‌రెడ్డి(ఏ–5), ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఏ–6), వైఎస్ భాస్కర్‌రెడ్డి(ఏ–7) హాజరయ్యారు. చంచల్‌గూడ జైలులో ఉన్న వీరిని పోలీసులు కోర్టుకు తరలించారు. కాగా, దస్తగిరి(ఏ–4) మాత్రం విచారణకు హాజరు కాలేదు. చార్జ్‌షీట్ దాఖలు చేసిన తర్వాత విచారణను న్యాయమూర్తి ఈ నెల 14వ తేదీకి వాయిదా వేశారు. ఏపీలో విచారణలో ఉండగా రెండుసార్లు చార్జ్‌షీట్ దాఖలు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా, కేసు దర్యాప్తునకు సీబీఐకి సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు జూన్ 30తో ముగిసింది. ఈ నేపథ్యంలో ఈ గడువును పొడిగించాలని సీబీఐ కోరనుందా అనేది తెలియాల్సి ఉంది.

నగర వార్తలు

రాందేవ్‌రావ్ వైద్యుడికి అపూర్వ గౌరవం

- ఐఎస్‌సీసీఎం అధ్యక్షుడిగా డా. శ్రీనివాస్ సామవేదం



అల్విన్‌కాలనీ: ఇండియన్ సొసైటీ ఆఫ్ క్రిటికల్ కేర్ మెడిసన్ (ఐఎస్‌సీసీఎం) నూతన అధ్యక్షుడిగా కూకట్‌పల్లిలోని రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో చీఫ్ ఇంటెన్సివిస్ట్ స్పెషలిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ సామవేదం ఎన్నికయ్యారు. సుమారు 1400 మంది డాక్టర్లు సభ్యులుగా ఉన్న ఐఎస్‌సీసీఎం ప్రధాన కార్యాలయం ముంబయిలో ఉంది. ఈ సొసైటీ ద్వారా వైద్యులు, నర్సులు, శ్వాసకోశ నిపుణులకు క్రిటికల్ కేర్ విభాగంలో శిక్షణ తరగతులను అందజేస్తారు. ఈ సొసైటీకి అధ్యక్షుడుగా 20 సంవత్సరాల తరువాత దక్షిణ భారతదేశానికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ సామవేదం ఎన్నికయ్యారు. ఈయన క్రిటికల్ కేర్ విభాగంలో గత 23 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్నారు. ఈయన తన వైద్య వృత్తిలో మన దేశంతో పాటు విదేశాలలో అత్యుత్తమ కేంద్రాలలో శిక్షణ పొందారు. నగరంలోని రాందేవ్‌రావ్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ అత్యుత్తమ పదవి లభించడం పట్ల ఆసుపత్రి సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగుల ప్రమోషన్ రిజర్వేషన్‌లు అమలు చేయాలి

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణమధ్య రైల్వేలో పని చేసే దివ్యాంగులైన ఉద్యోగులకు రిజర్వేషన్లను అమలు చేయాలని అఖిలభారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొలినాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. దివ్యాంగుల హక్కుల చట్టం సెక్షన్ 3, సెక్షన్ 21 ప్రకారం దివ్యాంగులైన ఉద్యోగస్తుల హక్కులను భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవలసి ఉంటుందని, వారికి సముచితమైన ప్రాధాన్యత నివ్వాలని చీఫ్ కమిషనర్ ఆఫ్ డిజేబుల్టీస్ కోర్టు వెల్లడించిన ఆదేశాలను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

సాక్షి రియల్టీ

విక్రయాలపైనే దృష్టి!

- ఈ ఏడాది రెండో త్రైమాసికంలో 13,570 గృహాల విక్రయం
- క్యూ2లో 10,470 యూనిట్ల లాంచింగ్
- ఏడాదిలో నగరంలో 10 శాతం పెరిగిన ధరలు
- ఎన్నికల ఏడాది కావటంతో స్థిరాస్తి రంగంపై ప్రభావం
- అనరాక్ గ్రూప్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొనడంతో దాని ప్రభావం స్థిరాస్తి రంగంపై పడుతుంది. ఈ ఏడాది తొలి త్రైమాసికం (జనవరి–మార్చి) క్యూ1తో పోలిస్తే హైదరాబాద్‌లో గృహ విక్రయాలు, లాంచింగ్స్‌లలో క్షీణత నమోదయింది. 2023 క్యూ2లో 13,570 ఇళ్లు విక్రయమయ్యాయి. క్రితం త్రైమాసికంలో అమ్ముడైన 14,280 యూనిట్లతో పోలిస్తే ఇది 5% తక్కువ. అలాగే ఈ ఏడాది ఏప్రిల్–జూన్‌లో నగరంలో 10,470 యూనిట్లు లాంచింగ్ అయ్యాయి. అదే 2023 క్యూ1లో ప్రారంభమైన 14,620 గృహాలతో పోలిస్తే 28 శాతం క్షీణత.

- ఏడాదిలో దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ప్రాపర్టీ ధరలు 8 శాతం మేర పెరిగాయని అనరాక్ గ్రూప్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది. హైదరాబాద్‌లో అత్యధికంగా 10 శాతం రేట్లు పెరగగా.. బెంగళూరు, ఎన్సీఆర్, ముంబైలలో 9 శాతం మేర ధరలు వృద్ధి చెందాయి. 2022 క్యూ2 నాటికి 6.25 లక్షల యూనిట్ల ఇన్వెంటరీ ఉండగా.. ఈ క్యూ3 నాటికి 2 శాతం తగ్గి 6.14 లక్షలకు చేరాయి.
- 2023 క్యూ2లో ఏడు నగరాలలో 1,15,100 యూనిట్లు విక్రయమయ్యాయి. గతేడాది క్యూ2లోని 84,940 అమ్మకాలతో పోలిస్తే ఇది 36 శాతం, 2023 క్యూ1లోని 1,13,780 విక్రయాలతో పోలిస్తే 1 శాతం వృద్ధి. ఈ క్యూ2లోని విక్రయాలలో 51 శాతం వాటాతో ముంబై, పుణే నగరాల్లో హవా కొనసాగించాయి. గృహ విక్రయాలలో పుణేలో ఏడాదిలో 65 శాతం వృద్ధి నమోదు కావటం గమనార్హం.
- ఈ ఏడాది క్యూ2లో 1,02,610 యూనిట్లు ప్రారంభమయ్యాయి. గతేడాది క్యూ2లో లాంచింగ్ అయిన 82,150 ఇళ్లతో పోలిస్తే ఇది 6 శాతం క్షీణత. అలాగే 2022 క్యూ2లో ప్రారంభమైన 82,150 గృహాలతో పోలిస్తే ఇది 25 శాతం వృద్ధి. అత్యధికంగా ముంబైలో 43,390 యూనిట్లు ప్రారంభం కాగా.. పుణేలో 21,350 గృహాలు లాంచింగ్ అయ్యాయి.

మధ్యతరహా ఇళ్లకే ఆసక్తి..

రూ.40 లక్షల నుంచి రూ.80 లక్షల మధ్య ధర ఉన్న మధ్యతరహా గృహ నిర్మాణాలకే డెవలపర్లు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. 2023 క్యూ2లో లాంచింగ్ అయిన యూనిట్లలో 31 శాతం వాటా ఈ తరహా ఇళ్లే. రూ.80 లక్షల నుంచి రూ.1.50 కోట్ల మధ్య ధర ఉన్న ప్రీమియం ఇళ్ల వాటా 27 శాతం, రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ గృహాల వాటా 23 శాతంగా ఉన్నాయి. ఐటీ కంపెనీల లే–ఆఫ్‌లు, వడ్డీ రేట్ల పెరుగుదల, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రతికూలతలు ఏవీ భారత స్థిరాస్తి రంగంపై ప్రభావం చూపించలేదని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనూజ్ పూరీ తెలిపారు. వరుసగా రెండో త్రైమాసికంలో కూడా దేశీయ గృహ నిర్మాణ విభాగం రాకెట్ వేగంతో దూసుకుపోయిందన్నారు.

తెలుగు వర్సిటీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2023–24వ విద్యా సంవత్సరానికి పీహెచ్‌డి, పీజీ, యూజీ, డిప్లొమా, సర్టిఫికెట్, కోర్సులలో విద్యార్థులు ప్రవేశం పొందడానికి మరో పది రోజుల గడువును పొడిగించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడానికి గడువును విధించిన వర్సిటీ జులై 10వ తేదీ వరకు ఆలస్య రుసుముతో దరఖాస్తులను స్వీకరించడానికి గడువును పొడిగించినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేయవచ్చని తెలిపారు.

డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్‌కు గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ తలసేమియా సికిల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్‌కు అరుదైన గుర్తింపు లభించింది. సామాజిక సేవలో ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్ అవార్డు కౌన్సిల్ అవార్డు లభించింది. ప్రపంచ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేసింది. సైప్రస్‌లోని తలసేమియా ఇంటర్నేషనల్ ఫెడరేషన్ నుండి మెంబర్‌షిప్ సర్టిఫికేట్ కూడా ఆయన పొందారు. అంతేకాదు ఆయన వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమీషన్ నుండి మెంబర్‌షిప్ సర్టిఫికేట్ కూడా అందుకున్నారు.

మహిళల ఆత్మగౌరవం కోసమే యునిఫాం సివిల్ కోడ్

- మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: యునిఫాం సివిల్ కోడ్ అనేది పూర్తిగా మహిళల ఆత్మగౌరవం, గౌరవప్రదమైన జీవనం గడిపేందుకు ఒక చక్కటి మార్గమని మాజీ ఎమ్మెల్సీ, హైకోర్టు న్యాయవాది రామచంద్రరావు అన్నారు. దేశానికి ఇది ఎంతో అవసరమని, ఇందులో ఎలాంటి రాజకీయం, మతం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తక్షణ చారిత్రక అవసరం ఉమ్మడి పౌరస్మృతిపై జాగృతి ప్రత్యేక సంచిక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ గోపరాజు నారాయణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధివక్తా పరిషత్ అఖిలభారతీయ అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి, హైకోర్టు న్యాయవాది నిహారికా రెడ్డిలు మాట్లాడుతూ .. అప్పుడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ప్రముఖ జస్టిస్‌లు కూడా ఎంతో మంది ఇది మన దేశంలో ఎంతో అవసరమని వారి వాణి వినిపించారన్నారు. బీజేపీని మొదటినుండీ వ్యతిరేకించే ఆమ్ ఆద్మీ పార్టీ కూడా దీన్ని సమర్ధించడం, ఎన్నో రాజకీయ పార్టీలు, మేధావి వర్గం, న్యాయవాదులు, మహిళలు దీన్ని సమర్ధిస్తున్నారని తెలిపారు. విదేశాల్లో ఎన్ని మతాలు ఉన్నా ఒకటే చట్టం ఉంటుందని వారు గుర్తుచేశారు. క్రైమ్‌లో సమచట్టం ఉన్నప్పుడు సివిల్ మ్యాటర్స్‌లో ఎందుకు సమచట్టం ఉండకూడదని ప్రశ్నించారు. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం యూనిఫాం సివిల్ కోడ్ ఒక్కటే అన్నారు.

జీవితాన్వేషణ ఒక 'కళ'..

- ప్రఖ్యాత రచయిత గురుచరణ్ దాస్
- నగరం వేదికగా 'ది మీనింగ్ ఆఫ్ లైఫ్' అంశంపై చర్చ..



సాక్షి, సిటీబ్యూరో: జీవితం గురించి అన్వేషించడం ఒక కళ, జీవితమంటే గొప్పగా నిర్మించుకోవడం కాదు.. జీవితమంటే 'తెలుసుకోవడం' అని ప్రముఖ రచయిత గురుచరణ్ దాస్ తెలిపారు. నగరంలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ వేదికగా శుక్రవారం 'స్టోరీస్ బై మెరాకీ, సంజీవ్ జగ్గీ' సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రచయిత గురుచరణ్ దాస్ 'ది మీనింగ్ ఆఫ్ లైఫ్' అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ అగర్వాల్, మోహిత్ బత్రా, సంజీవ్ జగ్గీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుచరణ్ దాస్ మాట్లాడుతూ.. జీవిత పరమార్థం గురించి స్వయంగా తెలుసుకోవడం అద్భుతమైన కళ అని పేర్కొన్నారు. కేవలం జీవించడమే కాకుండా వినూత్న దారులను అన్వేషించాలని ఈ తరానికి సూచించారు. ఈ ఆలోచనా విధానానికి చిన్నతనంలోనే తన తండ్రి పునాది వేశారని గుర్తుచేసుకున్నారు. హిందూమతంలోని ప్రాథమిక భావనలు ఒక వ్యక్తిని ఉద్దేశపూర్వక ఉనికి వైపు నడిపిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తన 'కామ, అర్థ, ధర్మ' రచనల్లోని అంతర్దృష్టులను, పరమార్థాలను అభిమానులకు వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో తన అధ్యయనాలు మొదలు ప్రస్తుత రచనా జీవితం వరకు కొనసాగిన మధుర ఘట్టాలను నెమరువేసుకున్నారు. తన తదుపరి పుస్తకం 'అనదర్‌సార్ట్ ఆఫ్ ఫ్రీడం' విశేషాలను పంచుకున్నారు. ఈ రచన మతపరమైన, ఆధ్యాత్మిక సరిహద్దులను దాటి 'మోక్షం' అనే పదానికి సరైన వివరణను అందిస్తుందని అన్నారు.

హెల్త్ డైరెక్టర్ అవినీతిపై చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్: ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ప్రభుత్వ అధికారులు స్వలాభం కోసం అక్రమాలకు పాల్పడుతున్నారని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాస్ రావు అవినీతి, అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ లంబాడీ హక్కుల పోరాట సమితి, ఎస్టీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఛలో ప్రగతి భవన్‌కు శుక్రవారం పిలుపునిచ్చారు. చలో ప్రగతి భవన్‌కు సన్నద్ధం కావడానికి హైదర్‌గూడ, పంజాగుట్ట ప్రాంతాల్లో వీరంతా సమావేశమయ్యారు. ఆయా ప్రాంతాలకు చేరుకున్న నారాయణగూడ, పంజాగుట్ట పోలీసులు వారందరినీ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లకు తరలించారు. దీంతో పోలీస్ స్టేషన్లలోనే ఆందోళనకారులు నిరసనను కొనసాగించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రాజేష్ నాయక్ మాట్లాడుతూ... హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్ రావు చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధించి ఆధారాలను ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుకు అందించినా ఇప్పటి వరకు ఆయనపై చర్యలు తీసుకోలేదన్నారు. ట్రైబల్ రిజర్వేషన్ పోస్టులను తన అనుకూలమైన వారికి అమ్ముకున్నారని ఆరోపించారు. ఇంత అవినీతి జరుగుతున్నా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయన అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రంలో ఉన్న 42 లక్షల మంది లంబాడీలను చైతన్యం చేసి... బీఆర్ఎస్ పార్టీని ఓడించేందుకు పనిచేస్తామని ఆయన హెచ్చరించారు. కేశవ నాయక్, దశరథ్ నాయక్, నాగేశ్వరరావు, నంద నాయక్, నగేష్, కృష్ణ, గోవింద్ నాయక్, ప్రకాష్ రాథోడ్, సురేష్ నాయక్ తదితరులపై నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు.



నారాయణగూడ పోలీసు స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

'చిప్–టు–స్టార్టప్ ప్రోగ్రామ్'కు హెచ్‌సీయూ ఎంపిక

రాయదుర్గం: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'చిప్–టు–స్టార్టప్ ప్రోగ్రామ్' కోసం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఎంపికైంది. సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎలక్ట్రానిక్స్ సైన్స్ అండ్ టెక్నాలజీ(సీఏఎస్ఈఎస్‌టీ) తన ప్రతిష్టాత్మకమైన చిప్–టు–స్టార్టప్ కింద హెల్త్ కేర్ అప్లికేషన్లలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ)ని లక్ష్యంగా చేసుకొని రూ.85.66 లక్షల ప్రాజెక్టును అందజేసింది. భారత ప్రభుత్వంలోని ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎంఈఐటీవై)ద్వారా నిధులను కేటాయించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబాత్, ప్రొఫెసర్ ఎస్‌వీఎస్‌నాగేశ్వరరావు, డాక్టర్ భావనాగోంబర్ పాల్గొన్నారు.

* మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

• • •

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

• • •

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లీ, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కోవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి-అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఈ ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

"కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటెలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటి, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా. నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.

న్యూస్‌మేకర్


సాబ్రి

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

మరో స్వర్ణకమలం

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కానివ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్థుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై-క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్-ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.





గుడ్ ఫుడ్

చినుకుల్లో తప్పక తినండి

నేరేడు చెట్టు మీద కాయలు
చెట్టు కింద పిల్లలు
ఒకప్పటి చిత్రం.
ఊరి చెట్టుగా ఉండే
నేరేడు ఇళ్ల మధ్య నుంచి అదృశ్యమైపోయింది.
వానలు మొదలైతే నేరేడు కాయలు వస్తాయి.
ఇప్పుడు మార్కెట్‌లో కొలువు తీరి
నల్లవజ్రాల్లా మెరుస్తున్నాయి.
వీటివల్ల కలిగే హెల్త్ బెనిఫిట్స్
మీకు తెలిస్తే బండి ఆపుతారు.
అరకిలో తప్పక తీసుకుంటారు.

ప్రకృతికి అన్నీ తెలుసు. ఏ సమయంలో ఏ కాయను జనులకు ఇచ్చి వారి ఆరోగ్యం మెరుగు పరచాలో తెలుసు. తొలకరి మొదలైనప్పుడు, వానలు ప్రారంభమయ్యాక రకరకాల సూక్ష్మక్రిములు పైకి లేచి, నీట కలిసి ఇన్ఫెక్షన్లు కలిగిస్తాయి. అలాంటి ఇన్ఫెక్షన్లకు విరుగుడుగా ఈ కాలంలో నేరేడు పండ్లు వస్తాయి. తొలి ఏకాదశి నాటికి ముమ్మరంగా దొరుకుతాయి. వగరుగా తీపిగా ఉండి, తిన్న వెంటనే నాలుక రంగు మారి, గొంతు కాస్త పట్టినట్టుగా అనిపించి... కాని ఈ సీజన్‌లో వీటి రుచి ఒంటికి పట్టాలి. శరీరానికి వీటి అవసరం ఉంది.

చిట్టి నేరేడు... అల్లనేరేడు

నేరేడు పండ్ల చెట్టు గతంలో పల్లెల్లో పట్నాల్లో రోడ్డు పక్కన, మైదానాల దగ్గర, స్కూళ్ల చుట్టుపక్కల కనిపించేది. ఇప్పుడు దాదాపుగా ఊళ్లల్లో ఎవరూ నేరేడు వేయడం లేదు. ప్రత్యేకంగా సాగు చేసి వీటి పండ్లను మార్కెట్‌లో అమ్మాల్సి వస్తోంది. లేదంటే నేరేడు చెట్టెక్కని పిల్లలు గతంలో ఉండేవారు కాదు. దేశవాళి నేరేడు చిన్నదిగా ఉంటుంది. ఇది చిట్టి నేరేడు. కొంచెం కోలగా ఉండేది అల్ల నేరేడు. ఇప్పుడు హైబ్రీడ్ నేరేడు మార్కెట్‌లో విస్తృతంగా దొరుకుతోంది. ఏ నేరేడు దొరికినా ఈ సీజన్‌లో రోజూ కొన్ని పండ్లు తినడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

గతంలో తాతయ్యలు, అమ్మమ్మలు నేరేడు పండ్ల అమ్మకం బుట్ట వస్తే కొని వాటిని ఇష్టపడని పిల్లల చేత కూడా బలవంతంగా గదమాయించి తినిపించేవారు. దానికి కారణం నోట్లో నుంచి పొరపాటున కడుపులోకి వెళ్లిన వెంట్రుకలు పేగుల్లో ఉండిపోతే వాటిని కరిగించి పారేసే శక్తి నేరేడుకు ఉందని తాతయ్యలు చెప్పేవారు. నులి పురుగులు కూడా నశిస్తాయి. అయితే నేరేడుకు ఈ శక్తి మాత్రమే కాదు. ఇంకా విశేష ఔషధ గుణాలు ఉన్నాయి. నేరేడును 'కింగ్ ఆఫ్ యాంటీ ఆక్సిడెంట్స్' అంటారు. శరీరంలోని అపసవ్య కణాలను, కేన్సర్ కారకాలను ఇది అమోఘంగా శుభ్రం చేస్తుంది. దీనిని తింటే స్థూలకాయం కలిగి, షుగర్ బారిన పడబోతున్నవారు ఆ ప్రమాదాన్ని నిలువరించగలరు. షుగర్ ఉన్నవారు ఈ సీజన్‌లో రెగ్యులర్‌గా యాభై నుంచి డెబ్బయి గ్రాముల వరకూ తీసుకోవచ్చు. నేరేడులోని గ్యాలిక్ యాసిడ్, యాంతోసైనిన్స్ ఇన్సులిన్‌ను ఉత్సాహపరుస్తాయి. మందకొడితనాన్ని వదిలిస్తాయి.

పరిశోధనల్లో తేలింది

అమెరికాలో 2010లో ఒక్లహోమా స్టేట్ యూనివర్సిటీ జరిపిన పరిశోధనలో నేరేడు పండ్లు 8 వారాల పాటు రెగ్యులర్‌గా తగిన మోతాదులో తీసుకుంటే బ్యాడ్ కొలస్ట్రాల్ నశిస్తుందని తేలింది. 2012లో హార్వర్డ్ యూనివర్సిటీ వారు నేరేడుపండ్ల మీద పరిశోధన చేసి 12 వారాలు వాటిని రెగ్యులర్‌గా తిన్న వారిలో మెదడు కణాలు ఉత్తేజితం కావడం ఆయుష్మంతం కావడం గమనించారు. తెలివితేటల్ని పెంచే కణాలు నేరేడు వల్ల వృద్ధి చెందుతున్నాయని నిర్ధారించారు. నేరేడులోని డెల్ఫిలిడిన్ అనే పదార్థం బ్రెస్ట్ క్యాన్సర్‌ను నివారిస్తుంది.



కాయ, చెట్టు, ఆకు

నేరేడు కాయ, చెట్టు, ఆకు అన్నీ కూడా ఏదో విధంగా శరీరానికి, ఆరోగ్యానికి ఉపయోగపడేవే. నేరేడు పండ్లు తింటే నోటి అల్సర్లు తగ్గుతాయి. దంతాలు, చిగుళ్లకు మంచిది. నేరేడు గుజ్జును తీసి ముఖానికి పట్టించుకుంటే ముఖచర్మం ఆరోగ్యవంతం అవుతుంది. నేరేడు పళ్ల జ్యూస్ అరికాళ్ల మంటలు తగ్గిస్తుంది. నేరేడులో విటమిన్ సి ఎక్కువ కనుక వానలు మొదలయ్యాక వచ్చే జలుబు, దగ్గు వంటి వాటికి మంచి మందుగా ఉపయోగపడుతుంది.

నేరేడు ఈ సీజన్‌కు రేడు. ఆస్వాదించండి.

మీలో ఏకాగ్రత ఎంత?

ఏకాగ్రత లేకుండా చదవడం లేదా ఏ పనినైనా చేయడం అంటే చిల్లికుండలో నీళ్లు నింపడం లాంటిదే.ఏకాగ్రత లేకుండా చేసే పనివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. అయితే కొందరిలో ఎంత ప్రయత్నించినా ఏకాగ్రత ఉండదు. అలా ఏకాగ్రత లేకపోవడానికి మానసిక, శారీరక సమస్యలు కారణం కావచ్చు. ఇంకొంతమందికి ఎక్కువ సమయం ఒకే విషయం మీద ఫోకస్ చేసినా ఏకాగ్రత లోపిస్తుంది. నిద్రలేమి, ఇన్ఫెక్షన్లు, డిప్రెషన్ మొదలైన ఆరోగ్య సమస్యలు కూడా కారణాలు కావచ్చు.



ఏకాగ్రత ఉంటేనే ఏ పనినైనా సాధించగలం. అందుకే ఏకాగ్రత పెంచుకోవడం అందరికీ అవసరం. ముఖ్యంగా విద్యార్థులకు చాలా అవసరం. అందుకోసం ఏం చేయాలో చూద్దాం.

ఏకాగ్రత పెరగాలంటే...

ముందు మనం విద్యార్థుల కోసం చెప్పుకుందాం...

▶ చదువుకునేందుకు మంచి వాతావరణాన్ని సృష్టించుకోవాలి. టీవీ, ఫోన్, కంప్యూటర్, మ్యూజిక్ ప్లేయర్‌కి దూరంగా ఉండాలి. ▶ స్పష్టమైన లక్ష్యాన్ని పెట్టుకోవాలి. ▶ ఏ పనికి ఎంత సమయం కేటాయించాలో పక్కా ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. మల్టీ టాస్కింగ్ ఎప్పుడూ చేయకూడదు. ▶ స్టడీసెషన్స్‌కు నలభైనుంచి యాభై నిమిషాలకంటే ఎక్కువ సమయం కేటాయించొద్దు. అలసిపోకుండా ఉండేందుకు మధ్యమధ్యలో విరామం అవసరం. ▶ మనసును ప్రశాంతంగా ఉంచుకోవాలి. బాధలను, ఆందోళనలను మర్చిపోవాలి. ▶ చదువుతున్నప్పుడు ముఖ్యమైన పాయింట్స్‌ను, టాపిక్స్‌ను నోట్ చేసుకోవాలి. అవసరమైనప్పుడు వాటిని రిఫర్ చేసుకోవాలి.

యోగా, ధ్యానం మొదలైన టెక్నిక్స్ ఉపయోగపడతాయి.

ఎస్‌క్యూ3ఆర్ పద్ధతి

ఎస్ (సర్వే): చదివిన దాంట్లో ముఖ్యమైనవి ఒక సర్వే పుస్తకంలో రాసుకోవాలి. టైటిల్స్, సబ్-టైటిల్స్, క్యాప్షన్స్ లాంటివి రిఫరెన్స్‌కి బాగా తోడ్పడతాయి.

క్యూ (క్వశ్చన్): పుస్తకంలో నోట్ చేసుకోవడం, చదవడం పూర్తయ్యాక క్వశ్చన్స్ వేసుకోవడం అలవాటు చేసుకోవాలి.

ఆర్ 1 (రీడ్): చాప్టర్ పూర్తవగానే క్వశ్చన్, దానికి సరైన జవాబును తెలుసుకొని చదువుకోవాలి. అలా చదివితే మర్చిపోవడం అంటూ జరగదు.

ఆర్ 2 (రిసైట్): చదివిన వాటిని తిరిగి ప్రశ్నించుకుంటూ వాటి జవాబులను గుర్తు చేసుకోవాలి. సొంతంగా జవాబులను తయారు చేసుకోవాలి. అవసరమైతే ముందు రాసుకున్న నోట్స్ తీసి చూడాలి.

ఆర్ 3 (రివ్యూ): చదివిన తర్వాత అవన్నీ మెదడులో తాజాగా ఉండాలంటే మళ్లీ మళ్లీ చదవాలి.

మామూలుగా అందరూ కంటితో చూస్తూ చదువుతారు. ఒకటి కంటే ఎక్కువ ఇంద్రియాల ప్రమేయం చదివే ప్రక్రియలో మనం భాగం చేయగలిగితే ఏకాగ్రత మెరుగవుతుంది.

1) పైకి చదవడం- చదువుతున్నది చెప్పడమే కాకుండా వింటాం కూడా.

2) చదివేది పుస్తకంలో క్లుప్తంగా రాయడం.

3) ఇప్పుడు చాలా రకాలైన పుస్తకాలు, పిడిఎఫ్ లు చదివి వినిపించే ఆప్స్ ఉన్నాయి. కుదిరితే ఇలా వింటూ, చూస్తూ, ఒక నోటు పుస్తకంలో ముఖ్యమైన వాటిని రాసుకుంటూ చదివితే ఏకాగ్రత కోల్పోవడం తగ్గుతుంది.

మన ఏకాగ్రతకు భంగం కలిగించే వస్తువులు (సెల్ ఫోను), వ్యక్తులను చదువుతున్నప్పుడు దూరం పెట్టాలి.

వీలయినంత వరకు చదవడానికి ఒక ప్రదేశం (లైబ్రరీ, ఇంటి లో ఒక గది) నిర్ణయించుకుని అక్కడే ప్రతిరోజు చదివితే, మన బుర్రలో అది స్థిరపడి, ఆ ప్రదేశానికి వెళ్లిన వెంటనే వేరే ఆలోచనలు తక్కువవుతాయి. కొంతమంది ఎక్కువసేపు ఒకచోట కూర్చోలేరు. అలాంటివారు 3-4 చోట్ల మధ్య మారుతూ మెల్లగా అలవాటు చేసుకోవచ్చు.

చదివే వ్యాసాలను ఫ్లో- చార్ట్స్, డయాగ్రమ్స్‌గా నోటు పుస్తకాలలో రాసుకుంటే బాగా గుర్తుంటాయి.

ఇవన్నీ చాలా చిన్న విషయాలుగా అనిపించినా తేలిగ్గా తీసుకోకుండా వాటిని పాటించడం వలన ఏకాగ్రత మెరుగుపరచుకోవచ్చు.



'జంక్'ను జంకేలా చేద్దాం!

బేకరీ లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, చాట్ బండ్లు... ఎక్కడ చూసినా ఎక్కువ శాతం టీనేజర్లే కనిపిస్తూ ఉంటారు. అంతకంటే చిన్న పిల్లలకు స్వయంగా తల్లిదండ్రులే మురిపెంగా తీసుకువెళ్లి తినిపిస్తుంటారు. అయితే బర్గర్లు, పిజ్జాలు, చాట్‌లు, మిల్క్ షేక్స్, ఐస్‌క్రీమ్‌లు వంటివి తినటం వల్ల శరీరంలోకి అదనపు క్యాలరీలు చేరుతుంటాయి. వాటిని కరిగించటానికి సరిపడా వ్యాయామం లేక పిల్లలు ఊబకాయుల్లా తయారవుతున్నారు.

జంక్‌ఫుడ్‌కు అలవాటు పడకుండా ఉండాలంటే ఇంట్లోనే కొత్తరుచుల్లో స్నాక్స్ తయారు చేయటం నేర్చుకోవాలి. తక్కువ నూనె, తీపి, మసాలాలతో రుచికరమైన స్నాక్స్ చేసి పెడితే ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలు ఆకర్షితులవకుండా ఉంటారు.

★ అలాగే ఆహారంలో తగినంత పీచు పదార్థం ఉండేలా చూసుకుంటే ప్రొటీన్ ఫుడ్ వల్ల మలబద్ధకం తలెత్తకుండా ఉంటుంది. ★ అల్పాహారంలో బ్రెడ్ శాండ్‌విచ్‌లకు బదులు గోధుమ రవ్వతో చేసిన ఉప్మా, పెసలతో చేసిన పొంగల్, పెసరట్టు, రాగి, క్యారట్ ఇడ్లీ లాంటివి ఇవ్వాలి. ★ బాదం, పిస్తా, వాల్‌నట్స్, ఉడకబెట్టిన సెనగలు, మొలకలు అందుబాటులో ఉంచాలి. ★ ఫ్రిజ్ ట్రేలలో చాక్లెట్లు, బిస్కెట్లకు బదులు తాజా పండ్లు, సలాడ్లు, పాలు, గుడ్లు, పళ్లరసాలు, చెరుకు రసం, టమాటా రసం లాంటివి ఉండాలి. ★ పిల్లలు ఎక్కువగా ఆటలాడుతూ ఉంటారు కాబట్టి రోజూ గుప్పెడు డ్రై ఫ్రూట్స్ తినేలా చూసుకోవాలి. ★ ఉడికించిన సెనగలు, బొబ్బర్లు ఎక్కువ సమయంపాటు శక్తినిస్తాయి కాబట్టి ఔట్ డోర్ గేమ్స్ ఆడే పిల్లలకు వీటిని శ్నాక్స్‌గా ఇస్తూ ఉండాలి.

జంక్ ఫుడ్ నుంచి రక్షించుకోవాలంటే..?

పెద్ద వాళ్ళు జంక్ ఫుడ్స్ తింటూ, కాఫీలు, టీలు తాగేస్తుంటే వారిని చూస్తూ పెరిగే పిల్లలు అదే అలవాటు చేసుకుంటారు. అందువల్ల అలాంటి వాటిని ముందు పెద్దలు మానేయాలి. పెద్దవాళ్ళు పండ్లు, డ్రై ఫ్రూట్స్ తింటూ ఉంటే పిల్లలు కూడా అవే తింటారు. నిమ్మరసం, క్యారెట్ రసం, బీట్రూట్ రసం రోజూ తీసుకోండి. పిల్లలు కూడా అవే ఇష్టపడతారు.

సినిమా

మా చిన్న యువరాణి క్లీంకార

- చిరంజీవి



● అనిల్ కామినేని, శోభన, ఉపాసన, రామ్ చరణ్, సురేఖ, చిరంజీవి

హీరో రామ్‌చరణ్- ఉపాసన దంపతుల కుమార్తెకు క్లీంకార అని నామకరణం చేశారు. ఈ విషయాన్ని హీరో చిరంజీవి ట్విట్టర్ వేదికగా వెల్లడించి, ఫొటోలు షేర్ చేశారు. జూన్ 20న ఉపాసన ఓ పాపకి జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. పదకొండవ రోజు (జూన్ 30) నిర్వహించిన బారసాలలో పాపకు క్లీంకార కొణిదెల అని పేరు పెట్టారు. ''రామ్‌చరణ్-ఉపాసన దంపతుల కుమార్తెకు 'క్లీంకార కొణిదెల' అని నామకరణం చేశాం. లలితా సహస్ర నామం నుంచి ఈ పేరును తీసుకున్నాం. క్లీంకార అనే పదం ప్రకృతి స్వరూపాన్ని, అమ్మవారిలో నిక్షిప్తమైన శక్తిని సూచిస్తుంది. మా చిన్న యువరాణి ఇలాంటి లక్షణాలను ఇనుమడింపజేసుకుని ఉన్నత స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను'' అని చిరంజీవి పోస్ట్ చేశారు. క్లీంకార ఊయల్లో ఉండగా రామ్‌చరణ్-ఉపాసన దంపతులతో పాటు పాప తాతయ్యలు చిరంజీవి కొణిదెల, కామినేని అనిల్, నానమ్మ సురేఖ, అమ్మమ్మ శోభన కామినేని ఉన్న ఫొటోలను షేర్ చేశారు.

గౌరవమే స్వేచ్ఛ



● ధనుష్

ధనుష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కెప్టెన్ మిల్లర్'. ప్రియాంకా అరుళ్ మోహనన్, నివేదితా సతీష్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్, సందీప్ కిషన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో టీజీ త్యాగరాజన్ సమర్పణలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్, సెంథిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. 'గౌరవమే స్వేచ్ఛ' అనే క్యాప్షన్‌తో శుక్రవారం 'కెప్టెన్ మిల్లర్' ఫస్ట్ లుక్‌ను షేర్ చేశారు ధనుష్. ''స్వాతంత్ర్యానికి పూర్వం అంటే 1930-1940 నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ చిత్రంలో ధనుష్ మూడు గెటప్స్‌లో కనిపిస్తారు. ఆల్రెడీ 85 శాతం షూటింగ్ పూర్తయింది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సాక్షి సక్సెస్ అవ్వాలి

- దర్శకుడు వీవీ వినాయక్

శరణ్‌కుమార్ హీరోగా పరిచయమవుతోన్న చిత్రం 'సాక్షి'. జాన్వీర్ కౌర్ హీరోయిన్. శివకేశన కుర్తి దర్శకత్వంలో ఆర్యూ రెడ్డి, బేబీ లాలిత్య సమర్పణలో మునగాల సుధాకర్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం జూలై 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఈ సినిమా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేసిన దర్శకుడు వీవీ వినాయక్ మాట్లాడుతూ- ''విజయనిర్మలగారి ఫ్యామిలీ నుంచి శరణ్ హీరోగా వస్తున్నాడు. ఈ సినిమా పెద్ద విజయం సాధించి, శరణ్‌తో పాటు చిత్ర యూనిట్‌కి మంచి పేరు రావాలి'' అన్నారు. ''సాక్షి' అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అన్నారు శరణ్. ''యూనిట్ సభ్యులందరూ బాగా సహకరించారు'' అన్నారు శివ. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని విజయవంతం చేయాలి'' అన్నారు సుధాకర్‌రెడ్డి, ఆర్‌యూ రెడ్డి.



● శరణ్, వినాయక్

పుష్ప పార్టీ


పుష్పరాజ్ పార్టీ ఇస్తున్నాడు. ఈ పార్టీ సందడి ఎంత గ్రాండ్‌గా ఉంటుందనేది సిల్వర్ స్క్రీన్‌పైనే చూడాలట. హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప 2' సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో అల్లు అర్జున్, శ్రీవల్లీగా హీరోయిన్ రష్మికా మందన్నా నటిస్తున్నారు. 'పుష్ప' చిత్రంలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్' ఆల్రెడీ విడుదలై, ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం మలిభాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్, సుకుమార్. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని ఓ రిసార్ట్‌లో జరుగుతోందని తెలిసింది. అల్లు అర్జున్, రష్మికా మందన్నా పాల్గొనగా ఓ పాట చిత్రీకరిస్తున్నారని, సినిమాలో ఇది పార్టీ సాంగ్‌గా ఉంటుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ స్వరపరచిన ఈ పాటకు చంద్రబోస్ సాహిత్యం అందించారు.



● అల్లు అర్జున్

ముప్పైఏళ్లు వెనక్కి...

'అల్లరి' నరేశ్ మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లనున్నారు. 'అల్లరి' నరేశ్ హీరోగా సుబ్బు దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనుంది. ఈ చిత్రాన్ని రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించనున్నారు. జూన్ 30 (శుక్రవారం) 'అల్లరి' నరేశ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ చిత్రాన్ని ప్రకటించారు. 'అల్లరి' నరేశ్ కెరీర్‌లో ఇది 62వ సినిమా. ''ఈ చిత్రంలో నరేశ్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తారు. లవ్, ఎమోషన్, యాక్షన్, డ్రామా అంశాలతో 1990 నేపథ్యంలో ఈ సినిమా కథ ఉంటుంది. సెప్టెంబరు చివర్లో ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం. నాథన్.



● 'అల్లరి' నరేశ్

ఐదు రెట్ల వినోదం



● అక్షయ్ కుమార్

బాలీవుడ్ కిలాడి అక్షయ్ కుమార్ కెరీర్‌లో 'హౌస్‌ఫుల్' మూవీ ఫ్రాంచైజీది ప్రత్యేక స్థానం. అక్షయ్‌లోని కామెడీ స్టైల్‌ను ప్రేక్షకులకు పరిచయం చేసింది 'హౌస్‌ఫుల్' చిత్రాలే. ఇప్పటివరకూ 'హౌస్‌ఫుల్' ఫ్రాంచైజీ నుంచి వచ్చిన నాలుగు చిత్రాల్లో అక్షయ్ కుమార్, రితేష్ దేశ్‌ముఖ్‌లు నటించారు. తాజాగా 'హౌస్‌ఫుల్ 5'ని ప్రకటించారు. 'దోస్తానా', 'డ్రైవ్' సినిమాలకు దర్శకత్వం వహించిన తరుణ్ మన్సుఖాని 'హౌస్‌ఫుల్ 5' సినిమాను తెరకెక్కించనున్నారు. సాజిద్ నడియాడ్‌వాలా నిర్మించనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది దీపావళికి విడుదల కానుంది. ''ఐదు రెట్ల వినోదంతో 'హౌస్‌ఫుల్ 5'ను 2024 దీపావళికి విడుదల చేయనున్నాం'' అన్నారు అక్షయ్ కుమార్.

ప్రేక్షకుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటా

- నిఖిల్ సిద్ధార్థ్



● గ్యారీ, ఐశ్వర్యా మీనన్, నిఖిల్, చరణ్ తేజ్

''స్పై'కి నా కెరీర్‌లోనే ఎక్కువ ఓపెనింగ్స్ వచ్చాయి. మా సినిమాని ఇంతగా ఆదరించి, నా కెరీర్‌ని మరో మెట్టు పైకి ఎక్కిస్తూ మంచి ఓపెనింగ్స్ ఇచ్చిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఇకపైనా మరిన్ని మంచి చిత్రాలు ఇస్తానని మాట ఇస్తున్నా'' అని నిఖిల్ సిద్ధార్థ్ అన్నారు. గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో నిఖిల్ సిద్ధార్థ్, ఐశ్వర్యా మీనన్ జంటగా నటించిన చిత్రం 'స్పై'. కె. రాజశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా జూన్ 29న విడుదలైంది. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సక్సెస్ మీట్‌లో ఈడీ ఎంటర్‌టైన్‌మెంట్స్ సీఈఓ చరణ్ తేజ్ మాట్లాడుతూ-''స్పై'కి ఇంత పెద్ద ఓపెనింగ్స్ (రూ. 11 కోట్ల 7లక్షలు) రావడం హ్యాపీగా ఉంది. డిస్ట్రిబ్యూటర్స్ సంతోషంగా ఉన్నారు'' అన్నారు. ''మాకు ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు గ్యారీ బీహెచ్.

రెండో భాగం కూడా హిట్ కావాలి

- వరుణ్ తేజ్



● రాజేష్, వరుణ్ తేజ్, కామాక్షి

''రాజేష్ నటించిన 'మా ఊరి పొలిమేర' బాగా నచ్చింది. దానికి సీక్వెల్‌గా రూపొందిన 'మా ఊరి పొలిమేర-2' టీజర్ ఆసక్తిగా ఉంది. మొదటి భాగం కంటే రెండో భాగం పెద్ద హిట్ కావాలి'' అన్నారు హీరో వరుణ్ తేజ్. 'సత్యం' రాజేష్, కామాక్షి భాస్కర్ల లీడ్ రోల్స్‌లో డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మా ఊరి పొలిమేర-2'. గౌరు గణబాబు సమర్పణలో గౌరీకృష్ణ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ను వరుణ్ తేజ్ రిలీజ్ చేశారు. ''ఈ నెలాఖరులో లేక ఆగస్ట్ మొదటి వారంలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు గౌరీకృష్ణ. ''ఓ హత్య నేపథ్యంలో సాగే చిత్రమిది'' అన్నారు అనిల్ విశ్వనాథ్. ''నటుడుగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది'' అన్నారు 'సత్యం' రాజేష్.

స్లమ్ డాగ్ హస్బెండ్



● సంజయ్, కల్యాణ్ రామ్

నటుడు బ్రహ్మాజీ తనయుడు, 'పిట్టకథ' మూవీ ఫేమ్ సంజయ్ రావ్ హీరోగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హస్బెండ్'. ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ప్రణవి మానుకొండ హీరోయిన్. అప్పిరెడ్డి, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని హీరో కల్యాణ్ రామ్ విడుదల చేసి, సినిమా మంచి విజయం సాధించాలన్నారు. ''చక్కని కమర్షియల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

అలా.. ఇలా



● పూర్ణ, శక్తి వాసుదేవ్

ప్రముఖ దర్శకుడు పి. వాసు తనయుడు శక్తి వాసుదేవన్ హీరోగా రాజ్ శంకర్, పూర్ణ, బ్రహ్మానందం, అలీ తదితరులు ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'అలా ఇలా ఎలా'. రాఘవ దర్శకత్వంలో కొల్లకుంట నాగరాజు నిర్మించారు. మణిశర్మ స్వరపరచిన ఈ చిత్రం పాటల ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ ఆడియోను రిలీజ్ చేశారు. ''మంచి సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు ఎస్‌కెఎమ్ఎల్ మోషన్ పిక్చర్స్ అధినేత ఆదినారాయణ. ''ఈ నెల 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు కొల్లకుంట నాగరాజు.

బ్రహ్మచారి తిప్పలు

గుంట మల్లేశం, స్వప్న సిరి జంటగా నర్సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'బ్రహ్మచారి'. బి. రాంభూపాల్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం పాటలు, టీజర్‌ని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ రిలీజ్ చేశారు. ''తెలంగాణలోని బ్రహ్మచారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు? అనే కథతో రూపొందించిన చిత్రమిది'' అన్నారు రాంభూపాల్ రెడ్డి. ''దుబాయ్ వెళ్లొచ్చిన ఓ అబ్బాయి పెళ్లి చేసుకుందామనుకున్న టైమ్‌లో అమ్మాయి దొరక్క ఎలాంటి ఇబ్బందులు పడ్డాడు? అనేదే ఈ చిత్రకథ'' అన్నారు నర్సింగ్.



● మల్లేశం,స్వప్న

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	803	64,718
నిఫ్టీ ▲	216	19,189

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,802	▲	211
డోజోన్స్	34,446	▲	323
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,532	▲	60
డాక్స్	16,148	▲	90
షాంఘై	3,202	▲	20
నికాయ్	33,169	▼	64

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	58,055
బంగారం (99.5 స్వచ్ఛత)	57,823
వెండి (కేజీ)	68,429

మౌలిక రంగం వృద్ధి మేలో 4.3 శాతం



న్యూఢిల్లీ: ఎనిమిది మౌలిక పరిశ్రమల గ్రూప్ మే నెల్లో 4.3 శాతం వృద్ధిరేటును నమోదుచేసుకుంది. ఏప్రిల్‌లో కూడా ఇదే స్థాయిలో వృద్ధిరేటు నమోదు కాగా, 2022 మేలో పోల్చితే ఇది భారీ తగ్గుదల. 2022 మేలో కీలక రంగం వృద్ధిరేటు 19.3 శాతం. 2022 మే నెల్లో ఈ స్థాయి భారీ (19.3 శాతం) పురోగతికి 2021 కరోనా కాలంనాటి బేస్ ఎఫెక్ట్ కారణం. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి (ఐఐపీ)లో ఈ ఎనిమిది రంగాల వాటా 40.27 శాతం. ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం, ఎనిమిది రంగాలనూ వేర్వేరుగా చూస్తే, క్రూడ్ ఆయిల్ (మైనస్ 1.9 శాతం), సహజ వాయువులు (మైనస్ 0.3 శాతం), విద్యుత్ (మైనస్ 0.3 శాతం) ఉత్పత్తిలో అసలు వృద్ధిలేకపోగా క్షీణత నమోదయ్యింది. బొగ్గు ఉత్పత్తి వృద్ధి రేటు 7.2 శాతంగా నమోదయ్యింది. రిఫైనరీ ప్రొడక్టుల వృద్ధిరేటు 2.8 శాతంగా ఉంది. ఎరువులు, స్టీల్, సిమెంట్ వృద్ధిరేట్లు వరుసగా 9.7 శాతం, 9.2 శాతం, 15.5 శాతాలుగా నమోదయ్యాయి. ఇదిలావుండగా, ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో మౌలిక రంగం వృద్ధి రేటు 4.3 శాతంగా నమోదయ్యింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఈ పురోగతి రేటు 14.3 శాతం.

పోస్టాఫీసు పొదుపు పథకాల రేట్ల పెంపు

- ఎక్కువ పథకాల్లో రేట్లు యథాతథం
- కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటన



న్యూఢిల్లీ: చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లను కేంద్రం సవరించింది. జూలై 1 నుంచి మొదలయ్యే మూడు నెలల కాలానికి తాజా రేట్లను ప్రకటించింది. కొన్నింటి పథకాల రేట్లను 0.3 శాతం వరకు పెంచగా, చాలా పథకాల్లో రేట్లను యథాతథంగా కొనసాగించింది.

- ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ)పై ప్రస్తుతం 6.2 శాతంగా ఉన్న రేటు పెంపు అనంతరం 6.5 శాతంగా మారింది.
- ఏడాది కాల టర్మ్ డిపాజిట్‌పై 0.1 శాతం పెరిగి 6.9 శాతానికి చేరగా, రెండేళ్ల టైమ్ డిపాజిట్ రేటు 6.9 శాతం నుంచి 7 శాతానికి చేరుకుంది.
- మూడేళ్ల టర్మ్ డిపాజిట్ (7%), ఐదేళ్ల టర్మ్ డిపాజిట్ (7.5%) రేట్లలో మార్పు చేయలేదు.
- అలాగే పీపీఎఫ్ వడ్డీ రేటు సైతం ఎలాంటి మార్పుల్లేకుండా 7.1 శాతంగా, సేవింగ్స్ డిపాజిట్ రేటు 4 శాతంగా కొనసాగనుంది.
- నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్‌ఎస్‌సీ) రేటు 7.7 శాతం, సుకన్య సమృద్ధి యోజన రేటు 8 శాతంలోనూ మార్పు చేయలేదు.
- సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ 8.2%, కిసాన్ వికాస్ పత్రం రేటు 7.5% కొనసాగనుంది.
- నెలవారీ ఆదాయ పథకం (ఎంఐఎస్) రేటు 7.4 శాతంగా కొనసాగుతుంది.

పెంపు ఆగినట్టేనా?

జనవరి–మార్చి, ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి పొదుపు పథకాలపై రేట్లను పెంచింది. దీంతో ఈ విడత కేవలం 3 పథకాలు మినహా మిగిలిన వాటి రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ సైతం గత సమీక్షల్లోనూ వడ్డీ రేట్లను మార్చలేదు.

ఇక బ్యాంకుల్లోనూ మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ స్కీమ్

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్, 2023 స్కీమ్ ఇక ప్రభుత్వ రంగ, ప్రైవేటు బ్యాంకుల్లోనూ అందుబాటులోకి రానుంది. ఆర్థిక వ్యవహారాల శాఖ ఈ మేరకు ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. బాలికలు, మహిళల ఆర్థిక భద్రత లక్ష్యంగా 2023 ఏప్రిల్ నుంచి ఈ పథకం పోస్టాఫీసుల్లో మాత్రమే అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ పథకం కింద చేసిన డిపాజిట్ సంవత్సరానికి 7.5 శాతం వడ్డీని కలిగి ఉంటుంది. త్రైమాసిక చక్రవడ్డీని కలుపుకుంటే 7.7% వడ్డీ వరకూ ప్రయోజనం లభిస్తుంది. కనిష్టంగా రూ. 1,000– గరిష్టంగా రూ.2,00,000 వరకూ డిపాజిట్ చేయవచ్చు. మెచ్యూరిటీ వ్యవధి రెండేళ్లు.

సైయంట్ డీఎల్ఎం ఐపీవో హిట్

67 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్



న్యూఢిల్లీ: ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ సర్వీసుల కంపెనీ సైయంట్ డీఎల్ఎం పబ్లిక్ ఇష్యూ సూపర్ సక్సెస్ అయ్యింది. చివరి రోజు శుక్రవారాని(30)కల్లా ఇష్యూ 67 రెట్లు అధికంగా సబ్‌స్క్రిప్షన్ సాధించింది. కంపెనీ 1,33,32,297 షేర్లను ఆఫర్ చేయగా.. 89,73,16,952 షేర్ల కోసం బిడ్స్ దాఖలయ్యాయి. ఎన్‌ఎస్ఈ గణాంకాల ప్రకారం అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 90.4 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల కోటాలో 45 రెట్లు అధికంగా బిడ్స్ లభించాయి. ఇక రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి సైతం 49 రెట్లుపైగా దరఖాస్తులు వెల్లువెత్తడం గమనార్హం! వెరసి షేరుకి రూ. 250–265 ధరల శ్రేణిలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 592 కోట్లు సమీకరించింది. హైదరాబాద్ ఐటీ కంపెనీ సైయంట్‌కు అనుబంధ సంస్థ ఇది.

ఐడియాఫోర్జ్ ఐపీవోకు క్యూ

డ్రోన్ తయారీ కంపెనీ ఐడియాఫోర్జ్ టెక్నాలజీ పబ్లిక్ ఇష్యూ బంపర్ సక్సెస్‌ను అందుకుంది. చివరి రోజు శుక్రవారాని(30)కల్లా ఇష్యూ ఏకంగా 106 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్‌ను సాధించింది. కంపెనీ 46,48,870 షేర్లను ఆఫర్ చేయగా.. 49,30,29,570 షేర్లకు బిడ్స్ దాఖలయ్యాయి.

రెండోరోజూ రికార్డుల హోరు

ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త గరిష్టాల నమోదు
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల అండ
- మెటల్ షేర్లకు మాత్రమే నష్టాలు
- ఇన్వెస్టర్ల సంపద ఆల్‌టైం హైకి
- సెన్సెక్స్ లాభం 803 పాయింట్లు
- 216 పాయింట్లు పెరిగిన నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్లో రెండోరోజూ రికార్డుల హోరు కొనసాగింది. అధిక వెయిటేజీ ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం, రిలయన్స్ ఇండస్ట్రీస్, టీసీఎస్ షేర్లు మూడు శాతం ర్యాలీ చేసి సూచీలను పరుగులు పెట్టించాయి. పటిష్ట ఆర్థిక వ్యవస్థ సంకేతాలు, విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ అంశాలు సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి. మెటల్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సెన్సెక్స్ 803 పాయింట్లు పెరిగి 64,718 వద్ద, నిఫ్టీ 216 పాయింట్లను ఆర్జించి 19,189 వద్ద స్థిరపడ్డాయి. ఈ ముగింపు స్థాయిలు సూచీలకు కొత్త జీవితకాల గరిష్టాలు కావడం విశేషం. సెన్సెక్స్ 30 షేర్లగానూ ఐసీఐసీఐ(0.33%), ఎన్‌టీపీసీ (0.11%) మాత్రమే నష్టపోయాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.6,397 కోట్లు, దేశీయ ఇన్వెస్టర్లు రూ. 1,198 కోట్ల ఈక్విటీలను కొన్నారు. ఈ వారం మొత్తం మీద సెన్సెక్స్ 1,739 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ 524 పాయింట్లను ఆర్జించింది. ఇక ఈ ఏడాది ప్రథమార్థంలో బుల్ పరుగులు పెట్టింది. గడిచిన ఆరు నెలల్లో సెన్సెక్స్ 3,913 పాయింట్లు, నిఫ్టీ 1,084 పాయింట్లు(దాదాపు 6%) లాభపడ్డాయి.

ఇంట్రాడేలోనూ కొత్త గరిష్టాలు

ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. సెన్సెక్స్ 153 పాయింట్లు లాభంతో 64 స్థాయిపై 64,068 వద్ద మొదలైంది. నిఫ్టీ 105 పాయింట్లు బలపడి 19 వేల స్థాయి ఎగువన 19,077 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఐటీ, ఆటో, బ్యాంకింగ్, ఆర్థిక రంగాల షేర్లను కొనేందుకు ఆసక్తి చూపారు. ఫలితంగా ట్రేడింగ్ సెన్సెక్స్ 853 పాయింట్లు ఎగసి 64,769 వద్ద, నిఫ్టీ 229 పాయింట్ల దూసుకెళ్లి 19,202 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- జూన్ వాహన విక్రయ గణాంకాల వెల్లడి(నేడు)కి ముందు ఆటో షేర్లకు డిమాండ్ నెలకొంది. ఎంఅండ్‌ఎం 4%, హీరోమోటో, మారుతీ, బజాజ్ ఆటో, టాటా మోటార్స్ షేర్లు 3–1% చొప్పున రాణించాయి. నిఫ్టీ ఆటో ఇండెక్స్ 15182 స్థాయి వద్ద ఆల్‌టైం హైని అందుకుంది.
- ఇన్ఫోసిస్, టీసీఎస్ షేర్లు 3% చొప్పున లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు రెండుశాతం వరకు పెరిగాయి. బీఎస్ఈ ఐటీ ఇండెక్స్ 2.50% ర్యాలీ చేసింది.
- ప్రభుత్వరంగ పంజాబ్ సింధ్ బ్యాంక్ 6%, ఇండియన్ బ్యాంక్ 5%, బ్యాంక్ ఆఫ్ బరోడా 3% షేర్లు చొప్పున పెరిగాయి. పీఎస్‌బీ, కెనరా బ్యాంక్, ఎస్‌బీఐ బ్యాంకు షేర్లు 2–1% లాభపడ్డాయి.

మూడురోజుల్లో రూ. 5.80 లక్షల కోట్లు

సూచీల రికార్డుల ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపద జీవితకాల గరిష్టానికి చేరుకుంది. గడిచిన మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,749 పాయింట్లు బలపడటంతో బీఎస్ఈ ఎక్స్ఛేంజీలో రూ.5.80 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. శుక్రవారం ఒక్కరోజే ఇన్వెస్టర్లు రూ.2.36 లక్షల కోట్లను ఆర్జించారు. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవితకాల రికార్డు స్థాయి రూ.294.49 లక్షల కోట్లకు చేరింది.

విలీనంతో పలు ప్రయోజనాలు

- హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్

న్యూఢిల్లీ: రెండు దిగ్గజాల విలీనం తదుపరి పలు ప్రయోజనాలు చేకూరనున్నట్లు మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ చైర్మన్ దీపక్ పరేఖ్ పేర్కొన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విలీనం ద్వారా గ్రూప్ కంపెనీలు మరింత పటిష్టపడనున్నట్లు తెలియజేశారు. అమ్మకాలు, నిర్వహణ(ఎగ్జిక్యూషన్), భారీ అవకాశాలు వంటి అంశాలు లబ్ధిని చేకూర్చనున్నట్లు వివరించారు. నేటి(జూలై 1) నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో హెచ్‌డీఎఫ్‌సీ విలీనంకానుంది. దీంతో గృహ రుణాల దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీకి 46 ఏళ్లుగా సేవలందించిన పరేఖ్‌కు శుక్రవారం చివరి పని దినంగా మారనుంది. దీంతో వాటాదారులకు చివరి సందేశాన్ని వినిపించారు. బ్యాంకుగల కీలక సమర్థతలు గృహ రుణ విభాగానికి మరింత బలాన్ని అందించనున్నట్లు అభిప్రాయపడ్డారు. గృహ రుణ వినియోగదారుల్లో నిలకడను తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. బ్యాంక్‌కుగల డిజిటైజేషన్ ప్లాట్‌ఫామ్‌లతోపాటు.. భారీ పంపిణీ నెట్‌వర్క్ గృహ రుణాలతోపాటు.. గ్రూప్ కంపెనీలకూ ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు వివరించారు.

విలీనంలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ వాటాదారులకు తమవద్ద గల ప్రతీ 25 షేర్లకు గాను 42 హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు షేర్లు కేటాయించనున్న సంగతి తెలిసిందే. 40 బిలియన్ డాలర్ల విలువైన షేర్ల మార్పిడి ద్వారా చోటుచేసుకుంటున్న విలీనం దేశీ కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద లావాదేవీగా నిలవనుంది. హెచ్‌డీఎఫ్‌సీ విలీనం సంస్థ రూ. 18 లక్షల కోట్ల ఆస్తులతో ఫైనాన్షియల్ సర్వీసుల రంగంలో భారీ దిగ్గజంగా ఆవిర్భవించనుంది.



విలీనానికి బోర్డుల గ్రీన్‌సిగ్నల్

ఫైనాన్షియల్ రంగ దిగ్గజాలు హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు విలీనానికి రెండు సంస్థల బోర్డులూ ఆమోదముద్ర వేశాయి. దీంతో నేటి(జూలై 1) నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ విలీనంకానుంది.

కాగా, బీమా రంగ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గోలో మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ తాజాగా 0.5097% వాటాను కొనుగోలు చేసింది. దీంతో వాటాను 50.5 శాతానికి పెంచుకుంది. తద్వారా హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గోను అనుబంధ సంస్థగా మార్చుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో విలీనానికి వీలుగా తాజా కొనుగోలు చేపట్టినట్లు హెచ్‌డీఎఫ్‌సీ పేర్కొంది.

వారాంతాన బీఎస్ఈలో హెచ్‌డీఎఫ్‌సీ షేరు 1.5 శాతం లాభపడి రూ. 2,822 వద్ద నిలవగా.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సైతం 1.5 శాతం పుంజుకుని రూ. 1,702 వద్ద స్థిరపడింది.



'పార్కిన్సన్స్'కు గురైన అలెన్ బోర్డర్

ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ అలెన్ బోర్డర్ తాను 'పార్కిన్సన్స్' వ్యాధితో బాధపడుతున్నట్లు మొదటిసారి ప్రకటించాడు. తాను ఏడేళ్ల క్రితం దీనికి గురయ్యానని, అయితే ఎవరూ తనపై జాలి చూపించరాదని ఇప్పటి వరకు చెప్పలేదన్నాడు. నాడీ వ్యవస్థపై ప్రభావం పడే కారణంగా శారీరక కదలికలు సాధారణంగా లేకపోవడం ఈ వ్యాధి లక్షణం. 'ఇది తెలిస్తే జనం ఎలా స్పందిస్తారో తెలీదు. బాధపడతారా లేదా ఓదారుస్తారా చెప్పలేం. అయితే ఎప్పుడో ఒకసారి తెలుస్తుంది కాబట్టి ఇప్పుడు చెబుతున్నా' అని బోర్డర్ వెల్లడించాడు. 68 ఏళ్ల బోర్డర్ తాను 80 ఏళ్లు జీవించగలిగితే అదే చాలా గొప్పగా భావిస్తానని, మరో 'సెంచరీ' సాధించలేనని మాత్రం కచ్చితంగా చెప్పగలనని భావోద్వేగంతో అన్నాడు. 156 టెస్టుల్లో 11,174 పరుగులు... 273 వన్డేల్లో 6524 పరుగులు చేసిన అలెన్ బోర్డర్ రెండు ఫార్మాట్‌లలో కలిపి 30 సెంచరీలు, 99 అర్ధసెంచరీలు సాధించాడు. అతని నాయకత్వంలోనే ఆస్ట్రేలియా 1987లో తొలిసారి వన్డే వరల్డ్‌కప్‌ను గెలుచుకుంది.



ఆసియా కబడ్డీ చాంప్ భారత్

ఫైనల్లో ఇరాన్‌పై గెలుపు

బుసాన్ (కొరియా): డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల కబడ్డీ జట్టు ఆసియా చాంపియన్‌షిప్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. శుక్రవారం జరిగిన హోరాహోరీ ఫైనల్ పోరులో భారత్ 42–32తో ఇరాన్‌పై ఘన విజయం సాధించింది. ఈ కాంటినెంటల్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కిది ఎనిమిదో ఆసియా టైటిల్ కావడం విశేషం. ఇరాన్ ఆధిపత్యంతో మ్యాచ్ మొదలైంది. కానీ ఆ తర్వాత మ్యాచ్ సాగే కొద్దీ భారత ఆటగాళ్లే పట్టు బిగించారు. దీటుగా భారత డిఫెండర్లు బదులివ్వడంతో పుంజుకుంది. కెప్టెన్ పవన్ సెహ్రావత్ చక్కగా రాణించాడు. క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టాడు. ఇరాన్ ఆలౌట్ కావడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో తొలి ఆలౌట్ సమయానికి 10–4 స్కోరుతో భారత్ పైచేయి సాధించింది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి భారత ఆటగాళ్ల ఆల్‌రౌండ్ షోకు ఇరాన్ మరోసారి ఆలౌటైంది. దీంతో 23–11తో ఎదురులేని ఆధిపత్యాన్ని సాధించింది. ఇరానియన్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా చియానె కీలకమైన పాయింట్లతో జట్టును ఆదుకున్నాడు. అయితే భారత ఆటగాళ్ల సమష్టి ప్రదర్శన ముందు అతని పోరాటం నిలువలేకపోయింది. దీంతో మూడో సారి ఇరాన్ ఆలౌట్ కావడంతో భారత్ 33–14తో మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది. అయితే ద్వితీయార్ధంలో ఇరాన్ ఆటగాళ్లు గట్టిపోటీ ఇవ్వడంతో భారత్ ఆధిక్యం తగ్గింది. కానీ ఫలితంలో ఏ మార్పులేకపోయింది. చివరకు భారత్ 42–32తో మ్యాచ్‌ను ముగించి ఆసియా చాంపియన్‌గా నిలిచింది. క్రితం సారి 2017లో ఇరాన్ ఆతిథ్యమిచ్చిన ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత్ తుది పోరులో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌ను చిత్తు చేసింది. భారత్ టైటిల్ నిలబెట్టుకోవడంపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) హర్షం వ్యక్తం చేసింది. 'కుర్రాళ్లు అద్భుతంగా ఆడారు. ఇరాన్‌ను సమష్టిగా దెబ్బతీసి మళ్లీ విజేతగా నిలిచారు' అని ట్విట్టర్‌లో పోస్ట్ చేసింది.

సెమీస్‌లో శ్రీజ ద్వయం

జాగ్రెబ్: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) టోర్నమెంట్ మహిళల డబుల్స్‌లో ఆకుల శ్రీజ జోడి సెమీ ఫైనల్లోకి అడుగు పెట్టింది. భారత్‌కు చెందిన శ్రీజ – దియా చిటాలే ద్వయం క్వార్టర్ ఫైనల్లో 3–2 (9–11, 12–10, 11–7, 5–11, 11–8) స్కోరుతో గ్లిన్ రూ వాంగ్ – జియాన్ జెంగ్ (సింగపూర్)పై విజయం సాధించింది. 39 నిమిషాల పాటు ఈ పోరు హోరాహోరీగా సాగింది. తొలి గేమ్‌ను చేజార్చుకున్నా ఆ తర్వాత చెలరేగిన శ్రీజ – దియా 2–1తో ముందంజ వేసింది. ఆ తర్వాత సింగపూర్ కోలుకున్నా... చివరి గేమ్‌లో భారత జంటదే పైచేయి అయింది. మహిళల సింగిల్స్‌లో భారత టాప్ క్రీడాకారిణి మనికా బాత్రా ప్రిక్వార్టర్స్‌కు చేరింది. తొలి రౌండ్‌లో మనిక 3–1 (6–11, 11–6, 11–3, 11–1)తో హనా అపరోవిచ్ (క్రొయేషియా)పై గెలుపొందింది.

శ్రీలంక గట్టెక్కింది...

- సూపర్ సిక్స్‌లో నెదర్లాండ్స్‌పై గెలుపు
- వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్



ధనంజయ

బులవాయో: నెదర్లాండ్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో మాజీ చాంపియన్ శ్రీలంక గెలిచింది... కానీ గెలిచేందుకు చాలా కష్టపడింది. వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో శుక్రవారం జరిగిన తొలి సూపర్ సిక్స్ పోరులో లంక 21 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లంక 47.4 ఓవర్లలో 213 పరుగులకే ఆలౌటైంది. కరుణరత్నే (51 బంతుల్లో 33; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించగా, నిసాంక (0), కుశాల్ మెండిస్ (10), సమరవిక్రమ (1), అసలంక (2) విఫలమయ్యారు. ఒక దశలో జట్టు 67 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ స్థితిలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ధనంజయ డిసిల్వా (111 బంతుల్లో 93; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒంటరి పోరాటంతో జట్టును ఆదుకున్నాడు. హసరంగ (21 బంతుల్లో 20; 1 ఫోర్, 1 సిక్స్), తీక్షణ (47 బంతుల్లో 28; 1 ఫోర్) అండతో జట్టు స్కోరును 200 పైచిలుకు పరుగులకు దాటించాడు. నెదర్లాండ్స్ బౌలర్లలో లోగన్ వాన్‌బిక్ (3/26), బాస్ డి లీడ్ (3/42) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో లంకను ఉక్కిరిబిక్కిరి చేశారు. తర్వాత 214 పరుగుల లక్ష్యం సులభమైందే కానీ లంక బౌలర్లు ప్రత్యర్థిని నిలువరించగలిగారు. దీంతో నెదర్లాండ్స్ 40 ఓవర్లలో 192 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు విక్రమ్‌జీత్ (0), మ్యాక్స్ ఓ డౌడ్ (0), తేజ నిడమనూరు (0) ఖాతా తెరువలేదు. వెస్లీ బరెసి (50 బంతుల్లో 52; 6 ఫోర్లు, 1 సిక్స్), బస్ డి లీడె (53 బంతుల్లో 41; 3 ఫోర్లు), కెప్టెన్ స్కాట్ ఎడ్వర్డ్స్ (68 బంతుల్లో 67 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) లంక బౌలింగ్‌కు ఎదుర్కొని గెలిపించేందుకు విఫల ప్రయత్నం చేశారు. తీక్షణ (3/31) కీలక వికెట్లను పడగొట్టగా, హసరంగ 2 వికెట్లు తీశాడు. హరారేలో జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో అమెరికాపై 6 వికెట్ల తేడాతో నెగ్గిన ఐర్లాండ్‌కు ఏడో స్థానం దక్కింది. అమెరికా 196 పరుగులకు ఆలౌట్ కాగా, ఐర్లాండ్ 34.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసి గెలిచింది.

గెలుపు దిశగా సెంట్రల్, నార్త్‌జోన్

దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్



సౌరభ్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో సెంట్రల్ జోన్, నార్త్‌జోన్ జట్లు గెలుపు దిశగా పయనిస్తున్నాయి. ఈస్ట్‌జోన్‌తో జరుగుతున్న పోరులో సెంట్రల్ ఆటగాళ్లు హిమాన్షు మంత్రి (68; 7 ఫోర్లు), వివేక్ సింగ్ (56; 4 ఫోర్లు, 2 సిక్సర్లు) బ్యాటింగ్‌లో రాణించగా, సౌరభ్ కుమార్ (4/33) స్పిన్ బౌలింగ్‌తో తిప్పేశాడు. శుక్రవారం 64/0 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు ఆటప్రారంభించిన సెంట్రల్‌జోన్ రెండో ఇన్నింగ్స్‌లో 87.5 ఓవర్లలో 239 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓపెనర్లు హిమాన్షు మంత్రి, వివేక్‌సింగ్ తొలి వికెట్‌కు 124 పరుగులు జోడించారు. అనంతరం 300 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలు పెట్టిన ఈస్ట్‌జోన్ సౌరభ్ స్పిన్ ఉచ్చులో పడింది. ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 69 పరుగులే చేసింది.

నార్త్ ఆల్‌రౌండ్ దెబ్బకు...

నార్త్‌జోన్ ఆల్‌రౌండ్ దెబ్బకు నార్త్ ఈస్ట్‌జోన్ కుదేలైంది. దీంతో మూడో రోజు ఆటలోనే నార్త్ ఈస్ట్‌జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లను కోల్పోయింది. మొదట 65/3 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన నార్త్ ఈస్ట్‌జోన్ 39.2 ఓవర్లలో 134 పరుగులకే కుప్పకూలింది. దీంతో నార్త్‌కు 406 పరుగుల భారీ ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌ను నార్త్ జోన్ 55.1 ఓవర్లలో 259/6 వద్ద డిక్లేర్ చేసింది. ప్రభ్ సిమ్రన్‌సింగ్ (59; 9 ఫోర్లు, 1 సిక్స్), అంకిత్ (70; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. దీంతో ప్రత్యర్థికి 666 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించగా, నార్త్ ఈస్ట్‌జోన్ ఆట నిలిచే సమయానికి 18 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసింది.

బైజూస్ స్థానంలో డ్రీమ్11

న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు జెర్సీ ప్రధాన స్పాన్సర్‌గా ఫాంటసీ స్పోర్ట్స్ లీగ్ కంపెనీ 'డ్రీమ్11' ఎంపికవడం దాదాపు ఖాయమైంది. ఈ విషయాన్ని బీసీసీఐ ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. అయితే ఎంత మొత్తానికి అనే విషయంపై మాత్రం ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటి వరకు టీమిండియా జెర్సీ స్పాన్సర్‌గా ఎడ్యుకేషనల్ టెక్నాలజీ కంపెనీ 'బైజూస్' ఉంది. గత ఏప్రిల్‌తో బైజూస్ ఒప్పందం ముగిసింది. దాంతో బీసీసీఐ కొత్త స్పాన్సర్ల కోసం బిడ్‌లను పిలిచింది. గతంలో ఐపీఎల్ టోర్నీ ప్రధాన స్పాన్సర్‌గా కూడా డ్రీమ్11 వ్యవహరించింది. అయితే బీసీసీఐతో కొత్త ఒప్పందం ప్రకారం... ఇప్పటివరకు బైజూస్ చెల్లించిన మొత్తం (ఒక్కో మ్యాచ్‌కు)కంటే డ్రీమ్11 తక్కువగా చెల్లించనున్నట్లు సమాచారం. లాంఛనాలు పూర్తి చేసిన తర్వాత దీనిపై బోర్డు అధికారిక ప్రకటన చేయనుంది.

'మిక్స్‌డ్' విజేత దీపిక-హరీందర్



హాంగ్‌జౌ (చైనా): ఆసియా స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన దీపిక పల్లికల్ – హరీందర్‌పాల్ సింగ్ సంధు జోడి విజేతగా నిలిచింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో దీపిక – హరీందర్ 11–10, 11–8 స్కోరుతో ఇవాన్ యుయెన్ – రాచెల్ ఆర్నాల్డ్ (మలేసియా)పై విజయం సాధించారు. అంతకు ముందు క్వార్టర్ ఫైనల్లో మలేసియాకు చెందిన టాప్ సీడ్ ఆయిరా అజ్మాన్ – షఫీక్ కమాల్‌ను...సెమీ ఫైనల్లో తయ్యద్ అస్లామ్ – ఫైజా జఫర్ (పాకిస్తాన్)ను భారత ద్వయం ఓడించింది. ఓవరాల్‌గా ఆసియా చాంపియన్‌షిప్‌ను భారత్ రెండు పతకాలతో ముగించింది. భారత్‌కు చెందిన అనాహట్ సింగ్ – అభయ్ సింగ్ కాంస్యం గెలుచుకున్నారు.

ఆస్ట్రేలియా ఆధిక్యం 221 పరుగులు

- రెండో ఇన్నింగ్స్‌లో 130/2
- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 325 ఆలౌట్



వికెట్ తీసిన సంబరంలో ఆస్ట్రేలియా ఆటగాళ్లు

లండన్: 'యాషెస్' సిరీస్‌లో తొలి టెస్టు గెలిచి జోరు మీదున్న ఆస్ట్రేలియా రెండో టెస్టులోనూ పట్టు బిగిస్తోంది. ఇంగ్లండ్‌తో 'లార్డ్స్' మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 45.4 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖ్వాజా (123 బంతుల్లో 58 నాటౌట్; 10 ఫోర్లు), స్టీవ్ స్మిత్ (6 నాటౌట్) ప్రస్తుతం క్రీజ్‌లో ఉన్నారు. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (25)తో పాటు మార్నస్ లబుషేన్ (30) అవుటయ్యారు. తొలి ఇన్నింగ్స్‌లో 91 పరుగుల భారీ ఆధిక్యం సాధించిన ఆస్ట్రేలియా ఓవరాల్‌గా 221 పరుగులు ముందంజలో ఉంది. మ్యాచ్ నాలుగో రోజు శనివారం కూడా మెరుగైన బ్యాటింగ్ ప్రదర్శన కొనసాగిస్తే భారీ లక్ష్యంతో ఇంగ్లండ్‌కు సవాల్ విసరవచ్చు. ఓవర్‌నైట్ స్కోరు 278/4తో మూడో రోజు ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 325 పరుగులకే ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (50) అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా... స్టోక్స్ (17), బెయిర్‌స్టో (16) విఫలమయ్యారు. ఆసీస్ బౌలర్లు సమష్టిగా రాణించడంతో శుక్రవారం ఇంగ్లండ్ బ్యాటింగ్ కుప్పకూలింది. 15.2 ఓవర్లు మాత్రమే ఆడగలిగిన ఆ జట్టు 47 పరుగులు మాత్రమే జోడించి మిగిలిన 6 వికెట్లు కోల్పోయింది. మిచెల్ స్టార్ 3 వికెట్లు పడగొట్టగా... ట్రవిస్ హెడ్, హాజల్‌వుడ్ చెరో 2 వికెట్లు తీశారు. వర్షం కారణంగా మొత్తం 61 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైంది. మరో వైపు గురువారం ఫీల్డింగ్ చేస్తూ గాయపడిన ఆసీస్ ప్రధాన స్పిన్నర్ నాథన్ లయన్ మూడో రోజు మైదానంలోకి దిగలేదు. గాయం తీవ్రంగా కనిపిస్తున్న నేపథ్యంలో అతను ఈ టెస్టుతో పాటు యాషెస్‌లో మిగిలిన టెస్టులకు కూడా దూరమయ్యే అవకాశం ఉంది.

క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్‌గా సీయూ

సాక్షి, హైదరాబాద్: క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్ 2024లో నంబర్‌వన్‌గా చండీగఢ్ యూనివర్సిటీ(సీయూ) నిలిచింది. అన్నీ ప్రైవేటు వర్సిటీల జాబితాలో దేశవ్యాప్తంగా మొదటి ర్యాంకు సాధించిన సీయూ అంతర్జాతీయ ప్రమాణాలతో బోధనా సిబ్బంది, విదేశీ విద్యార్థులతో భారతదేశ విశ్వవిద్యాలయాల్లో 2వ స్థానాన్ని సీయూ ఆక్రమించింది. మొహాలి క్వాక్వరెల్లి సైమండ్స్(క్యూఎస్) ర్యాంకింగ్స్ 2024లో దేశంలోనే చండీగఢ్ వర్సిటీ అరుదైన గుర్తింపు సొంతం చేసుకుంది.



ఐక్యరాజ్యసమితిలో కిషన్‌రెడ్డి ప్రసంగం

- జూలై 13, 14 తేదీల్లో న్యూయార్కులో 'హైలెవల్ పొలిటికల్ ఫోరమ్'
- ఆహ్వానం అందుకున్న తొలి భారత పర్యాటక శాఖ మంత్రి

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డికి అరుదైన ఆహ్వానం అందింది. ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ (యూఎన్‌డబ్ల్యూటీవో) ఆధ్వర్యంలో జూలై 13, 14 తేదీల్లో న్యూయార్క్‌లో జరగనున్న ప్రపంచ 'హై లెవల్ పొలిటికల్ ఫోరమ్'లో ప్రధాన వక్తగా ప్రసంగించనున్నారు. ఈ అవకాశం లభించిన తొలి భారత పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి కావడం గమనార్హం. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వేదికగా జరగనున్న 'హై లెవల్ పొలిటికల్ ఫోరమ్ సమావేశాల్లో ఆయన వివిధ దేశాల ప్రజా ప్రతినిధులు, అంతర్జాతీయ ప్రముఖ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. భారతదేశం జీ–20 సమావేశాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో.. కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా, 'జీ–20 దేశాల టూరిజం చైర్'హోదాలో కిషన్ రెడ్డి ఈ సమావేశాల్లో పాల్గొంటారు. ఇటీవలే గోవాలో జీ–20 దేశాల పర్యాటక మంత్రులు, 9 ప్రత్యేక ఆహ్వానిత దేశాల మంత్రుల సమావేశాలు విజయవంతంగా జరగడం, ఈ సందర్భంగా భారతదేశం చేసిన ప్రతిపాదనలను సభ్యదేశాలు, ఆతిథ్య దేశాల మంత్రులు ఏకగ్రీవంగా ఆమోదించడం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'పర్యాటక రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, అత్యవసర కార్యాచరణ కోసం ప్రపంచ దేశాలు, వివిధ భాగస్వామ్య పక్షాలను (వ్యాపార సంస్థలు) ఏకం చేయాల్సిన ఆవశ్యకత'ఇతివృత్తం (థీమ్)తో న్యూయార్క్‌లో ఐక్యరాజ్యసమితి వేదికగా ఈ సమావేశాలు జరగనున్నాయి. పర్యాటక రంగంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే క్రమంలో సాధించిన ప్రగతిని ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తున్న ఈ హైలెవల్ పొలిటికల్ ఫోరమ్ వేదికగా సమీక్షించనున్నారు. ఈ ఏడాది 'కరోనానంతర పరిస్థితుల్లో పర్యాటక రంగాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు ఉద్దేశించిన 2030 ఎజెండా అన్ని స్థాయిల్లో అమలు'పై కూడా ఈ సందర్భంగా చర్చించనున్నారు.




ప్రత్యేక పోస్టుకార్డులు, బ్రోచర్ ఆవిష్కరణ



నిర్మల్ జిల్లాలోని బౌద్ధక్షేత్రం బావాపూర్ కుర్రుకు సంబంధించిన వారసత్వ చిత్రాలతో భారత తపాలా శాఖ రూపొందించిన పోస్టు కార్డులు, తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రగతిపై ప్రత్యేక బ్రోచర్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. అబిడ్స్‌లోని డాక్‌సదన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ తపాలాశాఖ ఆధునీకరణకు ఒక్క తెలంగాణలోనే 7 వేల కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు వెల్లడించారు. – గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్)

అరుణాచలేశ్వరుని టూర్‌కి మరిన్ని బస్సులు



సాక్షి, హైదరాబాద్: అరుణాచలేశ్వరుని గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ తొలిసారిగా ప్రవేశపెట్టిన టూర్ ప్యాకేజీకి భక్తుల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. ఇప్పటివరకు 30 ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేశారు. ఈ బస్సుల్లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. భక్తుల రద్దీని బట్టి మరికొన్ని ప్రత్యేక బస్సులను నడిపేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ప్రత్యేక బస్సులన్నీ జూలై 1, 2 తేదీల్లో హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అరుణాచలానికి బయలుదేరుతాయి. అరుణాచల్ టూర్ ప్యాకేజీ కోసం భక్తులు ఆర్టీసీ వెబ్‌సైట్ www.tsrtconline.in నుంచి ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. జూలై 3న గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి టీఎస్‌ఆర్టీసీ రెండు రోజుల టూర్ ప్యాకేజీని ప్రకటించడం తెలిసిందే. మొదట కాణిపాకంలోని విఘ్నేశ్వరుని దర్శనానంతరం అరుణాచలానికి బయలుదేరుతారు. తిరుగు ప్రయాణంలో గోల్డెన్ టెంపుల్ దర్శనం కూడా ఉంటుంది. ప్యాకేజీలో భాగంగా మొదట ఒక ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయగా.. భక్తుల నుంచి భారీ డిమాండ్ రావడంతో బస్సుల సంఖ్యను పెంచినట్లు అధికారులు పేర్కొన్నారు.





Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.